వార్తలైన్ ప్రతి వారంలోని విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital



కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే

KAPIL GROUP

కపిల్ చిట్స్

Visit Us: www.kapilchits.com

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-12-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 311 పేజీలు: 10+4 వెల: 6.50


ద్వైపాక్షిక వాణిజ్యంపై చర్చించినట్లు సమాచారం

**పుతిన్ పర్యటన తర్వాత ట్రంప్ మాట్లాడడంలో ఆంతర్యం?**

సుంకాల విషయం కూడా ప్రస్తావన!

# ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్‌కాల్



**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** అమెరికాకు భారత్ దిగుమతులపై 50శాతం సుంకాలు, మరోపక్క రెండుదేశాలమధ్య జరుగుతున్న ట్రేడ్‌డీల్ ఖరారులో సందిగ్ధతల నడుమ గురువారం ప్రధానిమోడీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఫోన్‌కాల్‌భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవలికాలంలో సుంకాలు విదించిన క్రమంలో రెండుదేశాలమధ్య సంబంధాలు చెడిన సంగతి తెలిసిందే. రష్యా ముడిచమురు కొనుగోలుపై భారత్‌కు అదనంగా 25శాతం సుంకాలు విదించి ట్రంప్ భారత్‌ను తనవైపు తిప్పుకోవాలనిచూసారు. అలాగే ఆపరేషన్ సింధూర్‌నిలిపివేతలో తనదే కీలక పాత్ర అని చెప్పుకున్న ట్రంప్ వాదనను భారత్ ఖండించడం వంటి క్రమంలో గురువారం ఇరువురు అగ్రరాజ్య అధినేతలు సుదీర్ఘ చర్చలుజరిపారు. విభిన్న రంగాల్లోపరస్పర సహకారంపై ఇద్దరినేతలమధ్య చర్చలుజరిగాయి. వాణిజ్యం, సంక్లిష్ట టెక్నాలజీలు, ఇంధనం, రక్షణరంగం, భద్రతా రంగాలపరంగా ఇరువురిమధ్య చర్చలుజరిగాయనితెలుస్తోంది. ద్వైపాక్షిక సహకారం మరింత పటిష్టం చేసుకునేదిశగా ఇరువురిమధ్య చర్చలుజరిగాయి ద్వైపాక్షిక వాణిజ్యం పెంపొందించుకునేదిశగా తమ మధ్య చర్చలుజరిగినట్లు ఇరువురునేతలు ప్రకటించడం మరికొంత ఆసక్తిని >>2

# నేనూ అతిథినే..

**మెస్సీ మ్యాచ్‌కు రాహుల్, ప్రియాంకనూ ఆహ్వానించా..**

రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు

ఎఐసిసి అగ్రనేతలకు గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులు వివరించా: సిఎం రేవంత్



ప్రియాంకను మెస్సీ మ్యాచ్‌కు ఆహ్వానిస్తున్న సిఎం రేవంత్



సంగారెడ్డి జిల్లా కంకోల్‌లో ప్రాక్టిస్ చేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 11:** హైదరాబాద్‌లో జరగబోయే మెస్సీ ఫుట్‌బాల్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీ పర్యటన ముగించుకొని తిరిగి హైద రాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో పలు విషయాలపై మాట్లాడారు. ఈ నెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకా రుడు లియోనల్ మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నా రని, ఓ ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో పాల్గొంటారని తెలిపారు. తనను కూడా ఒక అతిథిగా మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పిలిచారని రేవం త్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. ప్రపంచంలోనే ప్రముఖ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కలిసిన పలువురు నాయకులను ఈ కార్యక్రమానికి రావాలని పిలిచినట్లు చెప్పారు. ఏఐసీసీ అగ్రనేతలను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన సందర్భంలో ఈనెల 8,9వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ద్వారా వచ్చిన పెట్టుబడులు గురించి చర్చించినట్లు సమాచారం. ఇవే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సరళి, అనుసరిస్తున్న ప్రణాళికల గురించి మాట్లాడినట్లు సమాచారం. ఈ నెల 13న ఉప్పల్ స్టేడి యంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ,సీఎం రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై చర్యలు చేపట్టారు. ఈనెల 13వ తేదీ శనివారం రోజున సాయంత్రం 4గంటలకు లియోనల్ మెస్సీ శంషా బాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి >>2



గురువారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

పంచాయతీ తొలివిడతలో

# కాంగ్రెస్‌దే హవా

2వ స్థానంలో బిఆర్ఎస్

**2,200 పైగా కాంగ్రెస్, 11వందలకు పైగా బిఆర్ఎస్, బిజెపికి 180**

**3వ స్థానంలోకి వెళ్లిన బిజెపి, మొత్తం 84.28 శాతం పోలింగ్**

**యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92.88 శాతం**

**భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో అతితక్కువగా 71.79శాతం**

**తొలి విడతలో ఓటు వేసిన మొత్తం 45,15,141 మంది ఓటర్లు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్11:** తెలంగాణ వ్యాప్తంగా జరిగిన తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 84.28 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడం జిల్లా 71.79 శాతంగా పోలింగ్ నమోదైంది. తొలి విడతలో మొత్తం 45,15,141 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం మొత్తం 3,834 గ్రామాల్లో సర్పంచ్, 27,678 వార్డు సభ్యుల స్థానాలకు >>2

బాధిత ప్రయాణికులకు

# రూ.10వేల ట్రావెల్ ఓచర్లు



**ఇండిగో యాజమాన్యం వెల్లడి**

**మెరుగు పడుతున్న విమాన సర్వీసులు**

**సంక్షోభం మళ్లీ రాదన్న ఇండిగో**

**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** సంక్షోభ సమయంలో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. గతవారం అంతరాయం కారణంగా వేలాది విమానాలు రద్దు, ఆలస్యం కావడంతో తీవ్రంగా ప్రభావితమైన ప్రయాణికులకు రూ.10 వేలు విలువైన అదనపు ట్రావెల్ వోచర్ల ను జారీ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ వోచర్లు డిసెంబర్ 3, 4, 5 తేదీల మధ్య ప్రయాణించిన వారికి మాత్రమే వర్తిస్తాయని ఇండిగో స్పష్టం చేసింది. ఈ ట్రావెల్ వోచర్లను రాబోయే 12 నెలల్లో ఇండిగోలో చేసే ఏ ప్రయాణానికైనా ఉపయోగించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ గందరగోళం కారణంగా తమ కస్టమర్లు చాలా మంది విమానాశ్రయాల్లో చాలా గంటల పాటూ చిక్కుకుపోయారని అంగీకరించింది. ఈ సందర్భంగా సంక్షోభంపై ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది. దేశంలో అతిపెద్ద విమానసంస్థ అయిన ఇండిగో ప్రస్తుతం తొలిసారిగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సేవలు ప్రభావితమయ్యాయి. గతపది రోజులుగా పెద్ద ఎత్తున విమానాలు రద్దుకావడం, రీషెడ్యూల్ అయ్యాయి. ఈ కారణంగా ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే విమానయాన మంత్రిత్వశాఖ విమానాల్లో కోతలు విధిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. డిజిసిఎ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. పౌరవిమానయానశాఖ అయితే సర్వీసుల్లో మొత్తం 10శాతం కుదించింది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ మధ్య దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు గంటల తరబడి చిక్కుకుపోయిన విషయాన్ని అంగీకరిస్తూ, జరిగిన అసౌకర్యానికి సంస్థ విచారం వ్యక్తం చేసింది. ఈ వోచర్లను రాబోయే 12 నెలల పాటు తమ భవిష్యత్ ప్రయాణాలకు ఉపయోగించుకోవచ్చని ఇండిగో ప్రతినిధి ఒక తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారానికి ఇది అదనమని స్పష్టం చేశారు. ఇప్పటికే రద్దయిన విమానాలకు సంబంధించిన రిఫండ్ల ప్రక్రియను ప్రారంభించినట్లు కూడా సంస్థ వెల్లడించింది. మరోవైపు గతవారం చోటుచేసుకున్న >>2



మంత్రి కొండా సురేఖపై

# నాన్‌బెయిలబుల్ వారంట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 11:** మంత్రి కొండా సురేఖపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. తనపై మంత్రి సురేఖ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఆమెపై పరువు నష్టం కేసు వేసిన సంగతి తెలిసిందే.

ఈ కేసులో విచారణకు హాజరు కాకపోవడంతో నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నాంపల్లి కోర్టు నాన్ బెయిలబుల్ వారంట్ ఇవ్వడంపై మంత్రి కొండా సురేఖ స్పందించారు.

నాకు ఎలాంటి నాన్ బెయిలబుల్ వారెంట్ అందలేదన్నారు. తదుపరి విచారణకు హాజరుకావాలని మాత్రమే కోర్టు చెప్పిందని వివరించారు. ఫిబ్రవరి 5న కోర్టుకు హాజరు కావాలని కోర్టు చెప్పిందని ఆమె అన్నారు.

మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావుకు

# 'సుప్రీం'లో ఎదురుదెబ్బ

నేడు సిట్ అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశం

**ఫోన్‌ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు**

కస్టోడియల్ విచారణకు అనుమతించిన జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్



**హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారం జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ధర్మాసనం, శుక్రవారం ఉదయం 11 గంటలలోపు జూబ్లీహి ల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎసిపి(సిట్ అధికారి) ఎదుట లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రభాకర్‌రావును కస్టోడియల్ దర్యాప్తు చేయడానికి ధర్మాసనం సిట్ పోలీసులకు అనుమతి ఇచ్చింది. అయితే, ఆయనకు భౌతికంగా ఎలాంటి హాని లేకుండా చూడాలని పేర్కొంది. తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా వేస్తూ చట్టప్రకారం ప్రభాకర్‌రావు దర్యాప్తు ప్రక్రియ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తూ విచారణకు సహకరించాలని న్యాయస్థానం చెప్పినా ఆయన దర్యాప్తునకు సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌లను రీసెట్ చేసి అందులోని వివరాలను దర్యాప్తు అధికారులకు చూపించాలని కోర్టు ఆయనకు చెప్పినప్పటికీ కేవలం రెండు పాస్‌వర్డ్‌లను మాత్రమే రీసెట్ చేశారని తెలిపారు. అందులో రీసెట్ చేసిన రెండు అకౌంట్లలోని సమాచారాన్ని ముందే డిలీట్ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ బివి నాగరత్న స్పందిస్తూ కోర్టు పిటిషనర్‌కు మధ్యంతర రక్షణ కల్పించడం వల్ల దర్యాప్తునకు ఏ మాత్రం సహకరించట్లేదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని దీనిపై మీరేమంటారని ప్రభాకర్‌రావు తరఫున న్యాయవాది రంజిత్ కుమార్‌ను ప్రశ్నించారు. పిటిషనర్ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్న పలు విషయాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఇరుపక్షాల వాదనల విన్న తర్వాత జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. >>2


గోవాక్లబ్ నిర్వాహకులు థాయ్‌లాండ్‌లో అరెస్టు 5

లోక్‌సభలో ఇ-సిగరెట్లపై దుమారం 5

17న హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము 3

'సర్' గడువు పొడిగింపు 5




డిజిటల్ సేఫ్టీలో తెలంగాణ

# రోల్ మోడల్

**మంత్రి శ్రీధర్ బాబు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్11:** తెలంగాణను "డిజిటల్ సేఫ్టీ"లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ >>2

# నియామకాలు పాత పద్ధతిలోనే..

**వచ్చే యేడాదిలో వర్సిటీలు విడివిడిగా నోటిఫికేషన్లు**

ఎవరి జోక్యం ఉండబోదన్న సిఎం

2878 పోస్టులకు ఉన్నది 753 మంది

**2017లోనే 1016 పోస్టులకు ఆర్థిక శాఖ ఆమోదం**



**హైదరాబాద్, ప్రభాతవార్త, డిసెంబరు 11:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. అందులో భాగంగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నారు. ఇప్పటికే తాను అధికారంలోకి వచ్చిన తరువాత 10 వేలకిపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయగా.. 1000కిపైగా జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేశారు. ఇప్పుడు యూనివర్సిటీల్లోని నియామకాలపైన దృష్టి పెట్టారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టనున్నట్టు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సభలో ప్రకటించారు. యూనివర్సిటీ నియామకాల్లో ప్రభుత్వం తలదూర్చదని స్పష్టం చేశారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా ఉద్యోగ నియామకాలు జరగాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా నియామకాల్లో ఇతరులు ఎవరైనా జోక్యం చేసుకుంటే వారి ఉద్యోగాలు ఉండబోవని హెచ్చరించారు. యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేసేందుకు గతంలో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ తన నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించింది. యూనివర్సిటీల్లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసంయూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిబంధనల మేరకే నియామకాలను చేపట్టనున్నారు. >>2



# లోయలో పడిన ట్రక్కు

**22 మంది కార్మికులు మృతి**

**అరుణాచల్‌లో దుర్ఘటన**

**ఇటానగర్, డిసెంబరు 11:** అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇండోచైనా సరిహద్దుకు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. 21 మంది కార్మికులతో వెళుతున్న ఓ ట్రక్కు అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు >>2



మహాకవి సుబ్రమణ్య భారతి జయంతి సందర్భంగా గురువారం న్యూఢిల్లీలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

## ప్రధాని మోడీకి ట్రంప్ ఫోన్‌కాల్

>> పెంచింది. రెండుదేశాలకు మేలుచేసే విధంగా కార్యాచరణ అమలుకు అధినేతలు అంగీకారానికి వచ్చారని అంచనా. భారత్ అమెరికా కంపాక్ట్ ఒప్పందాన్ని 21వ శతాబ్దం మొత్తం అమలుచేసే విధంగా ఇరువురునేతలు చర్చించినట్లు సమాచారం. కంపాక్ట్ అంటే కేటలైజింగ్ ఆపర్చునిటీస్ ఫర్ మిలిటరీ పార్టనర్‌షిప్ యాక్సిలరేటెడ్ కామర్స్ టెక్నాలజీ పరంగా ఇరుదేశాలు ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఫోన్‌కాల్ తర్వాత ప్రధానిమోడీ సోషల్‌మీడియా పోస్టులో అధ్యక్షుడు ట్రంప్‌తో అర్థవంతమైన చర్చలుజరిగాయని ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాలనినిర్ణయించామని, ప్రాంతీయ అంతర్జాతీయ పరిణామాలపైనా సుదీర్ఘ చర్చలుజరిపినట్లు తెలిపారు. అమెరికా భారత్ రెండుదేశాలు కూడా ప్రపంచ శాంతి, సుస్థిరత, సామరస్యంకోసం పనిచేయాలనినిర్ణయించినట్లు మోడీ తన పోస్టులో వివరించారు. అమెరికాతోభారత్ సంబంధాలు ఇటీవలికాలంలో భారీగా బెడిసికొట్టిన సంగతి తెలిసిందే. జులై నుంచి 25శాతం సుంకాలు అమలుచేసిన ట్రంప్ మరో 25శాతం రష్యాచమురుకొన్నందుకుగాను విధించడంపై భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఓవక్క రష్యా చమురు, గ్యాస్‌లను యూరోపియన్‌యూనియన్ భారీగా కొనుగోలుచేస్తుండగా భారత్‌పైనే ఏకపక్షంగా సుంకాలు వేస్తోందని ఆరోపించింది. ఈ ధోరణులు కొనసాగుతుండగానే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ భారత్‌లో 26 గంటలపాటు పర్యటించడం అమెరికాకు అస్సలు మింగుడుపడలదు. దీనితో వెంటనే నష్టనివారణ చర్యలకు ఉపక్రమించి వాణిజ్య చర్చలను వేగవంతంచేసింది. అమెరికా వాణిజ్యప్రతినిధి బృందం ఢిల్లీలోనే మకాంవేసి చర్చలు పురోగతిని తమ దేశాధ్యక్షుడికి వివరిస్తూ వస్తోంది. అదేవిధంగా పుతిన్ భారత్‌పర్యటనలో మోడీ పుతిన్‌లు ఒకే కారులో పర్యటించిన చిత్రాలు కూడా అమెరికాలో వైరల్ అయ్యాయి. డెమొక్రాటిక్ ప్రతినిధి ఒకరు పిఎంమోడీ పుతిన్ ఒకే కారులోప్రయాణించడం వంటివిషేర్‌చేసి ట్రంప్ విదేశాంగ విధానం విఫలం అయిందని విమర్శలు కూడా చేసారు. మనిషిపై ద్వేషం పెట్టుకుని ముక్కుకోసుకున్నట్లుగా ట్రంప్ వైఖరి ఉందని కూడా ఆ సెనేటర్ ఆరోపించారు. రెండుదేశాలమధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, పరస్పర బంధం తీవ్రస్థాయిలో దెబ్బతీసేవిధంగా చర్యలున్నాయని సిడ్నీ కమ్లాగేర్ డోవ్ వెల్లడించారు. ఇదిలా ఉంటే భారత వాణిజ్య మంత్రి పియూష్‌గోయల్‌మాట్లాడుతూ అమెరికాతో వాణిజ్యచర్చల్లో పురోగతి కనిపిస్తోందని, వాణిజ్యడీల్ సత్వరమే ముగుస్తుందని చెప్పుకొచ్చారేకానీ గడువు నిర్దిష్టమైన తేదీలు చెప్పలేకపోయారు.

### మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావుకు

## ‘సుప్రీం’లో ఎదురుదెబ్బ

>> బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలతోపాటు స్వపక్షంలోని పలువురు అగ్రనేతల నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికి తీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ ను ఏర్పాటు చేసింది. కెసిఆర్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించి ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని వారు ధృవీకరించి, పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ అధికారులు తనను అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్వదేశానికి వచ్చిన ప్రభాకర్ రావు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. కానీ ఈ విచారణలో అధికారులు సంధించిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## లోయలో పడిన ట్రక్కు

>> మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. అంజావ్ జిల్లాలోని హయులియాంగ్‌చగ్లాగం రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం వాస్తవానికి సోమవారం జరగ్గా, మూడు రోజుల తర్వాత ఈరోజు వెలుగులోకి వచ్చింది. ట్రక్కుతో పాటు లోయలో పడిపోయిన వారిలో ప్రాణాలతో బయటపడిన ఓ కార్మికుడు, తీవ్ర గాయాలతో సమీపంలోని పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ అధికారులకు సమాచారం అందించడంతో ఈ విషాద ఘటన గురించి బాహ్య ప్రపంచానికి తెలిసింది. ఈ విషయాన్ని అంజావ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మిల్లో కోజిన్ ధృవీకరించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంఇండో చైనా అంతర్జాతీయ సరిహద్దుకు 45 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 10,000 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉందని ఆయన తెలిపారు. ఇండోచైనా సరిహద్దు వెంబడి ఉన్న హయూలియాంగ్-చగ్లగామ్ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. అసోంలోని టిన్సుకియా జిల్లాకు చెందిన దినసరి కూలీలను తీసుకువెళ్తున్న ట్రక్కు మార్గం మధ్యలో అదుపుతప్పి లోతైన లోయలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో ట్రక్కులో 22 మంది కూలీలు మొత్తం చనిపోయినట్లు భావిస్తున్నారు.

### మాచర్లలో ‘పిన్నెల్లి’ సోదరుల లొంగుబాటు

**గుంటూరు, డిసెంబర్ 11, ప్రభాతవార్త ప్రతినిధి:** పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు. మాచర్లలోని జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు అన్నదమ్ములిద్దరూ కోర్టుకు వచ్చారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో ఎ6 పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎ7 పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి నిందితులుగా ఉన్న విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి రెండువారాల్లో లొంగిపోవాలంటూ వీరిద్దరికీ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది కూడా.. అయితే గురువారంతో సుప్రీం కోర్టు గడువు ముగియనుండటంతో ఉదయం మాచర్ల జూనియర్ సివిల్ కోర్టులో పిన్నెల్లి సోదరులు లొంగిపోయారు.

## నేనూ అతిథినే..

>> బయలుదేరి ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మ్యాచ్‌కు హాజరవుతారు. కేవలం ఉప్పల్ స్టేడియంలోనే రాచకొండ కమిషనరేట్‌కు సంబంధించిన పోలీసులు సుమారు 2వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఫలక్‌నూమా ప్యాలెస్‌లో మెస్సీబస**

భద్రత ఏర్పాట్లలో పోలీసులకు అదనంగా స్టేడియం లోపల వెయ్యి మంది వాలంటీర్లు డ్యూటీలో ఉంటారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫలక్ నుమా ప్యాలెస్, ఉప్పల్ స్టేడియం వరకు ప్రయాణించే మార్గాలు ఇప్పటికే ఫైనల్ అయ్యాయి. 13వ తేదీ రాత్రి కూడా ఫలక్‌నుమా ప్యాలెస్‌లోనే మెస్సీ బస చేస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్యాలెస్ పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం ఫలక్‌నూమా ప్యాలెస్‌ను తాజ్ హెటల్స్ యాజమాన్యం నిర్వహిస్తోంది. ఫలక్‌నూమా ప్యాలెస్‌కు రాకపోకలు సాగించే మార్గాలలో అనుమతి లేకుండా అక్రమంగా వచ్చేందుకు అవకాశమున్న ప్రాంతాలను పోలీసులను గుర్తిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు టికెట్లు, పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తారు. పాస్‌లు లేనివారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమితించలేమని నిర్వాహకులు స్పష్టం చేశారు. స్టేడియం దగ్గర రద్దీకి అవకాశం లేకుండా అభిమానులు సహకరించాలని, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

## వోక్సెన్ వర్సిటీలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్11:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట్ కంకోల్ లోని వోక్సెన్ యూనివర్సిటీని ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సందర్శించారు. యూనివర్సిటీలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ విభాగాలకు చెందిన ఎగ్జిబిషన్ స్టాల్స్, వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీని సందర్శించారు. సిఎం వెంట వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నారు. తర్వాత విద్యార్థులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం ప్రాక్టీస్ చేశారు. యూనివర్సిటీ ఫుట్‌బాల్ స్టేడియంలో విద్యార్థులతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడారు. 13వ తేదీన సాయంత్రం ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రపంచ దిగ్గజం మెస్సీతో సిఎం రేవంత్‌రెడ్డి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్నారు

### వారం - వర్జ్యం

12-12-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
అష్టమి మ.3.01
ఉత్తరఫల్గుణి తె.5.50, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : మ.3.06-4.51
దు.ఉ.8.41-9.26,
2) మ.12.24-1.09
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** రావలసిన మొత్తాలు, క్లయిములు చెల్లించ వలసిన పద్దులు పరిష్కార మవుతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**వృషభం:** మీ కృషి ఫలిస్తుంది. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం:** పిల్లల విద్యా, వివాహ, ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు కని పిస్తాయి. విందు వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** మీ ప్రవర్తనలో గానీ, వ్యవహారాలలో గాని దాపరికం, ఏకాంతత అవసరం. శుభవార్తలు వింటారు.

**సింహం:** ఒక వ్యవహారంలో మర్మంగా వ్యవహరిస్తారు. ఋణాలు ఇవ్వటం తీసుకోవటం వంటి లావాదేవీలు జరుపకండి.

**కన్య :** సంతానం విషయంలో కొంత మానసిన ఆందోళనకు గురవుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల:** మీ కుటుంబ వ్యవహారాలలో అతిగా జోక్యం చేసుకునే వారిని ఆదిలోనే తృంచివేయండి.

**వృశ్చికం:** తామరాకు మీద నీటి బిందువులా ఉండటం వలన లాభపడతారు. వస్తు లాభం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**ధనుస్సు:** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. సోదరుల కలయిక. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం:** ముఖ్యమైన పనుల విషయములో ఓర్పు వహించుట చాలా అవసరము. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం:** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం.

**మీనం :** వినోదమును సౌకర్యమును కలిగించే వస్తువులకు, పూజలకు దాన ధర్మములకు కాలమును వెచ్చిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## జిల్లాల వారీగా,పార్టీల వారీగా పంచాయతీ ఎన్నికల ఫలితాలు

| జిల్లాలు | కాంగ్రెస్ | బిఆర్ఎస్ | బిజెపి | ఇతరులు |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్(166) | 50 | 28 | 9 | 47 |
| భద్రాద్రి కొత్తగూడెం(159) | 82 | 43 | - | 28 |
| హనుమకొండ(69) | 22 | 16 | 7 | 13 |
| జగిత్యాల(122) | 54 | 37 | 13 | 15 |
| జయశంకర్ భూపాలపల్లి(82) | 53 | 19 | 2 | 6 |
| జనగామ(110) | 67 | 25 | - | 8 |
| రాజన్న సిరిసిల్ల(85) | 42 | 28 | 6 | 5 |
| మహబూబాబాద్(155) | 85 | 54 | 5 | 9 |
| మహబూబ్‌నగర్(139) | 65 | 58 | 1 | 15 |
| మంచిర్యాల(90) | 45 | 17 | 6 | 18 |
| మెదక్(160) | 103 | 43 | - | 10 |
| ములుగు(48) | 35 | 12 | - | 1 |
| నాగర్‌కర్నూల్(151) | 89 | 46 | 6 | 10 |
| నల్లగొండ(318) | 195 | 76 | 7 | 30 |
| నారాయణపేట(67) | 43 | 8 | 2 | 14 |
| నిర్మల్(136) | 52 | 18 | 17 | 47 |
| నిజామాబాద్(184) | 107 | 18 | 15 | 19 |
| పెద్దపల్లి(99) | 59 | 25 | - | 10 |
| రంగారెడ్డి(174) | 88 | 66 | 5 | 15 |
| సంగారెడ్డి(136) | 65 | 41 | 2 | 16 |
| వనపర్తి(87) | 42 | 31 | 4 | 10 |
| సిద్దిపేట(163) | 60 | 70 | 9 | 19 |
| సూర్యపేట(159) | 92 | 55 | 3 | 8 |
| వికారాబాద్(263) | 177 | 73 | 4 | 8 |
| జోగులాంబ గద్వాల(106) | 62 | 11 | 8 | 23 |
| కామారెడ్డి(167) | 58 | 44 | 18 | 22 |
| కరీంనగర్(92) | 34 | 17 | 20 | 20 |
| ఖమ్మం(192) | 131 | 38 | - | 19 |
| కుమరంభీమ్ అసిఫాబాద్(114) | 32 | 35 | 6 | 21 |
| వరంగల్(91) | 50 | 24 | 2 | 5 |
| యాదాద్రి భువనగిరి(153) | 81 | 52 | 2 | 17 |
| మొత్తం | 2230 | 1130 | 181 | 510 |




గురువారం న్యూఢిల్లీలోని ‘డీపెనింగ్ ది కార్పొరేట్ బాండ్ మార్కెట్ రిపోర్ట్’ నివేదిక విడుదల కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నీతి ఆయోగ్ సిఇఒ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం

## నియామకాలు పాత పద్ధతిలోనే..

>> గతంలో యూనివర్సిటీల్లో నియామకాల కోసం రాత పరీక్షను నిర్వహించాలని.. నియామకాల కోసం నియామక బోర్డును ఏర్పాటు చేయాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేయగా.. అప్పటి గవర్నర్ ఆ ప్రతిపాదనను ఆమోదించ లేదు. దీంతో నియామక ప్రక్రియ ఆగిపోయింది. తరువాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియామకాల కోసం కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు వీసీలతో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను సమర్పించింది. ఈ నేపథ్యంలో గతంలో యుజిసి నిబంధనల మేరకు ఎలాగైతే యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టారో.. అదేవిధంగా చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి కూడా ఇందుకు అంగీకారం తెలిపినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీల్లో నియామకాలు చేపడతామని ఓయూలో ప్రకటించారు. దీంతో వచ్చే ఏడాది యూనివర్సిటీల వారీగా నోటిఫికేషన్లను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం గత పదమూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో ప్రస్తుతం 753 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు కొనసాగుతున్నారు. మిగిలిన 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టియుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొపెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. 11 విశ్వవిద్యాలయాల్లోనూ ప్రొఫెసర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వరకు ఖాళీలున్నాయి. ఇక కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నిలిచిపోయింది. ఇపుడు యూనివర్సిటీల్లో నియామక ప్రక్రియను ప్రారంభించాలనుకున్నప్పటికీ ఇప్పటికే యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీరు అన్ని యూనివర్సిటీల్లో కలిపి సుమారు 1100 మంది వరకు ఉంటారని యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నేతలు చెబుతున్నారు. వారితో ఇప్పటికే ప్రభుత్వం తరపున ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ పలుదఫాలు చర్చలు జరిపి వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో వారికి నష్టం జరగకుండా.. అలాగే యూనివర్సిటీల్లో చేరుతున్న విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

### పంచాయతీ తొలివిడతలో

## కాంగ్రెస్‌దే హవా

>> పోలింగ్ జరిగింది. ఒంటిగంట లోపు క్యూలైన్‌లో ఉన్నవారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. పోటీచేసిన 12,960 మంది సర్పంచి అభ్యర్థుల, 65,455 మంది వార్డు మెంబర్ అభ్యర్థుల ఫలితాలు రాత్రి పొద్దుపోయే వరకు వెల్లడయ్యాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా నడిచింది. 2వేల 200 వరకు సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు గెలువగా, 11వందలకు పైగా సర్పంచ్ స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు గెలిచారు. 180 స్థానాల వరకు బిజెపి మద్దతు ఇచ్చిన అభ్యర్థులు గెలిచారు. 500 వరకు స్థానాల్లో కమ్యూనిస్టులు, ఇతర పార్టీల వారు, ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలిచారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు అన్ని చోట్ల బారులు తీరారు. చలిలో చంటి పిల్లలతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు అంబులెన్స్‌లో వచ్చారు. ఉపాధి కోసం నగరాలు, పట్టణాల్లో ఉన్న ఓటర్లు స్వస్థలాలకు చేరుకొని తమ ఓటు వేశారు. పోలింగ్ జరుగుతున్న గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు బందోబస్తు నిర్వహించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని అధికారులు పర్యవేక్షించారు. పోలింగ్ ముగియడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ప్రారంభం అయ్యింది. కౌంటింగ్ ముగుస్తున్న కొద్ది అధికారులు విజేతలను ప్రకటించారు. ఉపసర్పంచ్‌ల ఎన్నిక ప్రక్రియను కూడా వెంటనే నిర్వహించారు. సుమారు లక్ష మందికిపైగా సిబ్బంది ఎన్నికల విధుల్లో సేవలు అందించారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో పనిచేశారు. నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కుప్పగండ్ల పదోవార్డులో పోలింగ్ కాసేపు నిలిచిపోయింది. బ్యాలెట్ పేపర్‌పై వార్డు అభ్యర్థి దేరాంగుల యాదమ్మకు గుర్తు కేటాయించకపోవడంతో అధికారులు పోలింగ్‌ను నిలిపివేశారు. అరగంట తరువాత వేరే బ్యాలెట్ పేపర్లు తీసుకొచ్చి పోలింగ్‌ను ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర అవస్థలు పడ్డారు. వీల్‌ఛైర్‌లు లేకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. కుటుంబసభ్యులు వారిని చేతులపై మోసుకుంటూ వెళ్లి ఓటు వేయించారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ నేపథ్యంలో పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. ముందస్తుగా 31,428 మందిని బైండోవర్ చేసినట్లు పోలీసుశాఖ వెల్లడించింది.

## రూ.10వేల ట్రావెల్ ఓచర్లు

>> భారీ వైఫల్యాలపై దర్యాప్తు చేసేందుకు బయటి సాంకేతిక నిపుణులను నియమించనున్నట్లు ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు. సమస్య మూల కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 8 నుంచి అన్ని గమ్యస్థానాలకు సేవలను పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు పూర్తిస్థాయిలో స్థిరపడ్డాయని ఇండిగో పేర్కొంది. సురక్షితమైన, నమ్మకమైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. 1,950కి పైగా విమానాలను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ సర్వీసుల ద్వారా సుమారు 3 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు తెలిపిందిగత కొన్ని రోజులుగా కార్యకలాపాలు మెరుగుపడ్డాయని, ఈ నెల 9 నుంచి సేవలు స్థిరంగా కొనసాగుతున్నాయని కంపెనీ ప్రతినిధి తెలిపారు. ఇండిగో అంతరాయాల వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా క్షమాపణ చెప్పారు.

ఈ వైఫల్యానికి గల మూల కారణాలను గుర్తించేందుకు బయటి సాంకేతిక నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇండిగో కార్యకలాపాలను నిశితంగా పరిశీలించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 8 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలోని ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలో ఉండి రోజువారీ ప్రక్రియలను పర్యవేక్షిస్తారు.

## రోల్ మోడల్

>> లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే ‘తెలంగాణ రైజింగ్ విజన్ 2047’ డాక్యుమెంట్ లోనూ కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను పొందుపర్చామన్నారు. గురువారం హెచ్ఐసీసీలో నిర్వహించిన ‘సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) కాంక్లేవ్ 2025’ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... రోజుకో తరహాలో మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరగాళ్లు సవాలు విసురుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా 265 మిలియన్లకు పైగా సైబర్ దాడులు జరిగాయన్నారు. తెలంగాణలోని కీలక రంగాలకు చెందిన సంస్థలు, కంపెనీలపై గతేడాది 17వేలకు పైగా రాన్సమ్ వేర్ దాడులు జరిగినట్లు ఓ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ అధ్యయనంలో తేలిందన్నారు. ఒక్క సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే ఏడాది వ్యవధిలో రూ.800 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టడం వాస్తవ పరిస్థితికి నిదర్శనమన్నారు. ఇలాంటి తరుణంలో సాంప్రదాయ పోలీసింగ్ కాకుండా స్మార్ట్ పోలీసింగ్ అవసరమని గుర్తు చేశారు. పౌరుల భాగస్వామ్యంతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని వివరించారు. మోసం జరిగిన తర్వాత కాకుండా ముందే స్పందించి సైబర్ నేరగాళ్లను కట్టడి చేసే వ్యవస్థ అవసరమన్నారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ డేటా సిస్టమ్స్, రియల్ టైం మానిటరింగ్, ఓపెన్ ఇన్ఫర్మేషన్ లాంటి అధునాతన వ్యవస్థల ద్వారా తమ ప్రభుత్వం పౌరుల డిజిటల్ సేఫ్టీకి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ... వారిని ‘వారియర్స్’గా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు ఐఎఎస్‌లకు హైకోర్టు షాక్

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లకు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఇరువురికి నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేశారని, ఆర్టీఐ చట్టం ప్రకారం తాను అడిగిన సమాచారం ఇవ్వలేదంటూ ఒకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం సంచలన ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు ఆర్టీఐ అప్పీలేటు అధికారులుగా ఉన్న మాజీ జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలు ఇచ్చిప్పటికీ ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వడానికి ఇబ్బంది ఏంటని న్యాయమూర్తి భీమపాక రాష్ట్ర ప్రభుత్వం తరపు లాయర్‌ను ప్రశ్నించారు. సదరు ఐఏఎస్‌లపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దో వివరణ ఇవ్వాలన్నాని పేర్కొన్నారు. అదేవిధంగా కేసులో జనవరి 26 లోపు కౌంటర్ దాఖలు చేయాలని, లేదంటే వారి అఫిడవిట్లు స్వీకరించాలన్నారు. చేసిన తప్పుకు 10 వేల రూపాయల వరకు జరిమానా కూడా విధించాల్సి ఉంటుందని హైకోర్టు ధర్మాసనం హెచ్చరించింది.



# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయంపై పెద్దల ప్రశంసలు

### సోనియాగాంధీ, ఖర్గే, ప్రియాంకలను కలిసిన సిఎం రేవంత్‌రెడ్డి

### తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌పై సిఎంకు అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 11:** తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని వారు పేర్కొన్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను వారి నివాసాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారి మధ్య చర్చ కొనసాగింది. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సీఎంను ప్రశంసించారు. సీఎం వెంట మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ ఉన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించిన తీరును ఆమెకు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, ఇతర రంగాల వారి నుంచి సదస్సుకు వచ్చిన స్పందన, పెట్టుబడుల గురించి వివరించారు. రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు జరిగిన ఒప్పందాలను చెప్పారు. రాష్ట్ర తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చించారు.

**సిఎం రేవంత్‌కు అభినందనలు తెలిపిన ఎంపిలు**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను ఘనంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రానికి రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో కలిసి అభినందనలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, సురేష్ షెట్కార్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. అనిల్ కుమార్.. సీఎం వెంట మంత్రి వివేక్ వెంకట స్వామి తదితరులు ఉన్నారు.



ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న బిసి నేతలు

# ముఖ్యమంత్రి పదవి నుంచి రేవంత్‌రెడ్డిని తొలగించాలి

### ఎఐసిసి కార్యాలయం ముట్టడించిన బిసిలు

**హైదరాబాద్ (సిఫాబాద్), డిసెంబరు 11, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన సిఎం రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ అనేకమంది బిసిలు గురువారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. జాతీయ బిసి సంక్షేమ సం ఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ర్యాగ రుషి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడి కార్యక్రమంలో అనేకమంది బిసిలు పాల్గొని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ బిసిలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున ఆయన్నీ వెంటనే తొలగించాలని ఎఐసిసి నేత రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. బిసిలకు రిజర్వేషన్‌లు కల్పిస్తామని రెండేళ్లుగా సిఎంగా డ్రామాలు కొనసాగించి, ఇప్పుడు చేతులెత్తేయడం దగా, మోసం, నయవంచన చేయడమేనని విమర్శించారు. బిసిలను మోసం చేసినదానికి రాహుల్ గాంధీయే బాధ్యత వహించాలని, జనవరిలో పెద్దఎత్తున బిసిలను సమీకరించి, జనపథ్ వద్ద ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ముట్టడి కార్యక్రమంలో బిసి నేతలు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, అజయ్‌కుమార్, జక్కిణి సంజయ్, పద్మ, అనురాధ, వేణుమాధవ్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ల్యాడ్జీలో మైనర్ బాలికపై గ్యాంగ్‌రేప్

### నిందితుల అరెస్ట్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), డిసెంబరు 11, ప్రభతవార్త:** ఓ బాలికను ల్యాడ్జీలో బంధించి గ్యాంగ్‌రేప్ చేసిన సంఘటన సికిందరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన 13 యేళ్ల బాలిక ఈ నెల 4న తప్పిపోయి సికిందరాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని 31వ నంబరు బస్టాప్‌కు వచ్చి ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుపై తిరుగుతూ ఉండిపోయింది. ఆ బాలికను గమనించి ఇంటికి తీసుకెళ్తామంటూ ల్యాడ్జీకి తీసుకెళ్లి ల్యాడ్జీలో బంధించి 6 దుండగులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆ బాలిక సికిందరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బాబాసెంటర్ ల్యాడ్జీలో ఉన్నట్లు గుర్తించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని బాలికపై నిందితులను అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా లాడ్జ్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అందరి దృష్టి మెస్సీపైనే

### ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌కు భారీ భద్రత

### ఏరాట్లు సమీక్షించిన డిజిపి శివధర్‌రెడ్డి


**హైదరాబాద్ (ఉప్పల్), డిసెంబరు 11, ప్రభాతవార్త :** హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈనెల 13న జరిగే అర్జెంటీనా ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సీ, సిఎం రేవంత్‌రెడ్డి జట్ల మధ్య జరిగే ఫుట్ బాల్ మ్యాచ్ ఏర్పాట్లపై రాష్ట్ర డిజిపి పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు గురువారం పలువురు అధికారులతో కలిసి స్టేడియం వద్ద మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలించారు. ఈనెల 13న ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీతో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన భద్రతాపరమైన, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. జిహెచ్ఎంసి, విద్యుత్ శాఖ, వాటర్ వర్క్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చెందిన అధికారులతో పాటు మ్యాచ్ నిర్వాహకులు కూడా సమావేశంలో హాజరై, తమ శాఖల ద్వారా జరుగుతున్న ఏర్పాట్లను డిజిపి కి వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ మ్యాచ్‌కు తరలివచ్చే ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. స్టేడియం వద్ద సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఫుట్‌బాల్ ప్రొఫెషనల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సికి ఉన్న ప్రపంచవ్యాప్త ఇమేజ్ దృష్ట్యా, సిఎం ఎ.రేవంత్ రెడ్డి పాల్గొంటున్నందున భద్రతాపరమైన ఏర్పాట్లు అత్యంత పటిష్టంగా ఉండాలని సూచించారు. స్టేడియం వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రేక్షకులకు సంబంధించిన మార్గదర్శకాలను, భద్రతా నియమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇందుకోసం మెట్రో రైళ్లలోనూ, నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే ప్రచార బోర్డుల ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ట్రాఫిక్ మళ్లింపు వివరాలను తెలియజేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, అధికారులు ఉప్పల్ స్టేడియం భద్రతాపరమైన అనుకూలతలను డిజిపి కి వివరించారు. 23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ రాజీవ్ గాంధీ క్రికెట్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందని, సెక్యూరిటీ పరంగా చాలా అనువైనదని వారు తెలిపారు. స్టేడియాన్ని సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్ అని నాలుగు ప్రధాన సెక్టర్లుగా విభజించడం జరిగిందని, దాదాపు 39 వేల మంది కూర్చునే సామర్థం ఈ ప్రాంగణానికి ఉందని వివరించారు. అధికారులం దరూ సమన్వయంతో పనిచేసి, ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ మ్యాచ్‌ను ఎటువంటి లోపాలు లేకుండా, విజయవంతంగా



నిర్వహించాలని డిజిపి అన్నారు. సమీక్షా సమావేశంలో శాంతిభద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, డిజి, ఎస్పీఎఫ్ స్వాతి లక్రా, అడిషనల్ డిజిపి సిఐడి చారు సిన్హా, అడిషనల్ డీజీపీ (ఇంటెలిజెన్స్) విజయకుమార్, డిజి, ఫైర్ సర్వీసెస్ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, నార్కో టిక్స్ బ్యూరో ఎస్పీ పద్మజ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె.శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**స్టేడియం వద్ద విస్తృతంగా తనిఖీలు**

ఉప్పల్ స్టేడియంలో ఈనెల 13న ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీతోపాటు, సిఎం రేవంత్‌రెడ్డి హాజరుకానుండడంతో స్టేడియం వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. స్టేడియంలోని అన్ని గేట్ల వద్ద ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి ఇతరులను అనుమతించడం లేదు. స్టేడియం సిబ్బందితోపాటు, ప్రత్యేక పోలీసులను మాత్రమే అనుమతిస్తున్నారు. స్టేడియంకు వెళ్లే రహదారుల వెంట చెట్ల కొమ్మలు తొలగించడంతోపాటు, రోడ్లను సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. జిహెచ్ఎంసి అధికా రులు



ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. స్టేడియం రహదారిని తిరిగి కొత్తగా ముస్తాబు చేస్తున్నారు.

**మెస్సీ మ్యాచ్‌కు పాసులు ఉంటేనే ఎంట్రీ : సిపి సుధీర్‌బాబు**

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఈనెల 13న జరిగే మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పాసులు ఉంటేనే ఎంట్రీ ఉంటుందని, లేకుంటే లోపలికి అనుమతి లేదని రాచకొండ సిపి సుధీర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ ఈనెల 13న సాయంత్రం జరిగే మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని గేట్ల వద్ద మూడంచెల భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని తెలిపారు. పాసులు లేని వారు స్టేడియం పరిసరాల్లోకి రావద్దని సూచించారు. తెలంగాణ సీఎం - మెస్సీతో జరిగే మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం వద్ద రద్దీ ఏర్ప డకుండా తగుజాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. టికెట్, పాసులు ఉన్న వారు మాత్రమే స్టేడియం వద్దకు రావాలని, పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని, మిగిలిన వారికి ఎట్టి పరిస్థితిలో అనుమతి లేదన్నారు. క్రీడాభిమానులు సహకరించాలని ఆయన కోరారు.

# 17న నగరానికి రాష్ట్రపతి ముర్ము

### శీతాకాల విడిది కోసం ముస్తాబవుతున్న రాష్ట్రపతి నిలయం

### ఏర్పాట్లను సమీక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



రాష్ట్రపతి నిలయం(ఫైల్) -ఇన్‌సెట్‌లో రాష్ట్రపతి ముర్ము (ఫైల్)

**హైదరాబాద్ (అల్వాల్), డిసెంబరు 11, ప్రభతవార్త:** దేశ ప్రథమ పౌరురాలికి ఆతి ధ్యం ఇచ్చేందుకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ముస్తాబవు తోంది. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నగరానికి రాను న్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఐదు రోజులుపాటు బస చేస్తారు. ఈ నేపథ్యం లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతి పాదికతన ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యాయి. 17వ తేదీ మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు ఆమె చేరుకుంటారు. అనంతరం నగరంలోని పలు కార్యక్రమాలకు ఆమె హాజరవుతారు. 21వ తేదీ మధ్యాహ్నం మళ్లీ ఆమె ఢిల్లీకి పయనవుతారు. రాష్ట్రపతి నగరంతో పాటుగా ఇతర రాష్ట్రాలకు అధికార పర్యటనలకు ఇక్కడి నుంచే వెళ్తారు. దేశ మొట్ట మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మొదలు నేటి ద్రౌపది ముర్ము వరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బస చేసిన వారే. సిమ్లాలో రాష్ట్రపతి విడిది భవనం మరొకటి ఉంది. దక్షిణాది ప్రాంతం లో బొల్లారంలో మాత్రమే రాష్ట్రపతికి భవనం ఉండడం విశేషం. జి హెచ్ ఎంసి, కంటో న్మెం ట్ విభాగాలుతో పాటుగా పోలీసు, విద్యుత్, జలమండలి సిబ్బంది వసతులు కల్పించడానికి నిరంతరం శ్రమిస్తు న్నారు. రాష్ట్రపతి బస చేసే అన్ని రోజులు రక్షణ బాధ్యతలను స్థానిక పోలీసు యంత్రాంగం చేపడుతుంది.

**రాష్ట్రపతి నిలయం నేపథ్యం**

1805లో బ్రిటీష్ పాలకులు నిర్మించిన ఈ భవనాన్ని వైస్రాయ్ అతిథి గృహంగా పిలిచేవారు. దీనికి పక్కనే తెలంగాణా ఆంధ్రా సబ్‌ఏరియా ప్రధాన కార్యాలయం ఉండడంతో అక్కడికి వచ్చే అధికారులు వైస్రాయల్ అతిథి గృహంలో నివసించే వారు. స్వాతంత్ర్యం అనంతరం 1950లో ఈ భవనాన్ని భారత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడంతో రాష్ట్రపతి నిలయంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుంచి దక్షిణాది పర్యటన ప్రారంభమైంది. జూలై, ఆగస్టు నెలల్లో గాని లేదా డిసెంబరు, జనవరి నెలల్లో రాష్ట్రపతులు ఇక్కడ పర్యటిస్తారు.

**సమీక్ష జరిపిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామకృష్ణా రావు వివిధ విభాగాల ఉన్నతాధికారులుతో సమీక్ష చేశారు. సచివాలయంలో జరిగిన సమావేశంలో అన్ని విభాగాలు రాష్ట్రపతి నిలయం సిబ్బందితో సమన్వయంతో పని చేయాలని కోరారు. పోలీసు శాఖ భద్రతా, ట్రాఫిక్, బందోబస్తును పకడ్బందీగా చేపట్టాలని, అగ్నిమాప శాఖ, వైద్య ఆరోగ్యం, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రపతి నిలయం పరిసరాలులో కోతులు, తేనె టీగలు, పాములు బెడదతను తగ్గిం చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిహెచ్ఎంసి, కంటోన్మెంట్ బోర్డులు పారిశుధ్యం ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు.

# మొదటి ఓటే చివరి ఓటాయె..

### లారీ ఢీకొట్టి యువకుడి మృతి

**బొమ్మలరామారం, డిసెంబరు 11, ప్రభాతవార్త:** లారీ ఢీకొట్టి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రంగా పూర్‌లో చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే.. రంగాపూర్‌లో నర్సరీ ఏర్పాటు చేసుకొని జీవ నం చేస్తున్న కుటుం బంలో యువకుడు కొండ సందీప్ వయసు (23) స్థానిక ఎలక్షన్లో ఓటు హక్కు విని యో గించుకుని వస్తుండగా రోడ్డు దాటు తుం డడంతో హైదరాబాదు నుండి వస్తున్న లారీ ఢీకొట్టడంతో గురువారం అక్కడికక్కడే మృతి చెందాడు బతుకుదెరువు కోసం రంగా పూర్ గ్రామానికి వచ్చిన యువకుడు ఓటు హక్కును వినియోగించుకుని తిరిగి ఇంటికి పోతున్న సమయంలో లారీ గుద్దడంతో అక్కడికక్కడే మృతి చెందాడు మొదటిసారి ఓటు హక్కును విని యోగించుకుని వెళ్తున్న యువకునికి అదే చివరి ఓటు అయ్యింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గ శ్రీశైలం తెలిపారు ఎస్సై బుగ్గ శ్రీశైలం తెలిపారు.



# ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సంతకాలు

### ఢిల్లీకి గురువారం ఉదయం ట్రక్కులో ఫైళ్లు రవాణా

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణలో ఓట్ చోరీ గద్దీ చోడ్ నినాదానికి మద్దతుగా పది లక్షలపైగా సంతకాలను విజయవంతం సేకరించి ఢిల్లీకి బుధవారం, గురువారం రాత్రి 12గంటలకు ఢిల్లీకి గాంధీభవన్ నుంచి ఢిల్లీకి ట్రక్కులో పంపినట్లు టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ తెలిపారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓట్ చోరిపై బిజెపి, ఎన్నికల కమిషన్ ద్వారా చేస్తున్న మోసంను బహిర్గతం చేసి, దాన్ని ప్రజల్లోకీ తీసుకెళ్ళారని గురువారం గాంధీభవన్‌లో విలేఖరులకు ఆయన వివరించారు. ఓట్ల దొంగతనం కీ అడ్డుకట్ట వేసి, పారదర్శక ఎన్నికలు జరిగే విదంగా చేస్తున్న పోరాటం లో భాగం గ దేశ వ్యాప్తి గ సంతకాల సేకరణ కార్యక్రమం చెబెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా తెలంగాణ లో టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో గ్రామ స్థాయి లో సంతకాల సేకరణ చేసారని చెప్పారు. 10 లక్షల పై చిలుకు సంతకాల సేకరణ చేసి ఢిల్లీ ఎఐసిసి కార్యాలయం పంపడం జరిగిందని అన్నారు. దేశ వ్యాప్తంగా సేకరించిన సంతకాల సేకరణ పత్రాలని, 14 వ తేదీ ఢిల్లీ లో రాం లీల మైదానం లో జరుగుతున్న భారీర్యాలీకి తీసుకెళుతామని అక్కడ నుంచి రాష్ట్రపతి ముర్ము వాటిని అందజేసి ఎన్నికలు పారదర్శకంగా జరిగే విదంగా చూడాలని అభ్యర్థించనున్నారు. తెలంగాణ నుండి సేకరించిన 10 లక్షల పై చిలుకు పత్రాలని 10 వ తేదీ రాత్రి 12 గంటలకు గాంధీ భవన్ నుండి ట్రక్ ద్వారా పంపించామని చెప్పారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి లు ప్రసన్న కుమార్, కొప్పుల ప్రవీణ్ టిపిసిసి బాధ్యులు గంప వేణుగోపాల్, అన్సారీ లు జెండా ఊపి, ట్రక్‌ను ఢిల్లీ పంపించారు.

# అఖండ-2కు హైకోర్టు మరో షాక్

### ప్రీమియర్ షో, టికెట్ ధరలు పెంపు సర్క్యులర్ రద్దు

### సినీనిర్మాణ సంస్థ, ఎఫ్‌డిఐ, హోంశాఖకు నోటీసులు

### తెలంగాణ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త ప్రతినిధి:** అఖండ-2 సినిమా ప్రదర్శించే ప్రీమియర్ షో సహా టికెట్ ధరలు పెంచుతూ తెలంగాణ ప్రభు త్వం ఇచ్చిన సర్క్యులర్‌ను హైకోర్టు సస్పెండ్ చే సింది. ఈ క్రమంలో సినీ నిర్మాణ సంస్థ 14 రీల్స్ పల్స్‌కు, ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొ రేష న్‌కు, తెలంగాణ రాష్ట్ర హోంశాఖకు న్యాయ స్థానం నోటీసులు జారీ చేసింది. అఖండ-2 టికెట్ల ధర పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి పిటిషన్‌ను వేశారు.

ఈ లంచ్ మోషన్ పిటిషన్‌కు అనుమతించి న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. టికెట్ల ధరల పెంపుతో పాటు ప్రత్యేక షోల నిర్వహణపై విచారణ చేపట్టింది. జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్‌ఈ లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టారు. ఇలాంటి మెమోలు ఎందుకు జారీ చేస్తున్నారని హోంశాఖ న్యాయవాదిని ప్రశ్నించింది. ఇప్పటికే టికెట్‌ధరల విషయంలో ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది కదా అని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచుతూ మెమోలు జారీ చేయడం కోర్టు ధిక్కరణ కాదా అని అడిగింది.

టికెట్‌ధరల విష యంలో ఏం జరుగుతుందని హోంశాఖ జీపీని హైకోర్టు ప్రశ్నించింది. హోంశాఖ ప్రత్యేక కార్య దర్శిపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోరాదో చెప్పాలని ప్రభుత్వ తరఫున న్యాయవాదిని హైకోర్టు మరోసారి ప్రశ్నించింది. ప్రతి సినిమాకు ఇదే విధంగా ధరలు పెంచు కుంటూ సర్క్యులర్ జారీ చేస్తున్నారని ఆగ్రహిం చింది.

హైకోర్టు ఆదేశాలంటే లెక్కలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హోంశాఖ స్పెషల్ సీఎస్‌గా కొత్త వ్యక్తి వచ్చారని కోర్టు ఆదేశాలపై పూర్తి అవగాహన లేదని జిపి తెలిపారు.

వాద ్నలు విన్న హైకోర్టు అఖండ-2 కో సం ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేసింది. ప్రీమియర్‌షోతో పా టు టికెట్‌ధరలను పెంచుతూ జారీ చేసిన జీవోను రద్దు చేసింది. ఈ క్రమంలో హోంశాఖ, 14 రీల్స్ ప్లస్, ఫిలిం టెలివిజన్ థియేటర్ డెవలప్ మెంట్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

**అఖండ-2 చిత్రం ప్రీమియర్**

షో సహా టికెట్ ధరలు పెంపునకు అనుమతిస్తూ బుధవారం తెలంగాణ హోంశాఖ సర్క్యులర్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై గురువారం హైకోర్టులో విచారణకు రాగా ఆ సర్క్యులర్‌ను రద్దు చేసింది.

# ఎస్ఎస్‌సి పరీక్షల షెడ్యూల్‌ను పునః సమీక్షించాలి

### పాఠశాల విద్య డైరెక్టర్‌కు ట్రస్మా విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌పై పునః సమీక్ష చేయాలని ట్రస్మా డిమాండ్ చేసింది. ఈ మేరకు ట్రాస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు, కోశాధికారి పి రాఘవేంద్ర రెడ్డి గురువారం పాఠశాల విద్య డైరెక్టర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఎస్ఎస్‌సి పరీక్షల టైమ్ టేబుల్ గురించి తెలంగాణలోని అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల తరపున తాము ఈ సమస్యను తమ దృష్టికి తీసుకొస్తున్నట్టు తెలిపారు. పరీక్షల షెడ్యూల్ ఒక నెల పాటు కొనసాగుతోందన్నారు. ఎక్కువ కాలం పరీక్షలు కొనసాగించడం వలన విద్యార్థులపై ఒత్తిడి, ఆందోళన పెరుగుతుందన్నారు. ఎక్కువ కాలం పాటు పరీక్షల నిర్వహణ నేపథ్యంలో సిబ్బంది, మౌలిక వసతులు, లాజిస్టిక్‌లను నిర్వహించడంలో పాఠశాలలకు కార్యాచరణ, పరిపాలనా సమస్యలు ఎదురవుతాయన్నారు. సుదీర్ఘమైన టైమ్‌టేబుల్ మూలంగా విద్యార్థుల ప్రిపరేషన్‌పై పడుతుందని.. ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుందన్నారు. అలాగే 9వ తరగతి వరకు ఏఎస్-2 పరీక్షలు ఏప్రిల్ 10 నుండి ప్రారంభం కానున్నాయని గుర్తు చేశారు.

# విత్తన చట్టం ముసాయిదాలో సవరణలు చేయాలి

### రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విత్తన చట్టం 2025 నకు సంబంధించిన ముసాయిదాలో సవరణలు చేయాలని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి సూచించారు. విత్తన చట్టం ముసాయిదాలో పలు లొసుగులున్నాయన్నారు. రైతుల ప్రయోజనం కోసం చట్టం ఉండేలా చూడాల్సి ఉందని ఓ ప్రకటనలో తెలిపారు.

మల్టీ నేషనల్ విత్తన ఉత్పత్తి కంపెనీల కోసం ప్రత్యేకంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించామన్నారు. ఆయా సమావేశంలో వివిధ పార్టీల నేతలు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు సంఘాల నేతలు, వ్యవసాయరంగ నిపుణులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

అదేవిధంగా విత్తన కంపెనీల ప్రతినిధులతో కమిషన్ మరోసారి సమావేశం నిర్వహించిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ నిపుణుల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన సూచనలను సైతం పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చట్టంలో చేయాల్సిన సవరణలపై ఓ నివేదికను రూపొందించినట్లు కోదండరెడ్డి తెలిపారు. విత్తన చట్టంలో సవరణలపై తయారుచేసిన నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నట్లు వెల్లడించారు.

# అశాస్త్రీయంగా ఉందన్న సిపిఎం

### పరీక్షల మధ్య ఓరోజు సెలవు సరిపోతుందంటున్న సంఘాలు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌పై ఇటు ఉపాధ్యాయ సంఘా లతో పాటు.. అటు విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న టెన్త్ పరీక్షల షెడ్యూల్ అశాస్త్రీయంగా ఉందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. 7 పరీక్షల నిర్వహణను నెలరోజుల పాటు కొనసాగిం చడంపై విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే టెన్త్ పరీక్షల షెడ్యూల్‌ను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. 10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను మార్పు చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం ఒక

# టెన్త్ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలంటున్న ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు

ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు 35 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిందని.. ఇది పూర్తిగా అశాస్త్రీయంగా ఉందన్నారు.

పరీక్షలు సుదీర్ఘకాలం జరపడం వలన విద్యార్థుల్లో తీవ్ర ఒత్తిడి, మానసిక అలసట, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. తక్షణమే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యా నిపుణుల సలహాలతో శాస్త్రీయమైన పద్ధతిలో కొత్త పరీక్షల షెడ్యూల్‌ను విడుదలచేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన పదవ తరగతి పరీక్షల టైం టేబుల్‌ను వెంటనే సవరించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. 2026 మార్చిలో జరుగనున్న ఎస్ఎస్‌సి పరీక్షల కోసం పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం విడుదల చేసిన టైం టేబుల్ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ విమర్శించారు. పరీక్షల షెడ్యూల్‌ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. కేవలం 7 పేపర్లు రాయడానికి దాదాపు 35 రోజులపాటు పరీక్షల నిర్వహించడం అనేది అనాలోచిత దోరణి అని.. ఇది విద్యార్థుల ఉపాధ్యాయులు, పాఠశాల ప్రయోజనాలు కాపాడుట కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాన్ని రుద్దినట్లుగా ఉందని మండి పడానడరు. పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇస్తే సరిపోతుందని.. కానీ నాలుగు నుండి ఆరు రోజుల విరామం ఇవ్వడం వలన విద్యార్థులకు పరీక్షల పట్ల ఆసక్తి తగ్గుతుందని.. తద్వారా ఒత్తిడికి లోనవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ విమర్శించింది. పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ సవరించాలని, ఏడు పరీక్షల నిర్వహణకు నెలరోజుల సమయం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10వ తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం ఆ షెడ్యూల్ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని, ఏడు పరీక్షల నిర్వహణను నెల రోజుల పాటు నిర్వహించడం సరికాదని, షెడ్యూల్ వెంటనే మార్చాలని, ఒక్కో పరీక్షకు మధ్య రెండు రోజుల గడువు ఉంటే సరిపోతుందన్నారు.

కలలు మన అంతర్గత కోర్కెలకు నిజమైన భాష్యాలు. వాటిని అర్థం చేసుకోవడానికి కళా నైపుణ్యం కావాలి.

-యావా చర్చిస్

# సంక్షోభంలో 'సహకారం'

అప్పిచ్చువాడు వైద్యుడు, నెప్పుడు నెడతెగక పారు నేరును, ద్విజుడున్ చొప్పడిన యూర నుండుము, చొప్పడకున్నటి యూరు చొరకుము సుమతీ. అంటూ సుమతీ శతకకారుడు కొత్త ప్రదేశాల్లో స్థిరపడలేననుకునేవారికి కొన్ని సూచనలు ఇచ్చారు. అందులో మొట్టమొదటిది ముఖ్యమైంది అప్పు. అప్పుకు ఎంతటి ప్రాధాన్యత ఇచ్చాడో అర్థమవుతుంది. ఆరోగ్యం, నీరు కంటే అప్పిచ్చువారికే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇది కొత్తగా వచ్చిందికాదు, కొత్తగా చెప్పేది కాదు. ఎంతో అనుభవంతో కాచి వడబోసిన సుమతీ శతకమిది. పూర్వీకుల నుంచి గ్రామీణ రంగంలో రైతులను ఆదుకునేందుకు అప్పులు అందించే వ్యవస్థ ఏదో ఒకరూపంలో కొనసాగుతూనే ఉండేవి. రాజుల కాలంలో కానీ, ఆ తర్వాత కానీ గ్రామాల్లో అవసరాలను బట్టి రైతులకు రుణసహాయం అందించేవారు. లాభాపేక్ష ఉండేది కాదు. రైతులు అప్పులు ఇచ్చేవారి మధ్య అవినాభావ సంబంధాలు ఉండేవి. ఎంతో మానవతా విలువలు ఉండేవి. ఒకరినొకరు ఆదుకోవాలనే తపన ఉండేది. దిగజారిపోయిన మానవతా విలువలతో పాటు ఆ వ్యవస్థ కూడా కేవలం లాభాపేక్ష ధ్యేయంగా మారి అధిక వడ్డీలు, అపరాధ వడ్డీలుఅంటూ అమాయకులను దోపిడీ చేయడం ఆరంభించింది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని 'నాగు'లంటూ పంటకాలానికిబస్తారెట్టింపు వసూలు చేసే విధానం చోటు చేసుకున్నది. ఈ నాగులు, అపరాధ వడ్డీలు చెల్లించలేక ఎన్నోకుటుంబాలు వీధినపడ్డాయి. మరో మాటలో చెప్పాలంటే వెట్టిచాకిరి ఆవిర్భావించింది దీని నుంచే. ఈ దోపిడీని అడ్డగించిన వారు, వ్యతిరేకించిన వారిలో కొందరు యువకులుఆనాటి బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలిచారు. పోరాట బాట పట్టారు. ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వానికి ఈసమస్య తలనొప్పిగా మారింది. అప్పులభారం భరించలేక వ్యవసాయానికే మంగళం పాడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వడ్డీ వ్యాపారులను కట్టడిచేయలేక అటు రైతులనుఆదుకోలేక, ఆనాటి ఆంగ్ల పాలకులు సతమతమయ్యారు. ఎన్నో కమిటీలు సుదీర్ఘ అధ్యయనం అనంతరం గ్రామీణ పరిస్థితిని అర్థం చేసుకొని బ్రిటిష్ ప్రభుత్వం మొట్టమొదటి సారిగా 1904లో సహకార వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 1911 మార్చి17న గుంటూరు లో జిల్లా స్థాయి సహకార బ్యాంకు ఆవిర్భవించింది. ఆ తర్వాత అయ్యదేవర కాళేశ్వర రావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటివారు కలిసి విజయవాడ కో ఆపరేటివ్ బ్యాంకును స్థాపించారు. అందులో నుంచి విడిపోయిన పట్టాభిసీతారామయ్య భూముల ను తనఖా పెట్టుకొని దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేభూతనఖా బ్యాంకులను భారతదేశంలోనే మొదటిసారిగా కృష్ణ జిల్లా గుడ్లవెల్లూరులో 1925 అక్టోబరు 31వ తేదీన శ్రీకారం చుట్టడంతో గ్రామీణరంగంలో రుణవసతులు కల్పించడంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయనే చెప్పొచ్చు. రైతులందరికీ కాకపోయినా కొందరికి ఈ వ్యవస్థ ఎంతో ఊరట కలిగించదని చెప్పొచ్చు. అప్పట్లోనే కొందరు భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు ఎవరివంతు వారు ఈ వ్యవస్థకు తూట్లు పొడిచే ప్రయత్నాలు చేశారు. అలాంటి ఆటుపోట్లు ఎన్నో తట్టుకొని రైతుల విశ్వాసాన్ని చూరగొంటూ అంచలంచెలుగా ఎదిగి స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1964లో సహకార చట్టం వచ్చింది. రైతుల కష్టాన్ని వడ్డీ, చక్రవడ్డీరూపంలో దోచుకుంటున్న కొందరు వ్యాపారులకు, పెత్తందారులకు ఇబ్బంది కలిగించినా రైతులకు మాత్రం వరప్రసాదంగా మారింది. మొత్తం మీద సహకార వ్యవస్థలో గ్రామీణ రంగంలో ఈ బాధలు తప్పిపోయాయని రైతులు ఎంతగానో ఆనందించారు. రైతులకు కొత్త ఆశలు రేకెత్తించి అంచలంచెలుగా ఎదిగి లక్షలాది మంది రైతులకు కోట్లాది రూపాయలు అప్పులు ఇచ్చే స్థాయికి ఈ వ్యవస్థ చేరుకున్నది. మరెన్నో రైతు సంఘాలు ఆవిర్భవించి దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కరీంనగర్ జిల్లా ములకనూరులో ఏర్పడిన సొసైటీ కార్యక్రమాలు చూసేందుకు బ్రిటన్ లాంటి దేశాల నుంచి వచ్చి అధ్యయనం చేసి వెళ్లారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ దురదృష్టవశాత్తు ఈ వ్యవస్థలోకి రాజకీయాలు ప్రవేశించడంతో క్షీణదశ ఆరంభమైందని చెప్పొచ్చు. ముఖ్యంగా గత రెండు, మూడు దశాబ్దాలుగా పరిస్థితి దిగజారిపోతున్నది. సహకార సంఘాల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. కొన్ని సహకార సంఘాలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. కొందరి ఉద్యోగుల చేతివాటంతో అవినీతి పెరిగిపోవడం అన్నదాతలకు తెలియకుండా వారి పేర్లపై రుణాలు తీసుకొని భోంచేసిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎంతో పవిత్ర ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ కేవలం రాజకీయ జోక్యంతో పతనం అంచుకు చేరుకుంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సహకార చట్టంలో ఎన్నిసార్లు మార్పులు, చేర్పులు చేశారో లెక్కలేదు. చివరకు పాలకమండళ్లు లేకుండా తాము నామినేట్ చేసిన వ్యక్తులతో వ్యవస్థను నడిపించేందుకు కూడా పాలకులు వెనుకాడలేదు. రాజకీయ అవసరాలకోసం వారూ, వీరు అని తేడా లేకుండా పది రూపాయలు చెల్లించి సభ్యులుగా చేరవచ్చనే సవరణ తీసుకొచ్చారు. మళ్లీ దాన్ని కొంతకాలానికి సవరించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం ఇష్టానుసారంగా సభ్యత్వాన్ని పెంచారు. 'ఒకరి కోసంఅందరు, అందరి కోసం ఒకరు నిలిచి'అన్న సహకార స్ఫూర్తికి ప్రమాదం వాటిల్లే పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా పాలకులు వాస్తవాలు గ్రహించాలి. కుప్పకూలుతున్న సహకార వ్యవస్థను కాపాడుకోవాల్సిన తరుణమిది. వాణిజ్య బ్యాంకులు అప్పులు అందిస్తున్నా వాటికితోడు ఎంతో పవిత్ర ఆశయంతో ప్రారంభించిన ఈ సహకార వ్యవస్థ కీలకమనే విషయం పాలకులు విస్మరించరాదు.

ఒక గొప్ప జాతిగా మారాలనుకున్న దేశ ప్రజలకు సామూహిక క్రమశిక్షణ అన్నది అత్యావశ్యకమయిన నిబంధన.



మహాత్మా గాంధీ

జీవితంలో ప్రతి నిముషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో. లేకుంటే నీవు వృథా చేసిన కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

# ప్రజావాక్కు



### పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి

ఆధునిక వ్యవసాయంలోరసాయన పురుగుమందుల అధిక వాడకం అనివార్యంగా మారింది. అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు లేకుండా వీటినిఉపయోగించడం ప్రజారోగ్యం, పరిసరాలు, వ్యవసాయవ్యవస్థపై తీవ్రప్రభావం చూపుతోంది. ఈరసాయన అవశేషాలు ఆహారంలో ఉండిపోయి, ప్రజల్లో కర్కటరోగం(కాన్సర్), వంధ్యత్వం, నాడీ వ్యవస్థ లోపాలు వంటి తీవ్రఅనారోగ్యాలకు కారణమవుతున్నాయి. మందులుకొట్టే రైతులు సరైన రక్షణపద్ధతులు పాటించకపోతే, వారికి శ్వాసకోశ, చర్మవ్యాధులు వస్తున్నట్లు పరిశోధనలు నిరూపిస్తున్నాయి. అంతేకాక, ఈ రసాయనాలు మేలు చేసే తేనెటీగలు వంటి స్నేహపూర్వక కీటకాలను నాశనంచేసి, పరాగసంపర్కానికి ఆటంకం కలిగిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాజకీయ చతురత

ప్రపంచ వ్యాపార దిగ్గజాలను హైద్రాబాదుకు ఆహ్వానించి వారిని మర్యాద పూర్వకంగా అర్థించి 5.75 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో అనేకరకాల వస్తువులను తయారు చేయడానికి ఒప్పించడం సామాన్యమైన విషయం కాదు. ఈఒప్పందాలు చేసిన వారు మడం తిప్పక తాము చేసిన వాగ్దానాల ప్రకారంవారి సంస్థలను నిర్మిస్తే హైద్రాబాదు ప్రపంచపటంలో మరింతప్రస్ఫుటంగా వెలుగుతుంది. దీనికి హైద్రాబాద్ పేరు అనకుండా భారత్ ఫ్యూచర్ సిటీగా నామకరణం చేయడం ప్రధాని నరేంద్ర మోడీ గారిని ప్రసన్నం చేసుకోడానికిఎంతగానో తోడ్పుడుతుంది. ఈ కార్యక్రమాలను చేపట్టానని రేవంత్ రెడ్డి గారు పదే పదే చెప్పడం రాజకీయ చతురతను చెప్పక చెబుతోంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రజల సమస్యలు పట్టించుకోండి

కూటమి ప్రభుత్వంఅభివృద్ధి, సంక్షేమం రెండుకల్లులా పని చేస్తున్నాయి. ప్రజలు చాలాసంతోషంగా ఉన్నారు. ప్రజలు చాలాచోట్ల ఎదురుచూస్తున్న సమస్యలు కొన్ని తీరుతున్నాయి. కానీ రాత్రి 10 గంటల వరకు రోడ్లమీద చిల్లర రౌడీల అల్లర్లు మితిమీరిపోతున్నారు. తప్ప తాగి డ్రైవింగ్ చేయడం వల్ల అనేకమంది ప్రజలు తమ ప్రాణ మానాలను కోల్పోతున్నారు. స్త్రీలకు భద్రత కల్పించండి.

- కొండమూరి సుబ్బరాయుడు, సాయిపేట, కడప

### బియ్యం ఎగుమతులపై సుంకం!

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత బియ్యంపైభారీసుంకాలు విధించేఅవకాశాన్ని ప్రస్తావించడంతో, అంతర్జాతీయ వాణిజ్య వర్గాలలో కొత్త చర్చ మొదలైంది. అమెరికన్ రైతులు భారతదేశం తక్కువ ధరలకు బియ్యం డంపింగ్ చేస్తోందని ట్రంప్ వద్ద ఫిర్యాదు చేశారని వచ్చిన సమాచారం ఈ వివాదానికి మరింత ఊతమిచ్చింది. ఈ పరిణామం భారతీయ బియ్యం ఎగుమతులపై మాత్రమే కాదు, రెండు దేశాల ఆర్థిక సంబంధాలపై కూడా స్పష్టమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద బియ్యం ఎగుమతి దేశం. నాణ్యత, ధరలో పోటీ సామర్థ్యం కారణంగా అనేక దేశాలు భారత బియ్యాన్ని ప్రాధాన్యంగా కొనుగోలు చేస్తాయి. భారత బియ్యానికి అమెరికా మార్కెట్లో డిమాండ్ ఉంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఆశకు అంతెక్కడ?

వేల సంపాదన ఉన్న వారు లక్షలు కావాలనుకుంటారు. లక్షలు వచ్చాక కోట్లు. అయితే ఇంతధనం న్యాయంగా ధర్మంగా సంపాదించలేరు. కనుక అవినీతికి పాల్పడతారు. లాంచాలు తీసుకుంటారు. అలాగే నాయకులకి ఒక రాష్ట్రంలో అధికారం సరిపోదు ఒక రాష్ట్రం తరువాత మరొకటి ఆ తరువాత ఇంకొకటి ఈ విధంగా దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలను తమ ఆధీనంలో ఉండాలి. ఎలాగోలా ఎన్నికల్లో గెలవాలి. అన్ని రాష్ట్రాలను తామే పాలించాలి అనుకుంటారు. అనుకున్నది సాధించడానికి అక్రమాలకి మోసాలకి పాల్పడతారు. కొత్త ఓట్లను సృష్టిస్తారు. ఉన్న ఓట్లను మాయం చేస్తారు. మనుషుల్లో నిజాయితీ కరవైంది. తాము గెలిస్తే సక్రమమని ప్రత్యర్థులు గెలిస్తే అక్రమమని అధికార దుర్వినియోగమని అంటారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### అక్రమ నిర్మాణాలు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటినుండి రాష్ట్రంలోని మండల కేంద్రాలలోభూకబ్జాలు ఎక్కువ అవుతున్నాయి. ఎస్సీ ఎస్టీ వికలాంగులకు సంబంధించిన భూములను అక్రమంగా కబ్జాలు చేసి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. ఇది ఏమిటి అని అడిగితే దాడులు దౌర్జన్యాలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా కూడా ఎవరు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో గ్రామ పెద్దల సమక్షంలో భూ సమస్యలను పరిష్కరించాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇండిగో సమస్య ఒక గుణపాఠం!

**ఇండిగో సమస్య నుండి ఏర్పడిన పాఠాలు, ఇతర విమానయాన సంస్థలకు, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విమానయాన సేవలను మరింత స్థిరంగా, భద్రతాయుతంగా ప్రయాణికుల మద్దతు కలిగించేలా చేస్తాయి. ఈ వివాదం చూపిన ముఖ్య పాఠం ఏమిటంటే, సౌకర్యం లాభం కోసం భద్రతా ప్రమాణాలను దాటకూడదు, ప్రభుత్వ పర్యవేక్షణను తప్పనిసరిగా పాటించాలి. ఇది మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. ఒక పెద్ద కంపెనీ అయినా, భద్రతా ప్రమాణాలను పాటించకపోతే, ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టితో చర్యలు తీసుకుంటుంది. కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడు తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో ప్రయాణికుల న్యాయం, సిబ్బంది భద్రత, విమానయాన వ్యవస్థ స్థిరత్వం కోసం కీలకమైనవి. ఈ ఘటన, భారతీయ విమానయాన రంగంలో ఒక పున ర్వ్యవస్థాపనకు కారణమయ్యింది, భవిష్యత్తులో సమస్యలు తక్కువగా ఉండేలా చేస్తుంది. అందువలన, ఇండిగో వివాదం కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడు చర్యలు, ప్రభుత్వ పాలన, భద్రతా ప్రాముఖ్యత, ప్రయాణికుల రక్షణలో ఒక నమూనాగా నిలుస్తాయి.**

అప్పన్న గొనప

భారతీయ విమానయాన రంగంలో ఇటీవల జరిగిన ఇండిగో విమానాల విపత్తు, దేశవ్యాప్తంగా ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగించింది. డీజీసీఏ రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైం పరిమితులు, విశ్రాంతి నియమాలు అమలులోకి రాగానే, ఇండిగో విమానాల్లో అనేక రద్దులు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితి దేశంలోని ప్రధాన విమానయాన కంపెనీ అయిన ఇండిగోపై సవాళ్లను తెచ్చింది. ఈ సందర్భంలో, ముఖ్యమైన భూమికను నిర్వర్తించినవారు కేంద్ర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు. ఆయన వ్యవహారంలో చూపిన సక్రియత, నియంత్రణ విధానం, సమస్యకు సమాధానం, భవిష్యత్తులో ఇదే తరహా సమస్యలు కలగకుండా తీసుకున్న చర్యలు విమానయాన రంగానికి ఒక ఉదాహరణగా నిలిచాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం ఇండిగో అంతర్గత ఆపరేషనల్ ప్లానింగ్ లోపాలు. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైం నియమాలు అమలు కావడానికి ముందుగా అన్ని విమానయాన సంస్థలు తగినంత ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఉండింది. అయితే, ఇండిగో సంస్థ తన క్రూ రోస్టరింగ్ సిబ్బంది మేనేజ్మెంట్‌లో సరైన ప్రణాళికను రూపొందించకపోవడం వల్ల ఇది విపత్తుగా మారింది. అనేక విమానాలు రద్దు కావడం, ప్రయాణికుల ప్రయాణ ప్లాన్లలో విఘాతం కలగడం, విమానాశ్రయాల్లో కలతకు కారణమయ్యాయి. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు పార్లమెంట్‌లో వ్యాఖ్యానిస్తూ, సమస్యపై ప్రభుత్వం దృఢస్థితిని స్పష్టం చేశారు. ఆయన అభిప్రాయానుసారంగా, విమానయాన భద్రత అత్యంత ప్రధానమైన అంశం, దానిపై తేడాలేకుండా పాలన అవసరం. సిబ్బంది సమస్యల కారణంగా కలిగిన అంతరాయం పూర్తిగా ఇండిగో సంస్థలోని నిర్వాహకుల లోపాల కారణంగా ఉద్భవించిందని మంత్రి స్పష్టంచేశారు. ఆయన ప్రస్తావన ప్రకారం, భద్రతా ప్రమాణాలను దాటి వ్యాపార ప్రణాళికలు అమలు చేయడం కుదరదు. మంత్రి రామ్ మోహన్ నాయుడు తీసుకున్న చర్యలలో ముఖ్యంగా, విపత్తుకు కారణమైన ఇండిగోపై పూర్తి పరిశీలనను చేపట్టడం ఉంది. కంపెనీకి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ద్వారా, పైస్థాయి నిర్వాహకుల బాధ్యతను గుర్తించగా, భవిష్యత్తులో ఇలా జరిగేందుకు అడ్డుకట్ట వేయడం జరిగింది. అలాగే, ప్రయాణికుల హక్కులను రక్షించడానికి రిఫండ్ బ్యాగేజ్ క్లెయిమ్ ప్రక్రియలను వేగవంతం చేయడం, ఎలాంటి ధర పెరుగుదలను నిరోధించడానికి ప్రత్యేక పర్యవేక్షణ




విధించడం వంటి చర్యలు కూడా చేపట్టబడ్డాయి. విమానయాన రంగంలోని దీర్ఘకాలిక ప్రభావాల విషయంలో కూడా రామ్ మోహన్ నాయుడు తీసుకున్న నిర్ణయాలు గమనార్హంగా ఉన్నాయి. ఇండిగో మాదిరిగా ఒకే కంపెనీ పై అధికంగా ఆధారపడి ఉండటం ద్వారా ప్రయాణికులు అనుభవించే ప్రమాదాలను ఈ వివాదం ప్రదర్శించింది. సిబ్బంది నిల్వను పెంచడం, రోస్టర్లు తగినంత రీతిలో రూపొందించడం వంటి చర్యలు, భవిష్యత్తులో మరింత భద్రతా ప్రమాణాలు పాటించడానికి విమానయాన సంస్థలకు మోడల్‌గా నిలుస్తాయి. ప్రభుత్వం తీసుకున్న కఠినపాలన విధానం ద్వారా ఇతర విమానయాన సంస్థలకు కూడా ఒక హెచ్చరికగా నిలిచింది, ఇది భవిష్యత్తులో అంతరాయం తక్కువగా ఉండేలా చేస్తుంది. ముఖ్యంగా, మంత్రి రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరిన్ని విమానయాన సంస్థలకు మార్కెట్లో ప్రేరణ కలిగే విధంగా ఏర్పాట్లు తీసుకోవాలని అన్నారు. ఈ విధానం, భారతీయ విమానయాన రంగంలో పోటీని పెంచి, ప్రయాణికులకుమెరుగైన సౌకర్యాలను అందించడంలో సహాయపడుతుంది. రిఫండ్, సిబ్బంది సమస్యల పరిష్కారం, ఆపరేషన్ల పునరుద్ధరణ వంటి చర్యల ద్వారా, సాధారణ పరిస్థితులకు తిరిగి వచ్చేందుకు ముఖ్యమైన పథకాలు రూపొందించబడ్డాయి. వీటితో పాటుగా, కేంద్ర ప్రభుత్వం రామ్ మోహన్ నాయుడు చూపిన కఠినమైన, స్పష్టమైన, భద్రతా ప్రాముఖ్యత కలిగిన నిర్ణయాలు భారతీయ విమానయాన రంగానికి ఒక సానుకూల ఉదాహరణగా నిలిచాయి. ఇండిగో సమస్య నుండి ఏర్పడిన పాఠాలు, ఇతర విమానయాన సంస్థలకు, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విమానయాన సేవలను మరింత స్థిరంగా, భద్రతాయుతంగా ప్రయాణికుల మద్దతు కలిగించేలా చేస్తాయి. ఈ వివాదం చూపిన ముఖ్య పాఠం ఏమిటంటే, సౌకర్యం లాభం కోసం భద్రతా ప్రమాణాలను దాటకూడదు, ప్రభుత్వ పర్యవేక్షణను తప్పనిసరిగా పాటించాలి. ఇది మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. ఒక పెద్ద కంపెనీ అయినా, భద్రతా ప్రమాణాలను పాటించకపోతే, ప్రభుత్వం దీర్ఘకాలిక దృష్టితో చర్యలు తీసుకుంటుంది. కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో ప్రయాణికుల న్యాయం, సిబ్బంది భద్రత, విమానయాన వ్యవస్థ స్థిరత్వం కోసం కీలకమైనవి. ఈ ఘటన, భారతీయ విమానయాన రంగంలో ఒక పునర్వ్యవస్థాపనకు కారణమయ్యింది, భవిష్యత్తులో సమస్యలు తక్కువగా ఉండేలా చేస్తుంది. అందువలన, ఇండిగో వివాదం కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు చర్యలు, ప్రభుత్వ పాలన, భద్రతా ప్రాముఖ్యత, ప్రయాణికుల రక్షణలో ఒక నమూనాగా నిలుస్తాయి. ఈ సంఘటనతో వచ్చే పాఠాలు భవిష్యత్తులో మరింత స్థిరమైన, సురక్షితమైన, సమర్థవంతమైన విమానయాన రంగానికి దారితీస్తాయి. •

# విద్యార్థులపై 'శతదిన చర్య' ప్రభావం

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్‌లో పది తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన శతదిన చర్యా ప్రణాళిక విద్యా వ్యవస్థలో పెద్ద చర్చకు దారితీస్తోంది. సాధారణ పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించడం, వెంటనే పత్రాలు సరిదిద్దడం, అదే రోజు నమోదులు పూర్తి చేయడం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలపై పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ విధానం ఎంతవరకు విద్యార్థుల అభివృద్ధికి మేలు చేస్తుందన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలు రోజంతా తరగతుల్లో చదివి అలసిపోయిన సమయమే పరీక్ష సమయం కావడం వారి ఏకాగ్రతను దెబ్బతీస్తోంది. మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం పిల్లల్లో ఏకాగ్రత ఒక స్థాయికి మించి కొనసాగదు. రోజంతా పాఠాలు విని, హోంవర్క్ పూర్తి చేసి చివర్లో పరీక్ష రాయడం శారీరకంగా కూడా కష్టమే కాక మానసికంగా మరింత ఒత్తిడి కలిగిస్తుంది. ఈ విధానం పిల్లల్లో చదువుపై భయాన్ని పెంచుతుందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. పాఠశాల అంటే నేర్చుకునే స్థలం అని కాకుండా, పరీక్షలు పెట్టే కేంద్రం అని భావించే ప్రమాదం ఉంది. పరీక్షల కంటే నేర్పు ముఖ్యమని తెలియజేయాల్సిన సమయంలో, పరీక్షలను మరింత కఠినంగా చేయడం పెద్ద లోపం. ఉపాధ్యాయులపై పడుతున్న పనిభారం రోజురోజుకు పెరుగుతోంది. బోధన పూర్తయ్యాక పరీక్ష నిర్వహణ, పేపర్ కరెక్షన్, వెంటనే ఆన్లైన్లో నమోదు, తదుపరి రోజు పాఠాల ఏర్పాట్లు ఇలా నిరంతరంగా కొనసాగుతున్న పనిలో ఉపాధ్యాయులకు విశ్రాంతి అనే భావన లేకుండా పోతోంది. ఇది బోధన నాణ్యతను తగ్గించడమే కాకుండా, ఉపాధ్యాయుడు చూపే మానవత్వాన్ని కూడా అలసట కారణంగాతగ్గిస్తోంది. ఆరు నుంచి తొమ్మిది తరగతుల పిల్లలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఉపాధ్యాయులు మొత్తం సమయాన్ని పది తరగతి పనులకు కేటాయించడంతో మిగతా తరగతులకు సరైన బోధన అందడం లేదు. టైం టేబుల్ మార్పులు, తరగతుల రద్దు, పాఠ్యాంశాలలో ఖాళీలు ఏర్పడి మధ్య తరగతుల విద్యార్థులు నష్టాన్ని భరించాల్సి వస్తోంది. ఇదంతా జరుగుతున్నప్పటికీ, విద్యార్థుల ఆరోగ్యం అనే ముఖ్య అంశం పూర్తిగా మరచిపోయినట్టే కనిపిస్తోంది. రోజూ ఒకే రకమైన ఒత్తిడితో ఉన్నపుడు పిల్లలలో శారీరక అలసట, తలనొప్పి, నిద్రలోపం, ఆందోళన వంటి సమస్యలు రావచ్చు. ఇది పిల్లల దీర్ఘకాలిక ఆరోగ్యానికి హానికరం. పిల్లల కుటుంబాలు కూడా ఆందోళనలో ఉంటున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటిన తర్వాతే పిల్లలు ఇంటికి చేరడం భోజనం, విశ్రాంతి, ఆటపాటలకు అవుతున్న అంతరాల వల్ల పిల్లల వ్యక్తిత్వవికాసం ప్రభావితమవుతోంది. తల్లిదండ్రులు చదువు కోసం పిల్లలు ఇంత శ్రమపడటం చూసి మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఉపాధ్యాయుల కుటుంబాలకు కూడా ఇదే సమస్య. వారు ఇంటికి చేరేసరికి అలసటతో శక్తి లేకుండాపోతున్నారు. కుటుంబ సభ్యులతో



మాట్లాడే సమయం, పిల్లలతో గడపాల్సిన సమయం, వారి వ్యక్తిగత అవసరాలు అన్నీ తగ్గిపోతున్నాయి. ఇలా సాగితే ఉపాధ్యాయుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా కార్యక్రమాలు నిరవధికంగా కొనసాగించడం విద్యార్థులు, ఉపాధ్యాయులను పూర్తిగా శ్రమలోకి నెట్టేస్తోంది. సెలవు అనే మాటకు అర్థం లేకుండాపోతుంది. సెలవు విశ్రాంతికి, పండగలు ఆనందానికి, కుటుంబంతో గడపడానికి ఉపయోగపడాలి. నేర్చుకునే ప్రక్రియకు విరామం కూడా అవసరం. విరామం లేకుండా చదువు కొనసాగితే నేర్చుకునే ప్రక్రియ మందగిస్తుంది. మనోవిజ్ఞాన శాస్త్రం చెబుతున్నది ఏమిటంటే పిల్లల అభ్యాసం క్రమపద్ధతిలో, శారీరకంగా మానసికంగా అనుకూల వాతావరణంలో సాగాలి. ఒత్తిడిలో నేర్చుకున్న పాఠాలు ఎక్కువకాలం నిలబడవు. శాంతమైన వాతావరణంలో నేర్చుకున్నవి మాత్రమే స్థిరంగా నిలుస్తాయి. ప్రస్తుత విధానం ఈ సూత్రాలకు అనుగుణంగా లేదు. తరచుగా పరీక్షలు పెట్టడం పిల్లల ప్రతిభను కొలిచే సరైన మార్గం కాదు. పరీక్షల ద్వారా సాధన పరచడం మంచిదే కానీ, పరీక్షలే చదువు లక్ష్యం కావడం తప్పుడు పద్ధతి. పిల్లలు నేర్చుకోవాలి అంటే ప్రశ్నించే గుణం, ఆలోచించే శక్తి, సృజనాత్మకత పెంపొందాలి. ఇవి నిరంతర ఒత్తిడిలో ఎదగవు. ఉపాధ్యాయుల అభిప్రాయాలను వినకుండా తీసుకునే నిర్ణయాలు జరగడం కూడా సమస్య. తరగతి గదుల్లో జరిగే వాస్తవ పరిస్థితులను బాగా తెలిసిన వారు ఉపాధ్యాయులే. వారితో సమాలోచన చేయకుండా ఈ విధానాలు అమలు చేయడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. చదువు, పాఠాలు, పరీక్షలు అన్నీ సమతుల్యంలో ఉండాలి. అధిక ఒత్తిడి ఉన్నపుడు పిల్లలు సాధించే ఫలితాలు తక్కువగా ఉంటాయి. శ్రమ తప్పకుండా అవసరం కానీ, శ్రమ విశ్రాంతి రెండూ సమానంగాఉండాలి. పాఠశాల అనేది పిల్లల ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రదేశం. అక్కడ వారు ఆటలు నేర్చుకోవాలి, స్నేహాలు పెంచుకోవాలి, సమతుల్యమైన వ్యక్తిత్వం తయారవ్వాలి. మరీ కఠిన షెడ్యూల్ వాటన్నింటిని అడ్డుకుంటోంది. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేస్తోంది అన్న అభిమతం ఉన్నా, పిల్లల వయస్సుకు, వారి మానసిక స్థితికి అనుగుణంగా ఉండాలి. పాలనలో ప్రధాన లక్ష్యం ఒత్తిడి తగ్గించి, నేర్పు పెంచే దిశగా ఉండాలి. పరీక్షల కోసం పిల్లలను సిద్ధం చేయడం మంచిది కానీ, పిల్లల ఆనందాన్ని, ఆరోగ్యాన్ని, కుటుంబాలతో గడపాల్సిన విలువైన సమయాన్ని త్యాగం చేస్తూ ఈ రీతిలో కార్యక్రమాలు నిర్వహించడం సమంజసం కాదు. విద్య ఒక సహజ ప్రక్రియ. సహజ మార్గంలోనే వికసిస్తుంది. చివరగా చెప్పాల్సినది ఏమిటంటే విద్య ఒక బలమైన భవిష్యత్తును నిర్మించే సాధనం. అది ఒత్తిడితో కాకుండా ఆత్మవిశ్వాసంతో వికసించాలి. పిల్లల బలహీనతలను గుర్తించి బలాలుగా మార్చడం నిజమైన విద్య. కానీ ఈ ప్రస్తుత విధానం ఆ దిశగా తీసుకెళ్లడం లేదు. అందుకే ఈ సమయంలో ప్రభుత్వం, విద్యా అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యా విధానాలపై మళ్లీ సమాలోచన చేయాలి. పిల్లలకు సంతోషం, ఉపాధ్యాయులకు గౌరవం, కుటుంబాలకు సమతుల్యం కలిగిన విధానాలు మాత్రమే దేశ భవిష్యత్తును బలపరుస్తాయి. •

# దళిత మహిళలకు రక్షణ కరవు!

డా.కె. ఆసయ్య, ఐఐఎస్

భారతదేశంలో మహిళలకు మంచి గౌరవమైన పరిస్థితులున్నాయి. కొందరు త్యాగఫలితంగా మహిళలకు హక్కులు వసతులు కలిగాయి. అందులో ఆస్తి హక్కు, విద్యావసతులు, పురుషునితో సమానంగా ఉద్యోగం, వృత్తి, భత్యములు కూడా లభించాయి. భారతీయ మహిళలు ఇంకా కొన్ని రంగాలలో వెనుకబడే ఉన్నారు. స్విట్జర్లాండ్ లాంటి ప్రత్యక్ష ప్రజాస్వామ్య దేశాలలో ఇంకా స్త్రీలకు ఓటు హక్కు లభించలేదు. కాని ఇండియాలో మహిళలు గత 75 సంవత్సరాల నుండి ఓటు హక్కు కలిగి ఉన్నారు. అందుకు కారణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని చెప్పవచ్చు. మహిళలు మాత్రం కులం ఉచ్చులో చిక్కుకున్నారు. ఉన్నత కులాల మహిళలకు పని చేయవలసిన అవసరం లేదు. కాని పేద మహిళలు భర్తతోపాటు భార్య కూడా పనిచేయాలి. లేకపోతే కుటుంబం అంతా పస్తులుండాల్సి వస్తుంది. అందుకే భారత్‌లో కుటుంబాలకు ముఖ్యంగా మహిళలు, పిల్లలను దృష్టిలో ఉంచుకొని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు పలు ఉచిత అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టాయి. అందులో నగదు పంపిణీ, ఆహార పథకం, ఉపాధి పథకం తదితరాలుగా పేర్కొనవచ్చు. ఉచిత పథకాలు మహిళలకు కల్పించడం ద్వారా మొబిలిటీ పెరిగింది. తెలంగాణలో మొదట ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ఇప్పుడు ఢిల్లీలో మహిళలకు ఉచిత బస్సు రవాణా, వెల్‌నెస్ సెంటర్లు పెట్టారు. అదే రీతిలో మహిళలకు ఉచిత బస్సు పథకం ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెట్టారు. తమిళనాడులో ఉచిత వాషింగ్ మిషన్‌ల పంపిణీ లాంటివి ఎన్నో పథకాలు అమలువుతున్నాయి. ఇందులో దళిత మహిళలకు ఉపయోగపడేవి చాలా తక్కువ. దళిత మహిళ, పురుషునితోపాటు పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకోవాలి. మరల వచ్చి ఇంటిల్లిపాదికి ఆహార అవసరాలు తీర్చాలి. దళిత మహిళలకు అయినా సరైన పోషకాహారం అందడం లేదు. వీరు త్వరగా మరణానికి గురవుతున్నారు. దళిత మహిళ ఇంటిల్లిపాది తిన్నాకే ఆఖరుకు తింటుంది. అంటే మిగిలితే తింటుంది. లేకపోతే చాలాసార్లు ఆకలితోనే నిద్రపోతుంది. దళిత మహిళ స్థితి మిగతా ఇతర కులాల మహిళల కంటే భిన్నంగా ఉంటుంది. భారత్‌లో చదువుకున్న మహిళల సంఖ్య 48శాతం నుంచి 62 శాతం కంటే తక్కువ. అందులో దళితులలో మహిళల చదువు 27 శాతం దాటలేదు. చదువుకొన్న మహిళ 5వ తరగతి లేదా 10వ తరగతి తర్వాత చదువు ముగుస్తుంది. దానితో మిగతా వారి వలే ఉద్యోగ మహిళలు దళితులలో నాలుగు శాతం కూడా ఉండరు. గ్రామాలలో దళిత మహిళలు చదివి ఉద్యోగం



చేసే వారి సంఖ్య వేళ్లమీద లెక్కించవచ్చును. మిగతా దళిత మహిళల కంటే ఎక్కువగా పీడింపబడుతుంది. ఇటు ఇంటిలోనూ, అటు పనిచేయు ప్రదేశాలలోను పీడనకు గురవుతూ జీవనం సాగించుతుంది. దళిత మహిళలు పనిచేసే చోట తగిన సదుపాయాలుండవు. పురుషునితోపాటు సమానంగా వేతనం ఇవ్వరు. కాని పనిగంటలు సమానంగా ఉంటాయి. కూలికి వెళ్లిన దళిత మహిళలు ఒక్కోసారి వేధింపులకు, లైంగిక వేధింపులకు గురవుతుంటారు. వీరు బయటకు చెప్పుకోలేరు. ఇంట్లో చెప్పుకోలేరు. వారిలో వారు కుమిలిపోతుంటారు. దళిత మహిళలకు ముఖ్యంగా గిరిజనులకు వైద్యం చాలా తక్కువగా అందుతుంది. ప్రభుత్వ ఆస్పత్రులలో డాక్టర్ ఉంటే మందులు ఉండవు. పేద మహిళలకే పిల్లలు ఎక్కువ. కారణం 11 సంవత్సరాలకే తల్లి అవుతారు. తమ పట్ల తమకే అవగాహన ఉండదు. పిల్లలను మంచిగా పెంచగలరా? దానితో పేదరికం, పిల్లలకు సరైన సౌకర్యాలు లభించడం లేదు. ప్రభుత్వాలు ఇచ్చే అంగన్‌వాడిలను ఉపయోగించుకోరు. అంగన్‌వాడీల మీద వారికి సరైన అవగాహన ఉండదు. ప్రభుత్వ ఆస్పత్రులు బాగుంటే కార్పొరేట్ ఆస్పత్రికి జనం వెళ్లరు. దళిత మహిళలకు ఆధునిక సదుపాయాలు ముఖ్యంగా గ్యాస్‌పొయ్యి లాంటివి కొంత మందికే అందుబాటులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాలు తెల్లరేషన్ కార్డులున్న వారికి ఉచితంగా సిలెండర్లు యేడాదికి కేటాయిస్తున్నారు. దళితుల్లో సుదూర ప్రాంతాలలో ఉండే వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదు. వైద్యం అరుదు, బడిలో చదువు ఉండదు. అంగన్‌వాడీలు చాలా మంది దళిత మహిళలకు అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ వెసులుబాటు కల్పించింది. ఇది అన్ని రాష్ట్రాలకు పాకింది. ఏలూరు జిల్లా డ్వాక్రా మహిళా సంఘాలు ముందున్నాయి. పేద దళిత మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నా తన భాగస్వామి సహకారం లేకుండా ఏమీ చేయలేదు. అంతే కాకుండా ముఖ్యంగా దళిత మహిళలు గృహహింసతోపాటు అత్యాచారాలకు గురవుతున్నది. ఒక్కోసారి హత్యలకు కూడా గురవుతున్నారు. ఒంటరి దళిత మహిళలను, బాలికలను అపహరించి విదేశాలకు అమ్ముకోవడం జరుగుతుంది. అంతేగాక సరోగసీ పేరుతో దళిత మహిళల గర్భం అమ్ముకొని డబ్బులు పొందుతున్నారు. వీరికి రక్షణ కరవైంది. ప్రభుత్వాలు ఎన్ని మహిళా పథకాలు తెస్తున్నా వాటిని అమలు చేయడంలో ఎక్కువగా జాప్యం జరుగుతుంది. ఉత్తరప్రదేశ్, బీహార్, యుపి, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో దళిత మహిళల స్థితి దయనీయంగా ఉంది. దళితులు అభివృద్ధి చెందితే ఉన్నత కులాలకు సేవలు ఎవరు చేస్తారు అనే ప్రశ్నలు సంధిస్తూ ఇంకా దళితులను మరీ ముఖ్యంగా దళిత మహిళలను అణచివేస్తారు తప్ప వారికి చేయూతనిచ్చి పైకి తీసుకురారు. ఇది నేటి దళిత మహిళల స్థితి. వారిని ఉద్ధరించేందుకు ప్రాయోజిత వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి దళితులను కాపాడాలి. •

# 'సర్' గడువు పొడిగింపు

## యుపి, బెంగాల్ సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల సవరణలు షెడ్యూల్ కంటె వెనుకంజ

### - ఆ రాష్ట్రాల్లో గడువు పెంచిన ఇసి




**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించనున్నది. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌తో సహా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణలు షెడ్యూల్ కంటే వెనుకంజలో ఉండటంతో ఆ రాష్ట్రాల్లో గడువును పొడిగించింది. ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రాధాన్యంగా భావిస్తుంది. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ఫేక్ ఓట్లను తొలగించడం, మరణించి వారి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితాను తొలగించి అర్హత కలిగిన (18 సంవత్సరాలకుపైబడిన) వారి పేర్లను చేర్చడం సర్ ముఖ్య ఉద్దేశం. బీహార్ ఎన్నికలకు ముందు సర్ కార్యక్రమాన్ని అమలు చేసిన ఈసీ ఆ తర్వాత దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో కార్యక్రమం కొనసాగుతున్నది. బూత్ స్థాయి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పేర్లను ధ్రువీకరిస్తున్నారు. చాలా మంది బీఎల్‌వోలుగా ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. దాంతో పరిమిత సమయంలో జాబితాను వెరిఫై చేయడం సవాల్‌గా మారుతున్నది. యూపీ ఎన్నికల ప్రధాన అధికారి నవదీప్ రిన్వా బుధవారం మాట్లాడుతూ సర్‌ని పూర్తి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘాన్ని రెండువారాల సమయం కోరినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 99.24 శాతం జనాభా గణన ఫారాలు డిజిటలైజ్ చేయబడ్డాయని నవంబర్ 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును ఎన్నికల సంఘం సవరించింది. ఫైనల్ లిస్ట్‌ను ఫిబ్రవరి 14కి మార్చింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు నిర్వహించే ఇంటింటి సర్వే డిసెంబర్ 11తో ముగుస్తుంది. ముసాయిదా ఓటర్ల జాబితాను 16న ప్రచురిస్తారు. ఆ తర్వాత జనవరి 15 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. తుది జాబితాను 14న ప్రచురిస్తారు. తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్, ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవుల్లో ప్రత్యేక రివిజన్‌కు గడువును పొడిగించింది. ఎనిమిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలితప్రాంతాల్లో ఎన్నికల ఓటర్ల జాబితా సవరణలో చివరిరోజున కేంద్ర ఎన్నికల సంఘం తన నిర్ణయం ప్రకటించింది.

# లోక్‌సభలో ఇ-సిగరెట్లపై దుమారం



**బిజెపి- టిఎంసి సభ్యుల మధ్య మాటలయుద్ధం**

**లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటా: స్పీకర్ ఓం బిర్లా**

**ఒకే దేశం... ఒకే ఎన్నిక కమిటీ గడువు పొడిగింపు**

**రాజ్యసభలో వందేమాతరంపై చర్చలో రగడ**

**ఎన్నికల సంస్కరణలపై చర్చ సోమవారానికి వాయిదా**

**అమిత్ షా ప్రసంగంపై రాహుల్‌గాంధీ మండిపాటు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** గత కొన్ని రోజులుగా తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు సభలో ఇ-సిగరెట్లు తాగుతున్నారని బిజెపి సభ్యుడు అనురాగ్ ఠాగూర్ ఆరోపించారు. ప్రశ్నోత్తరాల సమయంలో అనురాగ్ ఈ అంశాన్ని లేవనెత్తుతూ, దేశవ్యాప్తంగా ఇ-సిగరెట్లను నిషేధించారు. సభలో అనుమతించారా? అంటూ స్పీకర్‌ను అడిగారు. దీనికి అధ్యక్ష స్థానంలో ఉన్న ఓం బిర్లా సమాధానమిస్తూ, అలాంటి దేమీ లేదన్నారు. టిఎంసి సభ్యులు సభలో ఇ-సిగరెట్ తాగుతున్నారని ఠాకూర్ ఆరో పించారు. "వారు సభలో కూర్చుని ఇ-సిగరెట్ తాగుతున్నారు. మీరు దానిని తనిఖీ చేయాలి" అని బిజెపి సభ్యుడు స్పీకర్‌ను కోరారు. ఠాకూర్ వ్యాఖ్యలపై టిఎంసి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటు బిజెపి, అటు టిఎంసి సభ్యులు పరస్పర ఆరోపణలతో సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని, సభ్యులందరూ సభా నియమాలు, సంప్రదించాలి. ఇ-సిగరెట్ అంశం తన దృష్టికి వస్తే చర్య తీసుకుంటానని పేర్కొ న్నారు. ఠాకూర్ తన ఆరోపణలను కొనసాగించడంతో టిఎంసి సభ్యులు ఎదురుదాడి చేశారు. మరో మారు బిజెపి- టిఎంసి సభ్యులు నినాదాలు చేస్తూ సభకు అంతరాయం కల్పించారు. స్పీకర్ మరోమారు కల్పించుకుని ఇ- సిగరెట్ తాగుతున్నారనే అంశంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని అనురాగ్ ఠాకూర్‌కు సూచించారు. అనంతరం సభను కొనసాగించారు.

**ఒకే దేశం.. ఒకే ఎన్నిక కమిటీ గడువు పొడిగింపు:** ఒకే దేశం.. ఒకే ఎన్నిక బిల్లుల కమిటీ గడువు పొడిగించాలని పిపి చౌదరి నేతృత్వంలోని పార్లమెంట్ సంయుక్త కమిటీ (జెపిసి) ప్రతిపాదనలకు లోక్‌సభ గురువారం మూజు వాణితో ఆమోదం తెలిపింది. ఇప్పటికే న్యాయ సలహా నివేదికను పార్లమెంట్‌కు అందజేసినప్పటికీ, పూర్తి స్థాయి నివేదిక అందజేయడానికి మరికొంత సమయం కావాలన్న జెపిసి ప్రతిపాదనల మేరకు 2026 బడ్జెట్ సమావేశాల వరకు పొడిగిస్తూ లోక్‌సభ ఆమోదం తెలిపింది.

**వందేమాతరంపై రాజ్యసభలో రభస:** రాజ్యసభలో వందేమాతరం జాతీయ గీతంపై ప్రత్యేక చర్చలో అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యుల మధ్య రభస చోటుచేసుకుంది. వందేమాతరం గీతాన్ని కొందరు ఒత్తిడి మేరకు ఆనాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తొలగించారని రాజ్యసభ సభా నాయకుడు,

కేంద్ర మంత్రి జెపి నడ్డా తన ప్రసంగంలో ప్రస్తావించగా, కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## అమిత్ షా భాషపై రాహుల్ అభ్యంతరం

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళనకరంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆయన భాష కూడా స్పష్టంగా లేదన్నారు. గురువారం పార్లమెంట్ వెలుపల ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ "ఓటు చోరీ అంశంపై మీడియా ముందు తాను చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావాలని ఆయన(అమిత్ షా)కు సవాల్ విసిరాను. ఆ సమయంలో ఆయన ఆందోళనకరంగా కనిపించారు. భాష కూడా సరిగ్గా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేకపోయారు. ఎలాంటి ఆధారాలూ చూపడం లేదు. మానసికంగా ఒత్తిడికి లోనయ్యారు" అని పేర్కొన్నారు.అయితే.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బిజెపి నేత గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. బుధవారం లోక్‌సభలో చర్చ జరిగే సమయానికి అమిత్ షా అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. లోక్ సభలో ప్రసంగించేందుకు లేచి నిల్చున్నప్పుడు ఆయన 102 డిగ్రీల జ్వరంతో ఇబ్బంది పడ్డారని చెప్పారు. సమావేశం ప్రారంభానికి ముందే ఆయన్ను వైద్యులు పరీక్షిం ‌చి మందులు ఇచ్చారని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ కొట్టి పారిపోయే సూత్రాన్ని అవలంబిస్తారని మండిపడ్డారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మాట్లాడినప్పుడు రాహుల్ సభ నుంచి బయటకు వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. ఇదేనా రాహుల్ ప్రజాస్వామ్యమని ఆరోపించారు.

# భారత్‌పట్ల ట్రంప్ వైఖరిపై డెమొక్రాట్ల ధ్వజం

### భారత్‌ను వదులుకున్న అధ్యక్షుడుగా చరిత్రలో ట్రంప్ నిలుస్తారని హెచ్చరిక

**వాషింగ్టన్, డిసెంబరు 11:** భారత్ విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరి, టారిఫ్‌ల విధానంపై అమెరికా కాంగ్రెస్‌లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ట్రంప్ దూకుడు కారణంగా అమెరికాకు అత్యంత కీలకమైన భాగస్వామ్య దేశాల్లో ఒకటైన భారత్‌తో సంబంధాలు దీర్ఘకాలంలో దెబ్బతినే ప్రమాదం ఉందని డెమొక్రాట్లు హెచ్చరించారు. అమెరికాభారత్ వ్యూహాత్మక భాగస్వామ్యంపై జరిగిన కాంగ్రెస్ కమిటీ విచారణలో డెమొక్రటిక్ సభ్యురాలు సిడ్నీ కామ్లాగర్‌డోవ్ ట్రంప్ పరిపాలనపై తీవ్ర విమర్శలు చేశారు. గత బైడెన్ ప్రభుత్వం ఎంతో పటిష్ఠంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను ట్రంప్ చేతిలో పెట్టిందని, దశాబ్దాలుగా ఇరు పార్టీలు నిర్మించిన బంధాన్ని ఆయన నాశనం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ట్రంప్ తన వైఖరి మార్చుకోకపోతే, భారత్‌ను కోల్పోయిన అమెరికా అధ్యక్షుడిగా చరిత్రలో నిలిచిపోతారు. కీలక భాగస్వాములను మన ప్రత్యర్థుల వైపు నెట్టడం ద్వారా నోబెల్ శాంతి బహుమతి రాదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం విధించిన 25 శాతం లిబరేషన్ డే టారిఫ్‌లు, ఆ తర్వాత భారత్ దిగుమతి చేసుకునే రష్యా చమురుపై మరో 25 శాతం సుంకం విధించడంతో మొత్తం టారిఫ్‌ల భారం 50 శాతానికి చేరిందని సిడ్నీ గుర్తుచేశారు. ప్రస్తుతం చైనాపై ఉన్న టారిఫ్‌ల కన్నా భారత్‌పై ఉన్న టారిఫ్‌లే ఎక్కువ. ఇది మనకు మనమే నష్టం చేసుకునే విధానమని ఆమె విమర్శించారు. వీటితో పాటు 70 శాతం మంది భారతీయులు వినియోగించుకునే హెచ్1బీ వీసాలపై 100,000 డాలర్ల ఫీజు విధించడం కూడా అమెరికాకు భారతీయులు అందిస్తున్న సేవలను అవమానించడమేనని అన్నారు. ఈ విచారణలో ఓఆర్ఎఫ్ అమెరికాకు చెందిన ధ్రువ జైశంకర్ మాట్లాడుతూ వాషింగ్టన్‌లో రాజకీయ సంకల్పం ఉంటే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి పరిష్కారం అందుబాటులోనే ఉందని తెలిపారు. చైనాను ఎదుర్కోవడం, సరఫరా గొలుసులను స్థిరీకరించడం వంటి కీలక వ్యూహాత్మక అంశాలను ఈ టారిఫ్‌ల వివాదం పక్కదారి పట్టిస్తోందని నిపుణులు హెచ్చరించారు. అమెరికాకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు అందించే ఈ భాగస్వామ్యాన్ని వదులుకోవడం చారిత్రక తప్పిదం అవుతుంది.

# రెండు కార్లు ఢీకొని ప్రమాదం

### ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి



**ఆజంగఢ్, డిసెంబరు 11:** యూపీలోని బారాబంకి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రెండు కార్లు ఢీకొని మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో తల్లి, నలుగురు పిల్లలో ఉన్నారు. ఇదే ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఆజంగఢ్‌లో విధులు నిర్వరిస్తున్న వారణాసికి చెందిన కానిస్టేబుల్ జావెద్ అష్రఫ్ భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా వారిని బారాబంకి ఎస్పీ అర్జిత విజయ వర్గియా పేర్కొన్నారు. కారును జావెద్ బావమరిది నడుపుతున్నాడని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై కొద్దిసేపు ఆపగాఇదే సమయంలో ఆజంగఢ్ నుంచి వస్తున్న బ్రెజ్జా కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. యూపీడీఏ బృందాలు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదంలో వ్యాగనార్ కారులోని సీఎన్‌జీ సిలిండర్ పేలడంతోనే మంటలు చెలరేగి ఉంటాయని అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాగనర్ కారు రోడ్డుపై ఆపి సర్వీస్ రోడ్డుపై స్నాక్స్ తీసుకుంటున్నారు. ఈ సమయంలో నలుగురు కారులోనే ఉన్నారు. వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ తర్వాత వెంటనే మంటలు చెలరేగాయని తెలిపారు. బ్రెజ్జా కారులో ఉన్న వారిని ఢిల్లీలోని సౌత్‌పురికి చెందిన దీపాంశుతో పాటు నలుగురు ఉండగా.. వారిని బయటకు తీశారు. పోలీసులు వచ్చే సరికి వ్యాగనర్ కారు మంటల్లో కూలిపోయింది. జిల్లా మేజిస్ట్రేట్ శశాంక్ త్రిపాఠి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత విజయవర్గీయ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణకు ఆదేశించారు.

# కాలుష్యం కోరల్లో రాజధాని సతమతం!

### వెరీ పూర్ కేటగిరీలోనే ఇప్పటికీ కొనసాగింపు..

**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. వరుసగా మూడో రోజు గురువారం కూడా గాలి నాణ్యత పూర్ కేటగిరీలోనే కొనసాగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం, ఈ ఉదయం 7 గంటలకు నగరంలో సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 285గా నమోదైంది. ఇది వెరీ పూర్ కేటగిరీ (301)కి చాలా దగ్గరగా ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. నగరంలోని పదికి పైగా పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ ఇప్పటికే 300 మార్కును దాటి వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది. ఆనంద్ విహార్‌లో 300, అశోక్ విహార్‌లో 328, చాందినీ చౌక్‌లో 305, ఐటీఓ వద్ద 309గా కాలుష్య తీవ్రత రికార్డయింది. ఢిల్లీని ఆనుకుని ఉన్న నోయిడాలో సగటు ఏక్యూఐ 294గా ఉండగా, గ్రేటర్ నోయిడాలోని కొన్ని ప్రాంతాల్లో 331 వరకు నమోదైంది. బుధవారం నగర సగటు ఏక్యూఐ 259గా, మంగళవారం 282గా నమోదైంది. అంతకుముందు తొమ్మిది రోజుల పాటు వెరీ పూర్ జోన్‌లో ఉన్న గాలి నాణ్యత, గాలుల వేగం పెరగడంతో స్వల్పంగా మెరుగుపడింది. అయితే, ఆ ఊరట ఎక్కువ కాలం నిలవలేదు. వాయు కాలుష్యంతో పాటు నగరంలో చలి తీవ్రత కూడా పెరిగింది.

బుధవారం కనీస ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గురువారం ఉదయం పొగమంచు ఉంటుందని, కనీస ఉష్ణోగ్రత 8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. రానున్న రెండు రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

# భారత్‌కు పోటీగా పాక్ త్రైపాక్షిక కూటమి విస్తరణ కుట్రలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** దక్షిణాసియా రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న భారత్‌కు పోటీగా పాకిస్థాన్ సరికొత్త ఎత్తుగడకు తెరలేపింది. భారత్‌ను పూర్తిగా పక్కనపెట్టి, ఈ ప్రాంతంలో ఒక కొత్త కూటమిని ఏర్పాటు చేసేందుకు ఇస్లామాబాద్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. చైనా, బంగ్లాదేశ్‌లతో ఇప్పటికే ఉన్న తమ త్రైపాక్షిక కూటమిని మరింత విస్తరించి, ఇతర దేశాలను కూడా చేర్చుకోవాలని చూస్తున్నట్లు పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్‌ధర్ వెల్లడించారు. ఏళ్లుగా నిర్వీర్యంగా ఉన్న దక్షిణాసియా ప్రాంతీయ సహకార మండలి (సార్క్) స్థానంలో కొత్త ప్రాంతీయ కూటమి అవసరమని ఆయన నొక్కిచెప్పారు. విభజన రాజకీయాలకు స్వస్తి పలికి, పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో భారత్ వైఖరి కారణంగానే సార్క్ బలహీనపడిందని పరోక్షంగా విమర్శించారు. ఈ ఏడాది ఆరంభంలో పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్ కలిసి ఒక త్రైపాక్షిక వేదికను ఏర్పాటు చేశాయి. జూన్‌లో చైనాలోని కున్‌మింగ్‌లో తొలి సమావేశం కూడా జరిగింది. ఇప్పుడు దీనిని మరింత విస్తరించాలని పాక్ భావిస్తోంది. పాకిస్థాన్ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్ వంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను, బలమైన సైనిక శక్తిని కాదని ఏ పొరుగు దేశం కూడా పాకిస్థాన్ కూటమిలో చేరే సాహసం చేయదని వారు స్పష్టం చేస్తున్నారు. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కంటే భారత్ ఆర్థిక వ్యవస్థ 12 రెట్లు పెద్దదని, విపత్కర సమయాల్లో పొరుగు దేశాలను ఆదుకోవడంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని గుర్తుచేస్తున్నారు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ దౌత్యం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత్ నాయకత్వ పటిమను నిరూపించుకుంది.


# ట్రంప్ గోల్డ్‌కార్డ్ జారీ షురూ!




**వాషింగ్టన్, డిసెంబరు 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతిష్ఠాత్మక గోల్డ్ కార్డ్ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకం కింద 1 మిలియన్ డాలర్లు చెల్లించే వ్యక్తులకు, లేదా ఒక్కో విదేశీ ఉద్యోగికి 2 మిలియన్ డాలర్లు చెల్లించే కార్పొరేట్ సంస్థలకు అమెరికాలో చట్టబద్ధమైన నివాసం కల్పించి, పౌరసత్వానికి మార్గం సుగమం చేయనున్నారు. ఈ మేరకు దరఖాస్తుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. వైట్‌హౌస్‌లో వ్యాపార ప్రముఖుల సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. 1990 నుంచి అమల్లో ఉన్న ఈబీ5 వీసా స్థానంలో ఈ కొత్త పథకాన్ని తీసుకొచ్చారు. దీని ద్వారా వచ్చే నిధులన్నీ నేరుగా ప్రభుత్వ ఖజానాకు వెళ్తాయని, దేశ ప్రగతికి ఉపయోగిస్తామని ట్రంప్ తెలిపారు. "ఇది గ్రీన్ కార్డ్ లాంటిదే కానీ, దానికంటే చాలా ఉత్తమమైనది, శక్తిమంతమైనది" అని ఆయన తెలిపారు. ఒకవైపు కఠినమైన వలస విధానాలు అమలు చేస్తూ, భారీస్థాయిలో బహిష్కరణలు చేపడుతున్న ట్రంప్, మరోవైపు సంపన్న వలసదారుల కోసం ఈ పథకాన్ని తీసుకురావడం గమనార్హం. అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీల్లో చదివిన ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను ఇక్కడే అట్టిపెట్టుకోవడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని ట్రంప్ అన్నారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే వారి నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు 15,000 డాలర్ల ఫీజు వసూలు చేస్తామని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లట్నిక్ తెలిపారు. భారత్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి వచ్చే అత్యుత్తమ గ్రాడ్యుయేట్లు ఈ గోల్డ్ కార్డ్ పొందవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, యూకే, స్పెయిన్, కెనడా వంటి అనేక దేశాల్లో ఇటువంటి గోల్డెన్ వీసా పథకాలు ఇప్పటికే అమల్లో ఉండటం గమనార్హం.

# సంక్షిప్తంగా..

## వెనిజులా చమురు నౌకను సీజ్ చేసిన అమెరికా సైన్యం



**కారకాస్, డిసెంబరు 11:** వెనెజులా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. పదవి నుంచి దిగిపోవాలని వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మధురోను ఇప్పటికే హెచ్చరించిన ట్రంప్ ఇటీవల కరీబియన్ సముద్రంలో యుద్ధ నౌకలను మోహరించారు. డ్రగ్ స్మగ్లర్లకు వంత పాడుతున్నారని మధురోపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల పలు డ్రగ్ స్మగ్లింగ్ బోట్లను అమెరికా సైన్యం సముద్రంలోనే పేల్చివేసింది. ఈ క్రమంలో తాజాగా వెనెజులా ఆయిల్ ట్యాంకర్ షిప్ ను అమెరికా సైన్యం సీజ్ చేసింది. వెనెజులా తీరం నుంచి క్యూబాకు బయలుదేరిన ఈ భారీ షిప్ ను అమెరికా సైనికులు తమ అధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి షిప్ పై దిగిన సైనికులుఆయుధాలతో షిప్ సిబ్బందిని చుట్టుముట్టిన వీడియోను అమెరికా మీడియాకు విడుదల చేసింది. ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిలో ఇదే అతిపెద్ద ఆయిల్ ట్యాంకర్ అని చెప్పారు.

## అఫ్ఘాన్‌పై పాక్ వైఖరిని దుయ్యబట్టిన భారత్!




**న్యూయార్కు, డిసెంబరు 11:** ఆఫ్ఘనిస్థాన్ విషయంలో పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిపై భారత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో పాక్‌పై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులు జరపడాన్ని, అమాయక మహిళలు, చిన్నారులు, క్రికెటర్లను పొట్టనబెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండించింది.సమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ పాకిస్థాన్ చర్యలను ట్రేడ్ అండ్ ట్రాన్సిట్ టెర్రరిజంగా అభివర్ణించారు. భూపరివేష్టిత దేశమైన ఆఫ్ఘనిస్థాన్‌కు వాణిజ్య, రవాణా మార్గాలను దురుద్దేశంతో మూసివేయడం ద్వారా పాకిస్థాన్ ఆ దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇది అత్యంత గర్హనీయం. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న దేశంపై ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని ఆయన అన్నారు.

## టివికె విజయ్ సన్నిహితుడు డిఎంకెలో చేరిక



**చెన్నై, డిసెంబరు 11:** తమిళ సూపర్‌స్టార్ విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఏర్పాటైన కొద్ది కాలానికే అంతర్గత సమస్యలు బయటపడుతున్నాయి. తాజాగా విజయ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సెల్వకుమార్ పార్టీని వీడి, అధికార డీఎంకేలో చేరడం తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో సెల్వకుమార్ డీఎంకే కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీవీకేలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. టీవీకేలో సెల్వకుమార్‌కు అధికారికంగా ఎలాంటి పదవి లేనప్పటికీ, ఆయన విజయ్‌కు వ్యక్తిగతంగా చాలా సన్నిహితుడు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీని వీడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## మీ కిచెన్ టూల్స్‌తోనే జవాబు: సిఎం మమత



**కోల్‌కతా, డిసెంబర్ 11:** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్‌కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ గురువారం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా మహిళలను ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో మీ పేరు లేకపోతే మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయి కదా వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారి వెనుక ఉంటారు. మహిళలా లేక బిజెపినా? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో బిజెపి డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుందని ఆమె విమర్శించారు.

# జన్యులోపంతో 200 మంది చిన్నారులకు కేన్సర్ ముప్పు

### జన్యులోపం ఉన్న వీర్యదాత నుంచి సేకరణవల్లే ఈ దారుణం

**కొపెన్‌హ్యాగెన్; డిసెంబరు 11:** ఐరోపా వ్యాప్తంగా ఓ వీర్యదాత కారణంగా సుమారు 200 మంది చిన్నారుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. క్యాన్సర్‌కు కారణమయ్యే ఓ ప్రమాదకరమైన జన్యు లోపం ఉన్న వ్యక్తి నుంచి సేకరించిన వీర్యాన్ని ఉపయోగించ డంతో ఈ తీవ్రమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వీర్యంతో గర్భం దాల్చిన వారిలో కొందరు చిన్నారులు ఇప్పటికే క్యాన్సర్ బారిన పడి మరణించినట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. డెన్మార్క్‌కు చెందిన ఓ వ్యక్తి వీర్యంలో జన్యువులో లోపం ఉంది. ఈ లోపం వల్ల పుట్టే పిల్లలకు లీఫ్రామినీ సింద్రోమ్ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధి వస్తుంది. దీనివల్ల 60 ఏళ్లు వచ్చేసరికి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం 90 శాతం వరకు ఉంటుంది. బ్రెస్ట్ క్యాన్సర్, బ్రెయిన్ ట్యూమర్లు, ఎముకల క్యాన్సర్ వంటివి వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. 2005లో ఓ విద్యార్థి వీర్యదానం చేయగా, అతడి నమూనాలను 17 ఏళ్ల పాటు వివిధ సంతాన సాఫల్య కేంద్రాలు ఉపయోగించాయి. ఆ సమయంలో నిర్వహించిన సాధారణ స్క్రీనింగ్ పరీక్షల్లో ఈ జన్యు లోపాన్ని గుర్తించడం సాధ్యం కాలేదు. డెన్మార్క్‌కు చెందిన యూరోపియన్ స్పెర్మ్ బ్యాంక్ ఈ వీర్యాన్ని 14 దేశాల్లోని 67 క్లినిక్‌లకు సరఫరా చేసింది. ఈ ఏడాది వైద్య నిపుణులు ఈ అంశాన్ని గుర్తించి హెచ్చరించడంతో విషయం బయటపడింది. ప్రపంచవ్యాప్తంగా కనీసం 197 మంది చిన్నారులు ఈ దాత వీర్యంతో పుట్టి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో వీర్యదాతల స్క్రీనింగ్, దేశాల మధ్య సంతాన సాఫల్య చికిత్సలపై ఉన్న నిబంధనలలోని లోపాలు బయటపడ్డాయి. యూకేలో ఒక దాత వీర్యాన్ని గరిష్ఠంగా 10 కుటుంబాలకు మాత్రమే ఉపయోగించాలనే నిబంధన ఉండగా, ఇతర దేశాల్లో అలాంటి కఠిన నియమాలు లేకపోవడమే ఈ దుస్థితికి కారణంగా తెలుస్తోంది. జన్యు లోపంతో ఉన్న కుటుంబాలను వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

# గోవాక్లబ్ నిర్వాహకులు థాయిలాండ్‌లో అరెస్టు



**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** గోవాక్లబ్‌లోప్రమాదానికి కారణమైన క్లబ్ యాజమాన్యం లూథ్రాసోదరులను థాయిలాండ్‌పోలీసులు అరెస్టుచేసారు. థాయ్ లాండ్ కు పారిపోయినట్లు గుర్తించిన భారత్ పోలీసులు అక్కడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాజాగా పుకెట్ లో దాక్కున్న లూథ్రా బ్రదర్స్ ను థాయ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి చేతికి సంకెళ్లు వేసిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. త్వరలోనే వారిని భారత్ కు పంపించనున్నట్లు థాయ్ లాండ్ పోలీసులు తెలిపారు. అగ్ని ప్రమాదం తర్వాత థాయ్ లాండ్ పారిపోయిన లూథ్రా బ్రదర్స్ ఢిల్లీ హైకోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున లాయర్ దాఖలు చేసిన ఈ పిటిషన్ లో తాము ఎక్కడికీ పారిపోలేదని చెప్పారు. బిజినెస్ మీటింగ్ కోసం థాయ్ లాండ్ వచ్చామని అందులో పేర్కొన్నారు. క్లబ్ నిర్వహణలో ఎలాంటి నిబంధల ఉల్లంఘన జరగలేదని చెప్పారు.

ఆ క్లబ్ నడుపుతున్న బిల్డింగ్ కు తాము యజమానులం కాదని వివరించారు. ప్రమాదం జరిగిన సమయంలో తాము క్లబ్ లో లేమని చెప్పారు. తాము ఢిల్లీలో విమానం దిగగానే పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉందని, తమకు నాలుగు వారాల ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. గోవాలోని నైట్ క్లబ్ లో అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే క్లబ్ యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా థాయ్ లాండ్ పారిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ నడుపుతూ 25 మంది మృతికి కారణమయ్యారని పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

# తెలంగాణ వరద ప్రమాద హెచ్చరిక దేశవ్యాప్తంగా అమలు

## జలసౌధలో ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనిల్‌జైన్ సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ డ్యామ్‌లు బ్యారేజిల వద్ద అనుసరిస్తున్న వరద ప్రమాదసూచనలు హెచ్చరికలు దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ఎన్‌డిఎస్‌ఎ చైర్మన్ అనిల్ జైన్ అన్నారు. గురువారం జలసౌధలో జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ చైర్మన్ అనిల్‌జైన్ నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమైనారు. నైరుతి రుతుపవన కాలంలో వరద ప్రవాహంతో కృష్ణాగోదావరి బేసిన్‌లోని దెబ్బతిన్న బ్యారేజిలు, డ్యామ్‌లను గుర్తించి వాటిని వెంటనే మరమ్మతు చేసుకోవాలని సూచించారు. మళ్లీ నైరుతి రుతుపవనాకాలం వరకు గేట్లు సరిచేసుకోవడం,స్పిల్‌వేపై ఉన్న గోతులు వంటివి పూడ్చుకోవడం చేసుకోవాలని కోరారు. నాగార్జునసాగర్ డ్యామ్, ఎస్ఆర్ఎస్‌పి ఇందిరమ్మ వరదకాలువకు పడిన గండి వంటి అనేక అంశాలను చర్చించారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారెజి కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి ప్రైస్‌బిడ్లను దాఖలు చేసిన సంస్థల అంశం కూడా ఎన్‌డిఎస్‌ఎ దృష్టికి తీసుకెళ్ళారు. బ్యారేజీల రిపేర్లకు సంబంధించిన టెక్నికల్ అంశాలపై సంస్థలుపలు సందేహాలను వారు అందులో చర్చించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి పునరుద్ధరణ డిజైన్లను ఇచ్చేందుకు ఇరిగేషన్ శాఖ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ)ని వారు అనిల్‌జైకు వివరించారు. ఐదు సంస్థలు తమ ఆసక్తిని చూపించగా అందులో నుంచి మూడు సంస్థలు ఆర్వీ అసోసియేట్స్ ఐఐటీ మద్రాస్,స్పెయిన్‌కు చెందిన ఐప్రీసస్ జాయింట్ వెంచర్, పోలవరం డయాఫ్రమ్ వాల్ డిజైన్ చేసిన ఆఫ్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డీఎంఆర్ ఆర్టీఎం ఇంట్రప్లాన్ సిగ్మా జేవీలకు ఇరిగేషన్ శాఖ ప్రైస్‌బిడ్లపై కూడా చర్చించారు. టెస్టుల రిజల్ట్‌కు అనుగులంగా బ్యారెజి రిపేర్లు చేయాలని మేడిగడ్డ ఏడో బ్లాక్ తోపాటు పక్కన ఉన్న అనేక లోపాలతో కూడా బ్లాక్‌లు తొలగించి మొత్తానికి మొత్తం కొత్తగా నిర్మించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అనంతరంఇఎన్‌సి జనరల్,మహ్మద్ అంజద్ హుస్సేన్ ఇఎన్‌సి విజయ ప్రకాశ్, రమేష్‌బాబు, ఒ అండ్ ఎం ఇఎన్‌సి టి.శ్రీనివాస్ తదితర అధికారులతో కలిసి జైన్ ఫ్లడ్ డాటా కమాండ్ కంట్రోల్‌ను సందర్శించారు.



# మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 11:** దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి రెండోరోజున పెద్దఎత్తున సందర్శకులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 11:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను గురువారం పెద్ద ఎత్తున సాధారణ ప్రజలు, విద్యార్థినీ,విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు "డిస్కవర్ తెలంగాణ: కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్ట్–జెన్ టూరిజం" అనే అద్భుతమైన సదస్సుతో ప్రారంభమైంది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డా.మామిడి హరికృష్ణ, బిరద్ రాజారామ్, పి. పద్మావతి, గోపీ బైల్లుప్పాల లు పాల్గొని మాట్లాడారు. అనంతరం, తెలంగాణ రైజింగ్ ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్ అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రగతిని, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్, టూరిజం, ఎడ్యుకేషన్,,కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్, రోబో తదితర 27కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సును సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

# సిఎం నేతృత్వంలో బిసి రిజర్వేషన్ సాధనకు అఖిలపక్షం

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌ను కోరిన వి.హనుమంతరావు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణలో 42శాతం బిసి రిజర్వేషన్ సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వద్దకు రాష్ట్రం నుంచి అఖిల పక్షం ప్రతినిధి బృందం కలిసే విధంగా ప్రయత్నం చేయాలని టిపిసిసిఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ని మాజీ ఎంపి వి.హను మంతరావు కోరారు. గురువారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌తో మాజీ ఎంపి, మాజీ పిసిసి చీఫ్, కాంగ్రెస్ సీనియర్ బిసి నేత వి. హెచ్ సమావేశమైనారు. రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల పైన నేతలు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల అమలు కోసం చేసిన కులగణన, బిసి కమిషన్ ఏర్పాటు, డెడికేషన్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ, మండలి తీర్మానాలు, కేబినెట్ తీర్మానాలు తదితర అంశాలపై తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ పరంగా బిసి సంఘాలతో సమావేశాలు, రౌండ్ టేబుల్ మీటింగ్ లు, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద మీటింగ్‌లు తదితర కార్యక్రమాలు చేసిన అంశాలపై ప్రజల్లో చర్చ జరిపి కాంగ్రెస్ పార్టీ బిసి రిజర్వేషన్ కోసం తీవ్రంగా చేస్తున్న పోరాటంకు మద్దతు కూడగట్టాలని విహెచ్ కోరారు. ప్రస్తుతం బిసి రిజర్వేషన్ల అంశం ముగిసిన అధ్యాయం కాదనీ, ఎలాగైనా సాధించి తీరాలని అందుకు తగిన విధంగా వ్యూ హాలు రూపొందిస్తామని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ విహెచ్‌కు అభయం ఇచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ బిసి నాయకులు ఎఐసిసి అగ్రనేత ను కలిసి జాతీ య స్థాయిలో మరింత వత్తిడి పెంచేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోరాటం చేయాలని ప్రతిపాదనతో ఉన్నామని మహేష్ కుమార్ వివరించారు. బిసి రిజ ర్వేషన్ల విషయంలో ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల అంశంలో అన్ని రకాల సాంకేతిక, చట్టపరమైన, న్యాయ పరమైన చర్యలు తీసుకున్నామని విహెచ్‌కు వివరించారు.

# క్లైమెట్ రిస్క్ సైబర్ రక్షణతో బీమా వ్యాపార పర్యవేక్షణ

**హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త:** ఇంటర్‌నేషనల్ ఇన్సూరెన్స్ సూపర్‌వైజర్ వాతావరణము ఆరోగ్యం, సైబర్ వంటి రిస్కులతో రక్షణ కలిగించే దిశగా వ్యాపార పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉదని ఆసియాన్ ఫోరం ఆఫ్ ఇన్సూరెన్స్ రెగ్యులేటర్స్ సెమినార్ తీర్మానం చేసింది. మంగళవారం నుంచి గురువారం వరకు హైదరబాద్‌లో జరిగిన ఎనిమిదవ ఆసియా పసిఫిక్ హైలెవల్ మీటింగ్‌లో 15 జూరిడిక్షన్స్ నుంచి 40 మంది సీనియర్ రెగ్యూలేటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫైనాన్సియల్ స్టెబిలిటి ఇనిస్టిట్యూట్, ఇంటర్‌నేషనల్ సెటిల్‌మెంట్ బ్యాంకు, ఇంటర్‌నేషనల్‌న అసోసియేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ సూపర్ వైజర్ క్లైమెట్ గ్యాప్స్ హెల్త్, సైబర్ కృత్రిమ మేథో వంటి అంశాలతో సూపర్ వైజింగ్ చేయడంపై సమాలోచనలు చేశారు. 2005 మే 23న బీజింగ్‌లో ఏర్పాటు చేసిన అసియన్ గ్లోబల్ ఇన్సూరెన్స్ మార్కెట్ లక్ష్యాలను అన్ని దేశాలు అనుసరించి సమాచారం క్రమబద్ధీకరణ సామర్థ్యంను పెంచుకోవాలని అదే విధంగా మౌళిక వసతుల కల్పన అంతర్జాతీయ ప్రమాణాకు అనుగుణంగా మార్చుకొంటేనే పశ్చిమదేశాల బీమా రంగం నుంచి ఎదురయ్యే దాడులు తట్టుకొంటామని బీమా వ్యాపారంలో నిలుస్తామని తీర్మానం చేశారు.

# వృద్ధుల సమస్యలకు ప్రత్యేక చట్టం అవసరం

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (రవీంద్రభారతి), డిసెంబరు 11, ప్రభాతవార్త:** వయోవృద్ధులు ఎప్పటికీ భారం కాదు జాతి సంపదని, వారి వారి రంగాల్లో అపారమైన అనుభవజ్ఞులు, నిష్ణాతులని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకుపోవాల్సి అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అయితే నేటికీ వారెదురుకుంటున్న అనేక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చట్టాన్ని దేశవ్యాప్తంగా తీసుకురాల్సిన అవసరం ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయాలని గవర్నరు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ టస్క ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం మధ్యాహ్నం సంస్థ వ్యవస్థాపక దినోత్స వం, వృద్ధుల హక్కుల పరిరక్షణ దినోత్స వం, టస్క 2026 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణోత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథులు జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ మసన చెన్నప్ప, మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్.ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ పి.సుధాకర్‌రెడ్డి, ఎం. కోదండ రామ్, టస్క అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.నర సింహారావు, పిఎస్ ఎన్. చౌదరి తదితరులతో కలిసి జ్యోతి ప్రకాసనంచేసి ముందుగా సంస్థ 9వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని 2026 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. వయోవృద్ధుల పరిజ్ఞానం ఎంతో విలువైనదని, వారి క్రమశిక్షణతో పాటు అపారమైన జీవితానుభవాలు దిక్సూచి వంటివన్నారు. నేడు పిల్లలు తమ తల్లిదండ్రులను చూసుకోకుండా వృద్ధాశ్రయాలను ఆశ్రయిస్తున్నారని ఆందోళన వ్యక్తపరిచారు. వృద్ధాప్యంలో పిల్లలే తమ తల్లిదండ్రులను పోషించా లనే 2007లో ప్రత్యేక చట్టాన్ని రూపొందించడం జరిగిందని గుర్తుచేశారు. వృద్ధుల హక్కుల గురించి అవగాహన కల్పించ ˇడానికి టస్క చేస్తున్న ప్రయత్నం హర్షదాయ కమన్నారు. వైద్యం లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల వృద్ధులు 80 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా జీవించగలుగు తున్నారని ఎం.కోదండరామ్ అన్నారు. వృద్ధులకు ప్రత్యేక శాఖ ను ఏర్పాటుచేసి వారి సమస్య లను సమగ్రంగా పరిష్కరించాలని సూచించారు. వారి ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందని స్పష్టం చేశారు. ఆచార్య మసన చెన్నప్ప మాట్లాడుతూ వృద్ధుల కోసం సంక్షేమశాఖను ఏర్పాటుచేఇ తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.




వయోవృద్ధులకు సేవారత్న అవార్డులను ప్రదానం చేస్తున్న గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ, కోదండరామ్, చెన్నప్ప, నరసింహారావు తదితరులు




# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన రద్దు చేయాలి

## ఢిల్లీ జంతర్‌మంతర్ దగ్గర ఉపాధ్యాయుల ధర్నా

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్టు నిబంధన రద్దు చేయాలని డిమాండ్ చేస్తూవేలాదిమంది ఉపాధ్యాయులు ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యా యులకు టెట్ నిబంధనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ, అఖిల భారత విద్యాసంఘాల సమాఖ్య, టిఆర్‌టిఎఫ్, ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. నిరసన నినాదాలతో జంతర్ మంతర్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఈ) ప్రకారం, టెట్ నిబంధన అమల్లోకి రాకముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు వాస్తవంగా మినహాయింపు ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2017లో పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసి, ఇన్ సర్వీస్ టీచర్లతో సహా అందరికీ టెట్‌ను తప్పనిసరి చేయడాన్ని తీవ్ర అన్యాయంగా పేర్కొన్నారు. 2017లో చేసిన ఈ సవరణను ఉద్దేశిస్తూ, ఇది "ఆట మధ్యలో నిబంధన మార్చడం" లాంటిదని కటకం రమేష్ అభివర్ణించారు. ఈ సవరణ వల్లే ఇన్ సర్వీస్ టీచర్లకు సమస్య మొదలైందని స్పష్టం చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరి చేస్తూ పార్లమెంట్‌లో చేసిన సవరణను తక్షణం రద్దు చేయాలని ధర్నాలో పాల్గొన్న వేలాది మంది ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలోనే 2017 లో చేసిన సవరణను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# 19 నుండి ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ షో

## 21 వరకు హైటెక్స్‌లో నిర్వహణ

**హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త:** దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మరోసారి మెగా ప్రాపర్టీ షోను నిర్వహిస్తోంది. నివాస కొనుగోలుదారులకు ఆస్తులను అందుబాటులో ఉంచే లక్ష్యంతో.. ఈ నెల 19 నుండి 21 వరకు హైటెక్స్‌లోని హాల్ నంబర్ 4లో మెగా ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి గురువారం ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ రాధాకృష్ణన్ ఇతర అధికారులతో కలిసి ప్రచార ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. గృహ రుణాలలో ఎస్‌బిఐ మార్కెట్ లీడర్ అని, ఈ ఎక్స్‌పోలో 60 మందికి పైగా డెవలపర్లు తమ వివిధ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఆసక్తిగల కస్టమర్లు ఎక్స్‌పోలో నివాసాలను కొనుగోలు చేయడం ద్వారా వివిధ తగ్గింపులను పొందవచ్చని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజులు, లీగల్, వాల్యుయేషన్ ఛార్జీలు కూడా మాఫీ చేయబడతాయన్నారు. గృహ రుణ వడ్డీ రేట్లు 7.7 శాతం నుంచి 8.5 శాతం వరకు ఉంటాయన్నారు. రుణగ్రహీత క్రెడిట్, ఆస్తి ఆధారంగా వడ్డీ రేట్లు అమలు చేయబడతాయని స్పష్టం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం రేవంత్‌రెడ్డి పాలనకు రెండు కళ్లు

## తెలంగాణలో గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది

## ఎస్ఐఆర్‌పై ఎన్‌డిఎ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది : ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ప్రజా పాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా మారాయనీ తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ డా.మల్లు రవి కితాబు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రజా పాలన నచ్చి సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ఎస్ఐఆర్‌పై ఎన్‌డిఎ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ మల్లు రవి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం విలేఖరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడింది. బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాలు తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని పక్కనపెట్టింది. వారి సొంత లాభాల కోసం పనిచేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి వచ్చిన వెంటనే రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ ఇవ్వటం, మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు సౌకర్యం కల్పించడం, 200 యూనిట్స్ కరెంటు ఇవ్వటం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సప్లై, నిరుద్యోగులకు 75 వేల ఉద్యోగాలు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సమూలమైన సాంఘిక మార్పు కోసం 100 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులను ఒకే హాస్టల్ లో ఉంచి చదువుకునే ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణలో శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేసి 42శాతం రిజర్వేషన్ కోసం కృషి చేశారు. ఇవన్నీ తెలంగాణలో గత 10 సంవత్సరాల పాలనలో జరగలేదు అని ఎంపీ మల్లు రవి చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించారు.

ప్రపంచ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ రెండు రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల 75 వేల కోట్ల పెట్టుబడులు పెట్టటానికి ఎంవోయూలు కుది రాయి. ఇంత పెద్దఎత్తున ఎప్పుడూ ఒప్పందాలు జరగలేదు. మన ముఖ్యమంత్రి తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే, అత్యున్నతమైన విద్యను అందించాలని సంకల్పించారు. ఆ ఉద్దేశంతోనే 100 సమీకృత రెసిడెన్షియల్ స్కూల్స్ విధానాన్ని తీసుకొచ్చారు. రెండు రోజులుగా పార్లమెంట్‌లో ఎస్ఐఆర్‌పై చర్చ జరుగుతోంది. దానిమీద ప్రతిపక్ష పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ, కేసి వేణుగోపాల్, ఇతర నాయకులందరూ కూడా ప్రజలకు ఉన్నటువంటి అనుమానాలపై మాట్లాడారు. ఎస్ఐఆర్‌కు కనీసం 6 నెలల సమయం కావాలి. కానీఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో హడావిడిగా దీన్ని నిర్వహిస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల సభ్యులకు సమాధానం కూడా చెప్పడం లేదు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది ఒత్తడి తట్టుకోలేక చనిపోయారు. దీనిపై ఇండియా కూటని సభ్యులు ప్రశ్నిస్తుంటే ఎస్ఐఆర్ మంచిదని, మేము ఇట్లానే చేస్తామని అంటున్నారు. మీరు ఇందిరాగాంధీ కాలంలో, రాజీవ్ గాంధీ కాలంలో అప్పుడు అలా చేశారు. ఇలా చేశారని సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. హౌస్‌లో ప్రతిపక్ష నాయకుడి మీద, సభ్యుల మీద కనీస గౌరవం లేకుండా, రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. ఈ వైఖరి కారణంగా ఇండియా కూటమి సభ్యులు వాకౌట్ చేయాల్సి వచ్చిందనీ మల్లు రవి వ్యాఖ్యానించారు.

# రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ సరదాకు రూ.100 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

## బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 11:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఫుట్‌బాల్ సరదా కోసం రూ.వంద కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇలా ప్రజాధనం దుర్వినియోగం ముమ్మాటికీ ఆర్థిక నేరమే అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజాధనంతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలు నిన్నే ఫుట్‌బాల్ ఆడుకుంటారని మహేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో మెస్సీతో ఫుట్ బాల్ మ్యాచ్ ఆడడానికి ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేస్తోందో, ఏ యే శాఖల నుంచి ఖర్చు చేస్తోందో, ఎందుకు ఖర్చు చేస్తోందో సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ టీమ్ ను సింగరేణి స్పాన్సర్ చేస్తోందని మీడియాలో చూశానని, ఈ ఫుట్ బాల్ ఆట కోసం సింగరేణి డబ్బులను ఎంత ఖర్చు చేస్తున్నారు, ఎందుకు ఖర్చు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇవే డబ్బులను సింగరేణిలో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడానికి లేదంటే కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయవచ్చు కదా అని అన్నారు. మెస్సీ టీమ్‌తో రేవంత్ టీమ్ ఫుట్ బాల్ ఆడడం వల్ల రాష్ట్రానికి వచ్చే ప్రయోజనమేంటో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనిల్ మెస్సీ ఒక ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడితే, అప్పీయరెన్స్ ఫీజు కింద రూ.70 కోట్లు తీసుకుంటారని తెలిసిందని, అయితే మెస్సీకి ఇచ్చే అప్పీయరెన్స్ ఫీజు ఏ ప్రభుత్వ శాఖ చెల్లిస్తోందో చెప్పాలని, దాని వల్ల కలిగే ప్రయోజనమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి, పర్యాటక, క్రీడల శాఖల నుంచి నిధులను మెస్సీ టూర్‌కు మళ్లించినట్లు సమాచారం ఉందని, అయితే ఫుట్ బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌తో ఈ మూడు శాఖలకు కలిగే ప్రయోజనమేంటో చెప్పాలని ఆయన కోరారు.



# తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సౌత్ జోన్ బ్యాండ్ పోటీలు

## అగ్రికల్చర్ యూనివర్సిటీ క్యాంపస్‌లో కొనసాగుతున్న పోటీలు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సౌత్‌జోన్ బ్రాస్ బ్యాండ్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు నేడు(శుక్రవారం) కూడా కొనసాగనున్నాయి. పోటీలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కాంపస్‌లోని క్రీడా సముదాయంలో పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రారంభించారు. బ్రాస్ బ్యాండ్ (బాలురు, బాలికలు), పైప్ బ్యాండ్ (బాలురు, బాలికలు) విభాగాలలో నిర్వహించబడనున్నాయి. సౌత్‌జోన్ స్థాయిలో విజేతగా నిలిచిన బృందాలు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బ్యాండ్ పోటీకి సౌత్ జోన్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి. పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రాధా రెడ్డి, జాయింట్ డైరెక్టర్ రాజీవ్ పాల్గొన్నారు. ఈ పోటీలు కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సహకారంతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరికి చెందిన 9 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విద్యార్థి బృందాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పోటీలు విద్యార్థులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమన్వయ భావనలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# పోచంపల్లి డూప్లికేషన్ సమస్య పరిష్కరిస్తే ఉపాధి

## కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో సమావేశమైన ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** పోచంపల్లి వస్త్రాలను పోలిన డూప్లికేషన్ జరుగుతోందని దీనిని వెంటనే పరిష్కరిస్తే పోచంపల్లి పట్టు చీర బ్రాండ్ ఇమేజ్ పరిరక్షణ జరుగుతోందని ఆ దిశగా చర్యలు చేపడుతామని నేషనల్ టెక్స్‌టైల్ హ్యూమన్ రీసోర్స్ మంత్రి గిరిరాజ్‌సింగ్ తెలిపారు. గురువారం టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ సలహాసంఘం సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని పోచపల్లి నారాయణపేట, సిరిసిల్ల వస్త్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని వివరించారు. తెలంగాణలోని 30,000 హ్యాండ్‌లూమ్స్‌లో సుమారు 15,000 లూమ్స్ పోచంపల్లి ఉన్నాయని తెలిపారు.

పట్టు కాటన్ వస్త్రాలు తయారు చేస్తున్నారని వివరించారు.. 50,000 కుటుంబాలు నేరుగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయనీ వివరించారు. గత 20 ఏళ్లుగా పోచంపల్లి డుప్లికేట్ చీరల తయారీతో నష్టపోతున్నారని తెలిపారు. గత 10 ఏళ్లలో ఇవి మార్కెట్‌ని పూర్తిగా ఆక్రమించడం మొదలెట్టాయనీ ఏది అసలు ఏదీ నకిలీ తెలియనంతంగా మారాయని ఆవేదన చెందారు. పోచంపల్లి పరిసర ప్రాంతంలోని 40 గ్రామాల్లో 15,000 హ్యాండ్‌లూమ్స్, సుమారు రూ.1,000 కోట్ల విలువైన పట్టు, కాటన్ చీరలను తయారు చేస్తున్నారు. వీటిలో ఒక భాగం ఎగుమతులకు వెళుతోంది. కానీ డుప్లికేషన్ కారణంగా అసలు పోచంపల్లి హ్యాండ్‌లూమ్ మార్కెట్ తీవ్రంగా దెబ్బతింటోంది. అసలు రూ.10,000/ విలువ చేసే పట్టు చీర, కేవలం రూ. 600 ఖర్చుతో డుప్లికేట్‌గా తయారు చేస్తున్నారని ఆయన వివరించారు. నేతన్నలు రూపొందించే నూతన డిజైన్లు, పవర్‌లూమ్ యజమానులు కొన్ని వారాల్లోనే కాపీ చేసి చౌక ధరలకు మార్కెట్లోకి విడుదల చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. దీని వల్ల అసలు హ్యాండ్‌లూమ్ పట్టు, పత్తి చీరలకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. జిఐ రక్షణ ఏర్పాటు చేయాలని కోరారు.





## టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుతో శ్రీశైలం దేవస్థానం

### పాలకమండలి చైర్మన్, సభ్యుల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 11:** టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడును హైదరాబాద్ లోని టిటిడి చైర్మన్ కార్యాలయంలో గురువారం శ్రీశైలం దేవస్థానం పాలక మండలి చైర్మన్ పి. రమేష్ నాయుడు, బోర్డ్ సభ్యులు కలిసారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి టిటిడి సహకారం అందించాలని కోరారు. శ్రీశైలంలో నూతనంగా కాటేజ్ ల నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం దేవస్థానంను సందర్శించి దేవస్థాన అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. శ్రీశైలం దేవస్థానం పాలక మండలి చైర్మన్, సభ్యుల అభ్యర్థనను టిటిడి బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని టిటిడి బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ ను సత్కరించి, శ్రీశైలం దేవస్థానం స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు.

# రెండో టి20లో దక్షిణాఫ్రికాదే విజయం

### 51 పరుగుల తేడాతో టీమిండియా ఓటమి

**న్యూచండీగఢ్, డిసెంబరు 11:** టీ20 సిరీస్‌ను భారీ విజయంతో ఆరంభించిన భారత జట్టుకు భారీ షాక్ తగిలింది. ముల్లన్‌పూర్‌లో క్వింటన్ డికాక్(90) మెరుపులతో భారీ స్కోర్ చేసిన దక్షిణాఫ్రికా బౌలర్ల విజృంభణతో సిరీస్ సమం చేసింది. 214 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమవ్వగా తిలక్ వర్మ(62), జితేశ్ శర్మ(27)లు మాత్రమే పోరాడారు. కానీ, లుంగి ఎంగిడి(2-26), బార్ట్‌మన్ (4-24)ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టారు. దాంతో 51 పరుగుల తేడాతో ప్రొటీస్ జట్టు సిరీస్ సమం చేసింది. పొట్టి సిరీస్‌లో భారత జట్టు జోరుకుబ్రేక్ పడింది. కటక్‌లో ఏకపక్ష పోరులో కంగుతిన్న దక్షిణాఫ్రికా రెండో మ్యాచ్‌లోగొప్పగా పుంజుకొని ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. 214 ఛేదనలో ఓపెనర్ శుభ్‌మన్ గిల్(0) మరోసారి విఫలమవ్వగా దంచేస్తున్న అభిషేక్ శర్మ(17)ను యాన్సెన్ పెవిలియన్ పంపి బ్రేకిచ్చాడు. సఫారీ బౌలర్లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. 67కే నాలుగు వికెట్లు పడిన వేళ తిలక్ వర్మ (62), హార్దిక్ పాండ్యా(20)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, సిపమ్లా ఓవర్లో పాండ్యా ఔట్ కావడంతో మ్యాచ్‌పై ఆశలు సన్నగిల్లాయి. ఆఖర్లో జితేశ్ శర్మ(27) ధనాధన్ ఆడినా.. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసిన బార్ట్‌మన్ (4-24) సఫారీలకు భారీ విజయాన్ని అందించాడు. డికాక్ అర్ధ శతకంతో తొలి టీ20లో 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా రెండో మ్యాచ్‌లో భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్(90) విధ్వసంక ఆటతో రెండొందలు కొట్టింది. ముల్లనూర్ స్టేడియంలో భారత బౌలర్లను ఉతికేసిన డికాక్ మెరుపు అర్ధ శతకంతో చెలరేగాడు. సిక్సర్ల మోత మోగించిన అతడిని జితేశ్ శర్మ స్టంపౌట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, ఆఖర్లో డొనోవాన్ ఫెరీరా(30 నాటౌట్), డేవిడ్ మిల్లర్(20 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. చివరి మూడు ఓవర్లలో ఈ ద్వయం 49 రన్స్ పిండుకోగా నిర్ణీత ఓవర్లలో ప్రొటీస్ టీమ్ 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.




# నేడు మక్క రైతులకు రూ. 588 కోట్లు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మొక్కజొన్న అమ్మిన రైతుల ఖాతాల్లో వాటికి సంబంధించిన బకాయిలను విడుదల చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో వీటికి సంబంధించి ఈ నెల 12వ తేదీన 588 కోట్ల రూపాయలను 55,904 మంది రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.45 లక్షల టన్నుల మొక్కజొన్న సేకరణ పూర్తిచేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేనప్పటికీ, రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులు నష్టపోకుండా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వమే పంట సేకరణ చేపట్టిందన్నారు.

**ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని సందర్శించిన తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ కార్యాలయాన్ని తుమ్మల పరిశీలించారు. కార్యాలయ ఉద్యోగుల హాజరు, పనితీరు, నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు.

సిబ్బంది ఆలస్యంగా హాజరుకావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని సిబ్బంది పట్ల తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రవికుమార్ ఆస్తులపై మళ్లీ సిఐడి, ఎసిబి ఆరా

### నేడో, రేపో రంగంలోకి అధికారులు

**తిరుమల, డిసెంబరు 11, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో అమెరికన్ డాలర్లు చోరీచేసిన కేసులో నిందితుడు రవికుమార్ ఆస్తులను గుర్తించి తదుపరి ఐటి,ఇడిలకు సమా చారం అందించాలని హైకోర్టు ధర్మాసనం ఆదే శించడంతో మరోసారి సిఐడి, ఎసిబి అధికా రులు రంగంలోకి దిగనున్నారు. రవికుమార్‌కు, అతని కుటుంబసభ్యులకు సంబంధించి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిల్లో ఎన్ని విక్రయిం చారు, ఎవరికి విక్రయించారనే వివరాలతో కూడిన డాక్యుమెంట్లను సిఐడి రాబట్టనుంది. ఇప్పటికే కొంతవరకు ఆస్తుల వివరాలపై కూపీ లాగిన సిఐడి, ఎసిబి అధికారులు ఇప్పుడు మళ్లీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయనున్నారు. పరకా మణి చోరీకేసులో పోలీసులు కేసు నమోదు చేయడం, తదుపరి విచారణ చేసినా చట్ట పరంగా చర్యలు తీసుకోలేదని, లోక్‌అదాలత్ ద్వారా కేసు రాజీచేసుకోవడం పెద్ద దుమారం రేపింది. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో ఆ రెండు శాఖల అధికారులు ముందుకు కదలనున్నారు. ఇప్పటికే పరకామణిలో చోరీ కేసు విచారణ చేపట్టిన సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలోని అధికారులు పూర్తినివేదికలను హైకోర్టుకు సమర్పించారు. 2023 జూన్‌లోనే అప్పటి టిటిడి బోర్డు పెద్దలు 14.43కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను 07 గిఫ్ట్‌డీడ్‌లుగా శ్రీవేంకటేశ్వరస్వామికి స్వీకరించడం జరిగింది. వాటి విలువ మార్కెట్లో 40కోట్లు చేస్తుందని సిఐడి డిజి మీడియాకు వెల్లడించడం విశేషం. ఈ వ్యవహారంలో చోరీ సొత్తు విలువ లక్షల్లో ఉంటే శ్రీవారికి కానుకగా 14కోట్ల రూపాయలు ఆస్తులు ఎందుకు స్వీకరించారనేది హైకోర్టు అనుమానాలు. రాజీ వెనుక ఎంత మొత్తంలో ఎవరెవరు లబ్ధిపొందారనేది ప్రధాన ఆరోపణలపై హైకోర్టు ధర్మాసనం కూపీ లాగనుంది. నిందితుడుకి సంబంధించిన ఆస్తులు చెన్నై, బెంగ ళూరు, హైదరాబాద్, తిరుపతి,విశాఖల్లో ఉన్నట్లు డాక్యుమెంట్లను, వాటిల్లో కొన్ని విక్రయించినట్లు విక్రయ రికార్డులను సిఐడి సేకరించింది.

# పల్లెల్లో పంచాయతీ పోరు-విచిత్ర ఘటనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 11:** తెలంగాణ పల్లెల్లో పంచాయతీ పోరులో విచిత్రమైన ఘటనలు చోటు చేసుకున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని లక్ష్మక్కపల్లి సర్పంచి ఎన్నిక లాటరీ ద్వారా చేపట్టారు. వివరాల్లోకి వెళితే గ్రామంలో మొత్తం 323 ఓట్లుండగా 296 ఓట్లు పోలయ్యాయి.కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి వేముల సురేందర్ రెడ్డికి 148 ఓట్లు, బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థి ఇండ్ల రాజయ్యకు 147 ఓట్లు రావడంతో తొలుత కాంగ్రెస్ అభ్యర్థి గెలిచాడనుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఒకటి ఉండటంతో దాన్ని లెక్కించగా ఇరువురికీ సరి సమంగా ఓట్లు లభించాయి. దీంతో డ్రా ప్రక్రియ అనివార్యమైంది.

ఈ డ్రా విధానంలో ఇండ్ల రాజయ్య పేరు రావడంతో అధికారులు బీఆర్ఎస్ అభ్యర్థి ఇండ్ల రాజయ్య గెలుపొందినట్లుగా ప్రకటించారు. దుబాయ్‌లో ఉంటున్న మరికల్ పట్టణానికి చెందిన సీమ భాస్కర్ అనే వ్యక్తి పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు బుధవారం రాత్రి మరికల్‌కు వచ్చారు. రాకపోకలకు దాదాపు రూ.40 వేల వరకు రవాణా ఖర్చు అవుతుందని తెలపడంతో అందరూ అవాక్కయ్యారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన కంతి లాడే లింగన్న అనే వ్యక్తి వయసు 101 ఏళ్లు. గురువారం ఆయన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. సొంతంగా కర్ర సాయంతో నడుచుకుంటూ పోలింగ్ కేంద్రానికి వచ్చారు. లింగన్న వయసు 105 ఏళ్లని, ఆధార్‌కార్డులో మాత్రం పుట్టిన సంవత్సరం 1924గా నమోదైందని వెంట వచ్చిన ఆయన మనవడు తెలిపారు. ఓటేసి బ్యాలెట్ పేపర్‌ను డబ్బాలో వేసి వెనుతిరిగి వెంటనే ఓ వృద్ధుడు తనువు చాలించాడు. ఈ ఘటన నల్గొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో చోటుచేసుకుంది.

అక్కడున్న ఓటర్లు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చెరుపల్లి బుచ్చయ్య(69) గురువారం ఉదయం ఓటు వేసేందుకు పోలింగ్ రూంలోకి వెళ్లి ఓటును వినియోగించుకొని వెను తిరిగిన క్రమంలో స్పృహ కోల్పోయి పాఠశాల ఆవరణలోనే పడిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించే క్రమంలో ప్రాణాలు విడిచారు. బుచ్చయ్య 20 రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఏకంగా అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కొన్ని నెలలుగా పక్షవాతం రావడంతో బాధపడుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఆరోగ్యరాజు అనే మరో వ్యక్తి నెల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఇద్దరూ నడవలేని స్థితిలో ఉండటంతో గురువారం ఇద్దరినీ వారి వారి కుటుంబీకులు అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రానికి వేర్వేరుగా తీసుకొచ్చి ఓటు వేయించారు. ఎన్నికల అధికారులు అంబులెన్స్ వద్దకే వచ్చి వారి చేత ఓటు వేసే అవకాశం కల్పించారు.

## ఎపి సిఎం-6, డిసిఎం-11, లోకేష్-9

### వివిధ మంత్రుల పనితీరు ర్యాంకులు ప్రకటించిన ఎపి సిఎం చంద్రబాబు

### ఇకనైనా మంత్రుల సామర్థ్యం పెరగాలని సూచన

**విజయవాడ,డిసెంబరు11,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో మంత్రుల పనితీరును అనుసరించి వారికి ర్యాంకింగ్‌లను సిఎం చంద్రబాబు గురువారం మంత్రిమండలి నేపథ్యంలో వెల్లడించారు,.ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రుల వేగాన్ని బట్టి సిఎం చంద్రబాబు ఈ ర్యాంకులు ప్రకటించారు,ఈ ర్యాంకులో సిఎం చంద్రబాబు 6వ స్దానంలో ఉంటే, ఉప ముఖ్యమంత్రి పవన్ 11వ స్దానానికి, ఐటి విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌లు పరిమితమై ఉన్నారు.. ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచాలని నిర్దేశించారు. శాఖల వారీగా మంత్రుల వద్దకు వస్తున్న ఫైల్స్.. వాటి క్లియరెన్స్‌కు తీసుకుంటున్న సమయం.. ఏ మంత్రి వద్ద ఎన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయనే అంశం పైన వివరాలను చెబుతూ... కీలక సూచనలు చేసారు. కాగా, ఫైళ్ల క్లియరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆరోస్థానంలో ఉన్నారు. మిగిలిన మంత్రుల ర్యాంకులను బయట పెట్టారు.ఫైల్స్ క్లియరెన్స్ టైం రిపోర్ట్‌ను ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌సదస్సులో ప్రదర్శించారు. కాగా, ఈ ఆఫీస్ ఫైళ్ల పరిష్కారంలో సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ముందు వరసలో ఉన్నారు. ఆయన లాగిన్‌కు ఫైల్ రాగానే సగటున రెండు రోజుల 41 నిమిషాల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నారు.ఆ తర్వాతి స్థానంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నారు. ఈ ఇద్దరూ ఒక్క ఫైలు కూడా పార్కింగ్ (ఎటూ తేల్చకుండా పెండింగ్‌లో పెట్టడం)లో ఉంచలేదు. మూడో స్థానంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఉన్నారు. ఫైళ్ల పరిష్కారం, లాగిన్‌కు వచ్చిన ఫైళ్లు చూసుకునే సమయం ఆధారంగా ఇచ్చిన డేటాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరో స్థానంలో నిలిచారు. వాస్తవానికి మంత్రుల అందరికంటే సిఎంకు ఎక్కువ ఫైల్స్ వచ్చాయి. ఇప్పటి వరకు ఆయనకు 6,713 ఫైళ్లు రాగా 6,653 పరిష్కరించారు. అత్యధికంగా 401 ఫైళ్లను పార్కింగ్‌లో ఉంచారు. ఆయన ఫైల్స్‌ను చూసేందుకు సగటున 3 రోజుల 8.18 గంటల సమయం తీసుకుంటున్నారు. ఐటీ, విద్యా శాఖల లోకేశ్‌ది 9వస్థానం. ఆయన లాగిన్‌కు మొత్తం 3,916 ఫైల్స్ రాగా, 3,669 పరిష్కరించారు. 266 పార్కింగ్‌లో ఉంచారు. ఒక ఫైల్‌ను చూసేందుకు సగటున 3 రోజుల 14:10 గంటలు తీసుకుంటున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 11వ స్థానంలో ఉన్నారు.ఆయన 2,001 ఫైళ్లు పరిష్కరించారు. 67 పార్కింగ్‌లో ఉంచారు. తన లాగిన్‌కొచ్చిన ఫైళ్లను చూసేందుకు ఆయన సగటున 4 రోజుల 9.43 గంటల సమయం తీసుకుంటున్నారు. అయితే,ఈఆఫీసు ఫైళ్లను చూడడంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర వెనుక బడ్డారు. ఫైలు చూసేందుకు రాంప్రసాద్‌రెడ్డి సగటున 15 రోజుల 19.53 గంటలు తీసుకుంటున్నారు. కొల్లు రవీంద్ర 15 రోజుల 5:23 గంటలు తీసుకుంటున్నారు. మంత్రి పయ్యావుల కేశవ్‌కు 11 రోజులు పడుతోంది. ఈయన చివరి నుంచి మూడోస్థానంలో నిలిచారు.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో భూ కేటాయింపులు, రెవెన్యూ సమస్యలపై జిల్లాలో సమీక్షి ంచాలని ఇంచార్జి మంత్రులను సిఎం ఆదేశించారు. మంత్రులు పరిష్కరించాల్సిన పనులను తమ దృష్టికి తీసుకొస్తే ఎలా అని సిఎం ప్రశ్నించారు. ఇక చేనేతలకు ఉచిత విద్యుత్ అంశాన్ని ఆర్థిక శాఖ పెండింగ్‌లో ఉంచడంపై పలువురు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు.సూర్యఘర్‌తో అనుసంధానం చేశారని మంత్రులు చెప్పారు. అయితే సూర్యఘర్‌తో సంబంధం లేకుండా చూడాలని... దీనిని వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా జగనన్న కాలనీలో గృహాలు నిర్మించని లబ్ధిదారుల పట్టాలు రద్దు చేయాలని పలువురు మంత్రులు కోరారు. చాలా ప్రాంతాల్లో ఇల్లు నిర్మించకుండా వృధాగా ఉన్నాయని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇప్పటికే లబ్ధిదారుల పేరిట స్థలాలు రిజిస్టర్ అయి ఉన్నాయని మరికొంతమంది మంత్రులు చెప్పారు. పట్టాలు రద్దు చేయడం సాధ్యం కాదని సిఎం దృష్టికి మంత్రి అచ్చెన్నాయుడు తీసుకెళ్లగా.. ఇది నిజమేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా తెలిపారు. దీనిపై మంత్రులు కూర్చొని ఆలోచించాలని ముఖ్యమంత్రి సూచించారు. లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి ఇల్లునిర్మిస్తారా? లేదా? అనేది తెలుసుకోవాల న్నారు. ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే కొత్త లబ్ధిదారులకు మూడు సెంట్లు ఇవ్వాలని గతంలో చెప్పిన విషయాన్ని సిఎం గుర్తుచేశారు. అలాగే రెవెన్యూ సమస్యలన్నీ కూడా ఏడాదిలోగా పరిష్కరించాలని సీనియర్ ఐఏఎస్ అధికారి సాయి ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇకపై కేబినెట్ బేటీ మంత్రులు ఎవరైనా ముందే రావాలని.. ఆలస్యం రావద్దని స్పష్టం చేసారు.బుధవారం జరిగిన శాఖాధిపతుల సమావేశానికి తాను 10 నిమిషాలు ఆలస్యంగా వచ్చానని.. దీని కారణంగా అక్కడ ఉన్న అందరికీ క్షమాపణ చెప్పానని వెల్లడించారు. తన తప్పును సరిదిద్దుకున్న నట్లు వివరించారు.

# నలుగురు హాస్టల్ విద్యార్థినులు ఆత్మహత్యా యత్నం

### వార్డెన్ తిడుతున్నారని ఆరోపణ

### ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

**అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 11 ప్రభాతవార్త :** వార్డెన్ తిడుతున్నారని నలుగురు విద్యార్థినీలు మనస్థాపం చెంది కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ముచ్చుకోట గ్రామానికి చెందిన విద్యార్థినులు సౌజన్య, జాహ్నవి, లావణ్య, సౌమ్య అనంతపురంలో గిల్డప్ సర్వీస్ స్కూల్ పక్కన ఉన్న ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ నెంబర్-1లో వసతి పొందుతూ కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అయితే వార్డెన్ వసంత మమ్మల్ని ప్రతిరోజు పదే పదే తిడు తున్నారని, దీనివల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. దీనిని భరించలేక లోలోపలే ఆవేదన చెందుతున్నారు. ఈబాధ భరించలేక చనిపోవాలని నిర్ణ యించుకొని గురువారం ఉదయం హాస్టల్ నుండి కళాశాలకు వెళ్లారు. అక్కడ ఆ నలుగురు విద్యార్థినీలు సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. వెంటనే సిబ్బంది గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం లేదని వైద్యులు తెలిపారు.నలుగురు విద్యార్థులు ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనపై సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు.

# రూ.1.5 కోట్ల లాటరీ తగిలినా విజేతకు భయం

### ఇంటికి తాళం వేసి అజ్ఞాతంలోకి!

**ఫరీద్‌కోట్, డిసెంబరు 11:** ఒక వ్యవసాయ కూలీని లాటరీ రూపంలో అదృష్టం వరించింది. రూ.200 పెట్టి కొన్న టికెట్ కు ఏకంగా కోటిన్నర రూపాయల బహుమతి దక్కింది. ఈ విషయం చుట్టుపక్కల బాగా ప్రచారం కావడంతో ఆ వ్యవసాయ కూలి కుటుంబం భయాందోళనలకు గురై అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఇంటికి తాళం వేసి, సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి గుర్తుతెలియని ప్రాంతానికి వెళ్లిపోయింది. లాటరీ డబ్బు కోసం ఎవరైనా తమపై దాడి చేసే అవకాశం ఉందనే భయంతో కుటుంబం మొత్తం ఇల్లు విడిచిపెట్టి పోయింది. పంజాబ్ లోని ఫరీద్ కోట్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, పోలీసులు కల్పించుకుని వారికి రక్షణగా ఉంటామని హామీ ఇవ్వడంతో ఆ కుటుంబం తమ ఇంటికి తిరిగివచ్చింది. ఫరీద్‌కోట్ జిల్లాలోని సైదేకే గ్రామానికి చెందిన నసీబ్ కౌర్, ఆమె భర్త రామ్ సింగ్ లు వ్యవసాయ కూలీలు. రామ్ సింగ్ ఇటీవల కొన్న లాటరీ టికెట్ కు రూ.1.5 కోట్ల ప్రైజ్ మనీ తగిలింది. దీంతో తమ కష్టాలు



తీరిపోయాయని ఆ జంట సంతోషించింది. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల్లోనూ విశేషంగా ప్రచారం కావడంతో రామ్ సింగ్ తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు. డబ్బు కోసం తమపై దాడి జరగవచ్చని ఆందోళన చెందాడు. దీంతో ఇంటికి తాళం వేసి, సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి భార్య సహా ఊరు విడిచివెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఫరీద్ కోట్ పోలీసులు రామ్ సింగ్, నసీబ్ కౌర్ లను సంప్రదించారు. ప్రజల భద్రత కోసమే తాము ఉన్నామని, వారికి ఎలాంటి హాని జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రామ్ సింగ్, నసీబ్ కౌర్ తమ ఇంటికి తిరిగి వచ్చారు.

### వరిలో పంజాబ్‌ను దాటేసిన రాష్ట్రం

### సాగులో దూసుకెళ్తున్న తెలంగాణ

# వ్యవసాయంలో సరికొత్త రికార్డ్

**హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** వ్యవసాయంలో తెలంగాణ దూసుకెళ్తూ సరికొత్త రికార్డ్ సృష్టిస్తోంది. సాగులో పంజాబ్‌ను దాటి రాష్ట్ర ప్రత్యేకతను సంపాదించింది. ప్రధానంగా వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుంటోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికార వర్గాల ద్వారా వెల్లడయిన సమాచారం ప్రకారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా గణనీయంగా పెరగింది.

రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో (జిఎస్‌విఎ) వ్యవసాయం వాటా 6.7 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. అంటే, రూ. 1,00,004 కోట్లుగా ఉన్న వ్యవసాయం వాటా. 1,06,708కు చేరిందని తెలుస్తోంది.

రాష్ట్రంలో అన్ని పంటల సాగు విస్తీర్ణం, దిగుబడిని చూస్తే 2023-24 సీజనులో 209.62 లక్షల ఎకరాలు కాగా, తద్వారా 296.17 లక్షల టన్నుల మేర దిగుబడి వచ్చింది. అదే 2024-25 సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా 220.77 లక్షల ఎకరాల చొప్పున సాగు చేయగా, 320.62 లక్షల టన్నుల ఉత్పత్తి అయ్యింది.

అదే వరి సాగు విషయానికి వస్తే 2023-24 వ్యవసాయ సీజనులో తెలంగాణ మొత్తంగా 118.11 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా తద్వారా, 260.88 లక్షల టన్నుల వరి ధాన్యం దిగుబడి అయింది.

అదే 2024-25 సంవత్సరంలో సాగు సీజనుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 127.03 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, 284.16 లక్షల టన్నుల మేర దిగుబడి సాధించింది. కాగా, పత్తి సాగు విస్తీర్ణం ఇంచుమించుగా రెండేండ్లు ఒకే తీరుగా ఉన్నా, గతేడాదితో పోలిస్తే 26.35 లక్షల టన్నుల నుంచి ఈ ఏడాది 3.89 లక్షల టన్నులు పెరిగి 30.24 లక్షల టన్నులకు చేరింది. కాగా, ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రెండేళ్లు వ్యవసాయంపై దృష్టి సారించింది. అందులో భాగంగా రుణమాఫీ కోసం రూ. 20,616 కోట్లు, విద్యుత్ సబ్సిసిడీల కింద రూ. 10,444 కోట్లతో పాటు రూ.54,280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసింది. ఫలితంగా దేశంలోనే వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ మొదటి స్థానాన్ని సాధించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

### పోక్సో కేసు:

## నిందితునికి 20 యేళ్లు జైలు

### రూ. 3,500 జరిమానా

**విజయనగరం, డిసెంబరు 11 ప్రభాతవార్త:** పోక్సో కేసులో నిందితుడు మైనపు హారీష్(19)కు 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి తీర్పునిచ్చారు. అలాగే నిందితుడికి రూ.3,500 జరిమానాకూడా విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ ఈ మేరకు గురువారం తీరు వెల్లడించారని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. పూసపాటిరేగ మండలం పెదపతివాడ గ్రామంకు చెందిన మైనపు హారీష్ (19 సం.లు) తేదీ 04-07-2023నఅదే గ్రామానికి చెందిన ఒక మైనరు బాలిక (8) ను స్కూలుకు వెళుతున్న సమయంలో కిడ్నాప్ చేసి దగ్గరలో ఉన్న కొబ్బరి తోటలోకి ఎత్తుకుపోయి అత్యాచారం చేసాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పూసపాటిరేగ పోలీసు స్టేషనులో 5-7-2023న పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసారన్నారు. అనంతరం, అప్పటి విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. నిందితుడు మైనపు హారీష్ (19 సం.లు)పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 3,500/లు జరిమాన విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఖజానారావు వాదనలు వినిపించారన్నారు.

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

# ప్రజల విశ్వాసానికి నిదర్శనం

**హైదరాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త:** పంచాయతీ ఎన్నికల-2025 తొలి విడతలో కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘనవిజయం సాధించడంపై టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలవడం,కాంగ్రెస్ ప్రభుత్వ విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు ఉన్నాయని, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు మహేష్ గౌడ్ తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమని వివరించారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం-అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేష్ ఆనందం వ్యక్తంచేశారు రేవంత్ రెడ్డి, మంత్రులు గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి నినాదానికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం ఆయన వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందని అన్నారు.గ్రామీణ ప్రజలు అభివృద్ధి-సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవడం, నూతన తెలంగాణ రాజకీయ సంస్కృతికి సంకేతమని టిపిసిసి చీఫ్ అభిప్రాయపడ్డారు. ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని అన్నారు.

గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మహేష్ గౌడ్ హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తొలి విడత ఫలితాలు, ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకమని ఆయన ధృవీకరించారు.

# అమరావతిలో కాగ్ కార్యాలయ నిర్మాణానికి అనుమతి

## - రూ.60 కోట్లతో తపాలా శాఖ ప్రాంతీయ కార్యాలయం: కేంద్రమంత్రి పెమ్మసాని

**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాత వార్తప్రతినిధి:** అమరావతిలో కేటాయించిన 2.05 ఎకరాల స్థలంలో కాగ్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి పరిపాలన అనుమతులు లభించాయి. ఈ విషయాన్ని డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కేఎస్ సుబ్రహ్మణియన్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనిపట్ల మంత్రి పెమ్మసాని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతిలో రూ.80 కోట్లతో అత్యాధునిక రీతిలో తపాలాశాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్మించనున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆయన లోక్‌సభలో కొత్త పోస్టాఫీసుల నిర్మాణంపై అనంతపురం సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఈ విషయం చెప్పారు. 2021 నుంచి 2024-25 మధ్యకాలంలో రాష్ట్రంలో ఐదు కొత్త పోస్టాఫీసులు నిర్మించినట్లు తెలిపారు. ఇకకేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌తో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఇక్కడ సమావేశమయ్యారు. గుంటూరు జిల్లా నడింపాలెంలో ప్రతిపాదించిన 100 పడకల ఆస్పత్రి,సెంట్రల్ యోగా,నేచురోపతి ఇనిస్టిట్యూట్‌ను త్వరగా పూర్తి చేసే విషయంపై చర్చించారు.కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ విధానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్‌కు 587 పాఠశాలలు మంజూరు చేయగా,ప్రస్తుతం 499 మాత్రమే పనిచేస్తున్నాయని, కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్‌చౌదరి తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఆక్వా పార్క్ నిర్మాణ పనులను ఏడాది లోపు పూర్తి చేయాలన్న షరతుతో రాష్ట్ర ప్రభుత్వం 2025 ఆగస్టు 5న ఎల్ 1 బిడ్డర్‌కు అప్పగించిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ తెలిపారు. రాజ్యసభలో టిడిపి సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. 2025 మార్చి 30 కల్లా పూర్తి చేయాలన్న షరతుతో కేంద్ర ప్రభుత్వం 2022-23 లో రూ.52.85 కోట్లతో ఈ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే భూసేకరణలో సమస్యలున్నట్లు తొలుత రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని వెల్లడించారు.

చివరకు 2024 ఆగస్టులో భూమి కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రప్రభుత్వం తన వాటాను సకాలంలో చెల్లించకపోవడం కూడా జాప్యానికి ఒక కారణమని వివరించారు. వీటన్నింటినీ అధిగమించి ప్రాజెక్టు నిర్మాణ భాధ్యతలను కాంట్రాక్టర్‌కు అప్పగించి 2026 ఆగస్టు 5కు పూర్తిచేయాలని షరతు పెట్టినట్లు వెల్లడించారు.

## గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్ట్

**మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 11 ప్రభాతవార్త.** కురబలకోట మండలంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, తెలిపారు. మదనపల్లి డిఎస్పి ఆఫీసులో గురువారం సాయంత్రం అరెస్ట్ చూపించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ముదివేడు ఎస్ఐ మధురామ చంద్రుడు మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, అంగళ్ల కేంద్రంగా గంజాయి విక్రయిస్తుండగా వెళ్లి సర్కారు తోపు వద్ద ఏడుగురిని పట్టుకుని వారి వద్ద 6కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడ్డవారిపై ఎన్ డిపిఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. అరెస్ట్ అయిన వారి వద్ద ఏడు మొబైల్ ఫోన్లు, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఈ కేసు లో ఇంకా ఇద్దరు తప్పించు కున్నారని తెలిపారు. అరెస్టయిన వారిలో కరమల ఆవేశ్ అలియాస్ పండు (22), కూరగాయల సురేష్ బాబు అలియాస్ సూరి(30), చల్లా తేజ్ కుమార్ (20), కోటకొండ చిట్టి సాయి(22), సాకే చంద్రశేఖర్ అలియాస్ ఆటో చంద్ర(55), భూమి శెట్టి భార్గవ్ కుమార్ (30), కూని వెంకటరమణ(60) లు ఉన్నారు..

# ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా క్వాంటం

## విదేశీ పారిశ్రాక వేత్తలతో సిఎం చంద్రబాబు




**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షి ంచారు. విద్య, వైద్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ రంగాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పనిచేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో గురువారం వివిధ దేశాల నుంచి బృందంగా వచ్చిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల బృందంతో సీఎం సమావేశం అయ్యారు. వైద్యరంగంలో నూతన ఔషధాల రూపకల్పనతో పాటు మెటీరియల్ సైన్స్ పై పరిశోధనలకు గానూ గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని పరిశోధకులు, విద్యావేత్తల బృందం ముఖ్యమంత్రికి తెలిపింది. దేశంలోనే తొలి క్వాంటం బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా ఏర్పాటు అవుతున్నట్టు వివరించింది. గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ బృందం సభ్యులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి.. వైద్యారోగ్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ అంశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉందని అన్నారు. క్వాంటం పరిశోధనలతో బయోసెన్సార్ల లాంటి అప్లికేషన్లను కూడా ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తేవాల్సి ఉందని అన్నారు. అమరావతిలో త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సీఎం వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ఈ క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాయని వారికి వివరించారు. ఇప్పుడు క్వాంటం గురించి అంతా ఆలోచిస్తున్న సమయంలో ఆ రంగంలో పనిచేయడానికి ఔత్సాహిక కంపెనీలు ఏపీని సంప్రదిస్తున్నాయని అన్నారు.

# రాష్ట్రంలో రూ.16 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధిస్తాం

## - ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్

**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రభుత్వ శాఖలను మూడు విభాగాలుగా చేసి జీఎస్‌డీపీతో మ్యాపింగ్ చేశాం ఏపీ తప్ప ఏ రాష్ట్రమూ ప్రతి త్రైమాసికానికి ఇలా వృద్ధి గణాంకాలు విడుదల చేయడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో ఏడాది ఒకటి రెండు సార్లు విడుదల చేసినా ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదు. స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధించేందుకు ఈ నివేదికలు ఎంతో ఉపయోగపడతాయి' అని రాష్ట్ర ప్రణాళిక,ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.16.88 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తిని సాధించాలనేది లక్ష్యమని తెలిపారు. తొలి 6 నెలల్లో 41%సాధించామని, మిగిలిన లక్ష్య సాధనకు రంగాల వారీగా నిర్దిష్ట వ్యూహాలు అవలంభిస్తామని చెప్పారు. రాష్ట్ర వృద్ధి రేటు ఎంతో బాగున్నా ద్రవోల్బణం వల్ల ఆ వృద్ధి మొత్తం ప్రతిఫలించడం లేదు. జాతీయ స్థాయితో పోలిస్తే 2.6% అధికంగా ఉంది.జిల్లా స్థాయిలో పరిశ్రమల శాఖలో కొత్త పారావీ ఎటర్లను ఏర్పాటు చేస్తున్నాం. వ్యవసాయంలో కూడా వినియోగం ఆధారంగా ఉత్పత్తి ఉండేలా చూస్తున్నాం. ఆర్‌టీజీఎస్‌తోనూ అనుసంధానం చేస్తున్నాం.పరిశ్రమల రంగంలో దేశం కన్నా మంచి పురోగతి సాధించాం. మధ్య చిన్న తరహా పరిశ్రమలకు కూడా ప్రోత్సాహకాలు అందించాం. అంతర్జాతీయ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి ఉండేలా చూస్తున్నాం.గనుల విభాగాన్ని కూడా బలోపేతం చేశాం. ఆర్‌టీజీఎస్‌లో ప్రత్యేకంగా 'డిజీ వెరిఫై' అనే ఏర్పాటు చేశాం. ఏ ధృవప త్రాలైనా ఇక ఈ విభాగంలో సులభంగా,వేగంగా తనిఖీ చేయవచ్చు. అవి అసలైనవో కావో తెలుసు కోవచ్చు. ఇందుకోసం ఆర్‌టీజీఎస్ ప్రత్యేక సదుపాయం కల్పిస్తోంది.' అని ఐటీ ఆర్‌టీజీ శాఖల కార్యదర్శి కాటమనేని భాస్కర్ చెప్పారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసమే లబ్ధిదారులు సమర్పించే ధృవపత్రాలను విద్యార్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేయాలన్నా,ఈ సదుపాయాన్ని ఉపయోగించు కుంటే ఎంతో వేగటంగా పరిశీలన పూర్తవ ుతుందన్నారు. ఏపీపీఎస్సీ వంటి సంస్థలకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో ధృవీకరణ పత్రాల తనిఖీకి చాలా సమయం పడుతోందని, ఇక ఆ అవసరం ఉం డదని డిజి వెరిఫై ద్వారా సులభంగా ఈ ప్రక్రి య పూర్తి చేయాలన్నారు. సదు పాయా న్నివిస్తృతంగా వినియోగించుకోవాలన్నారు.

## రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి సిఆర్డీఏ కీలక నిర్ణయం


**విజయవాడ,డిసెంబరు 11,పభాతవార్త ప్రతినిధి:** రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి ఏపీ సీఆర్డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇకపై రోజూ రైతుల నుండి అర్జీలు స్వీకరించనున్నారు. పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు సీఆర్డీఏ కమీషనర్ కన్నబాబు వివరాలు వెల్లడించారు.

## మెడికల్ కాలేజీల పిపిపి విధానంపై వైఎస్సార్సీ పోరాటం - మాజీ సిఎం జగన్

**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరి స్తున్నారని ఆరోపిస్తూ వైసీపీ చేపట్టిన ఉద్యమం తుది దశకు చేరుకుంది. ఈ ఆందోళనలో భాగంగా సేకరించిన కోటి సంతకాల పత్రాలను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించేందుకు ఆ పార్టీ అధినేత జగన్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఈ నెల 18వ తేదీన ఆయన గవర్నర్‌తో భేటీ కానున్నారు. ముందుగా డిసెంబర్ 17న కలవాలని నిర్ణయించినప్పటికీ, షెడ్యూల్‌లో స్వల్ప మార్పుల కారణంగా ఈ భేటీ 18వ తేదీకి వాయిదా పడింది. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, ఇది ప్రైవేటీకరణేనంటూ వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించి "కోటి సంతకాల సేకరణ" కార్యక్రమాన్ని చేపట్టింది. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను జగన్ కలుస్తారు.

# టిటిడి డైరీలు,క్యాలండర్‌లకు అనూహ్యస్పందన

## - ఆన్‌లైన్‌లోనూ బుకింగ్ సదుపాయం



**తిరుమల, డిసెం బర్11 ప్రభాత వార్తప్రతి నిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలకు దేశ విదేశాలలోని శ్రీవారి భక్తులనుండి అనూహ్యస్పందన వస్తోంది. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం 2026వ సంవత్సరం 12పేజీల క్యాలండర్లు 13లక్షలు, ఆరుపేజీల క్యాలండర్లు 75వేలు, పెద్దడైరీలు 3.50లక్షలు, చిన్నడైరీలు 3లక్షలు, టేబుల్‌టాప్ క్యాలండర్లు 1.50లక్షలు, శ్రీవారి పెద్దక్యాలండర్లు 2.50లక్షలు, పద్మావతిఅమ్మవారి పెద్ద క్యాలండర్లు 10వేలు, శ్రీవారుపద్మావతిఅమ్మవారు క్యాలండర్లు 3లక్షలు, టిటిడి స్థానిక ఆలయాల క్యాలండర్లు 10వేలు అత్యంత ఆకర్షణీయంగా ముద్రించి అందుబాటులో ఉంచింది. తిరుమల,తిరుపతిలోని టిటిడి పుస్తకవిక్రయకేంద్రాలతోబాటు దేశంలోని పలు టిటిడి ముఖ్యప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయన్నారు. భక్తులు ఆన్‌లైన్‌లో కూడా బుక్‌చేసుకునేందుకు వీలుగా "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తిరుమల.ఓఆర్‌జి, టిటిడిదేవస్థానమ్స్.ఎపి.జివోవి.ఇన్‌లో బుక్‌చేసుకున్న భక్తులకు తపాల శాఖద్వారా పంపబడుతుందన్నారు. టిటిడి ఇఒ పేరున డిడి తీసి కవరింగ్ లెటర్‌తో పంపినా భక్తులకు టిటిడి క్యాలండర్లు, డైరీలు తపాలశాఖద్వారా పంపబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 0877-2264209 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

## ఉద్యోగులకు, పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం మరో తీపికబురు

### - ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యలపై అఫీషియల్ కమిటీ

**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉద్యోగులకు, పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం మరో తీపికబురు చెప్పింది. ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల సమస్యలపై మరో ముందడుగు వేసింది. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన ఓ హామీని ప్రభుత్వం ఇవాళ నిలబెట్టుకుంది. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చల సందర్భంగా వారు ఉద్యోగుల ఆరోగ్య పథకంతో పాటు హెల్త్ కార్డుల విషయంలో ఎదురవుతున్న సమస్యల్ని సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేసి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇవాళ ఉద్యోగుల హెల్త్ కార్డులపై ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో ఇచ్చిన హామీ మేరకు అఫీషియల్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ కమిటీలో సీఎస్ తో పాటు సాధారణ పరిపాలన శాఖకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ప్రధాన కార్యదర్శి లేదా కార్యదర్శుల్లో ఒకరు, హెచ్ ఆర్ వ్యవహారాలు చూస్తున్న ఆర్థిక శాఖ కార్యదర్శి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, ఏపీ ఎన్జీవోల అధ్యక్షుడు విద్యాసాగర్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో సభ్యులుగా ఉంటారు. అక్టోబర్ 18వ తేదీన సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల భేటీ సందర్భంగా హెల్త్ కార్డుల సమస్యలపై కమిటీ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ ఇవాళ ఏడుగురు సభ్యులతో దీన్ని ప్రకటించారు. సీఎస్ విజయానంద్ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీ ఎనిమిది వారాల్లోగా హెల్త్ కార్డుల సమస్యల్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈవో వీటిపై తదుపరి చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం జీవోలో పేర్కొంది.



## సిఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామం - ప్రధాని నరేంద్రమోడీ

**విజయవాడ,డిసెంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల బీజేపీ ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు మాట్లా డారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తున్నాయని, ఇది చాలా మంచి అభివృద్ధి అని మోదీ కితాబిచ్చారు. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్, ఆ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు బీజేపీ కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని మోదీ దిశానిర్దేశం చేశారు. ఈ అల్పాహార విందులో ఎంపీ పురందేశ్వరి, సీఎం. రమేష్, భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఇక తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్య ఏంటని, రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించు కోవడంలో విఫలమవుతున్నారని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని మోదీ సూచించారు.

## ఫైబర్‌నెట్ కేసులో గౌతమ్ రెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్‌ను తిరస్కరించిన ఎసిబి కోర్టు

**విజయవాడ,నవంబరు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఫైబర్‌నెట్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భాగంగా దాఖలైన ఆ నెట్ మాజీ చైర్మన్ గౌతమ్ రెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఈ కేసుపై తాజాగా విచారణ జరిపింది ఏసీబీ న్యాయస్థానం. ఇప్పటికే ఫైబర్ నెట్ కేసును సీఐడీ క్లోజ్ చేసిందని పేర్కొంటూ.. ప్రొటెస్ట్ పిటిషన్‌ను రిజెక్ట్ చేసింది.



## సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటనపై పోలీసుల పరిశీలన

**తిరుపతి,డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యా లయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించనున్నారనే సమాచారంతో తిరుపతి జిల్లా పోలీసులు హైరానా పడుతున్నారు. సంస్కృత విద్యాపీఠం ప్రాంగణంలో జరిగే కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను గురువారం రాత్రి తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపుఎస్పీ రవిమనోహరచారి, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ ,డిఎస్పీలు, సిఐలతో కలసి పరిశీలించారు. అధికారికంగా సిఎం పర్యటన ఖరారుకానప్పటికీ ముందస్తుగా ఉన్న సమాచారంతో పోలీస్ అధికారులు సంస్కృత విద్యాపీఠం ప్రతినిధులతో కలసి సమావేశమయ్యారు.కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న భద్రత మార్గదర్శకాలు, సిబ్బంది నియామకం వంటి కీలక అంశాలను క్షేత్రస్థాయిలో వివరంగా పరిశీలించారు. విఐపి ప్రవేశాలు, వేదిక పరిసరాలు, పార్కింగ్ ప్రాంతం పాయింట్లు పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ చేయాలని ఎస్పీ ఆదేశించారు.

## మంత్రాలయంలోనూ యాత్రికులకు తిరుమల తరహా విధానాలు

### - ఐసిసిసిని సందర్శించిన పీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి

**తిరుమల,డిసెంబర్ 11 ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలుజిల్లా మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలోనూ యాత్రికులకు తిరుమలలో అవలంభిస్తున్న సాంకేతిక విధానాలు ,వసతి, అన్నదానం సదుపాయాలను అమలు చేయ నున్నట్లు రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి తెలిపారు. భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లుచేసేందుకు చూస్తామ న్నారు. తిరుమలలో సుబుదేంద్ర తీర్థస్వామి వైకుంఠమ్ 1లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి సందర్శిం చారు. భక్తులకు మంచి చేసేవిధంగా సాంకేతి కతను ఉపయోగించుకొంటుండటం.

# తిరుపతి సమాచారం

## భక్తుల భద్రతపై డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ

### - వైకుంఠ ఏకాదశి, ద్వాదశిన పూర్తిస్థాయిలో పోలీసుల సేవలు



**తిరుమల,డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనానికి ఆన్‌లైన్‌లో జారీచేసిన టోకెన్లతో తిరుమలకు వచ్చే భక్తుల భద్రత,ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్‌కెమెరాలతో నిఘా ఉంచుతున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. వైకుంఠ ఏకాదశిన ప్రముఖులతోబాటు భక్తులు కూడా తిరుమలకు రానున్నందున భద్రతా ఏర్పాట్లు, క్యూలైన్ల నియంత్రణ వంటి అంశాలపై గురువారం సాయంత్రం టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, అదనపు ఎస్పీ రవిమనోహరచారి, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, ఎస్‌బి సిఐ మద్దయ్యాచారి, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్,విఎస్ఒ సురేంద్రతో కలసి అలిపిరి టోల్‌గేట్, అలిపిరి పాదాలు, శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు తదితర ప్రాంతాలు ,క్యూలైన్ ఎంట్రీ పాయింట్లు, పార్కింగ్,భక్తులు చేరుకునే ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ప్రత్యేకంగా అదనపు సిబ్బందిని నియమించి బందోబస్తు నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. టిటిడి, పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ బృందాలు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ,అన్ని విభాగాలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లుచేయాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

## వైకుంఠ ఏకాదశికి 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి చేపట్టే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం 23వతేదీ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమం చేపట్టడం సంప్రదాయం. ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేస్తారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రంగా కడుగుతారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు. 23న ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో వైకుంఠ ఏకాదశి,ఉగాది ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ.

## తిరుమల మాడవీధులకు ఆధ్యాత్మిక నామాలు

### - భక్తాగ్రేసరుల పేర్లు పెట్టేందుకు టిటిడి నిర్ణయం



**తిరుమల,డిసెంబర్ 11ప్రభాత వార్తప్రతి నిధి:** ఏడుకొండల స్వామి కొలువైన ఆలయం చుట్టూ ఉన్న మాఢవీధుల ప్రాశస్త్యంతో ఆధ్యా త్మిక నామాలు పెట్టేలా టిటిడి బోర్డు నిర్ణయించింది. ఇందుకు సంబం ధించి నాలుగు మాఢ వీధులకు నలుగురు భక్తాగ్రేసరుల పేర్లు సూచించన ున్నారు. ఈనెల 16వతేదీ జరిగే టిటిడి బోర్డు సమావేశంలో ఈ విషయంపై చర్చించి ఆమోదించనున్నారు. ఇప్పటికే తిరుమలలో అతిధిగృహాలు, విశ్రాంతి భవనాలకు పూర్తిగా భక్తిభావం కలిగేలా పేర్లు వెలిశాయి. ఈ పేర్లు అన్నీ కూడా భక్తుల్లో మరింత భక్తిభావాన్ని చాటేలా చూస్తున్నారు. నాలుగుమాఢవీధుల్లో ఒక వీధికి వెంగమాంబపేరు, మరోవీధికి అన్నమయ్యవీధిగా,మరోవీధికి అనంతాళ్వారు, చివరగా రామానుజుల పేర్లుతో ఇలా నామకరణం చేయాలని భావిస్తున్నారు. మరీ 16వతేదీ ఈ విష యంపై స్పష్టత రానుంది. ఆలయానికి చుట్టూ అర్చకులు నివసించే ఇళ్ళున్న వీధులను పవిత్రంగా భావించి తమిళంలో "మాడాం"అని పిలిచారు. ఒకప్పుడు తిరుమల ఆలయం చుట్టూ స్వామివారు వాహనంలో ఊరేగడానికి సరియైన వీధులు లేవు. శ్రీరామానుజులు దేవాలయం చుట్టూ వీధులను ఏర్పాటు చేయించి స్వామివారు వీధుల్లో ఊరేగేందుకు చూశారనేది పురాణాల కథనం.ఆలయం చుట్టూ నాలుగుమాఢవీధులు నాలుగు వేదాలకు ప్రతీకలు.మాఢవీధుల్లో భక్తులు,టిటిడి అధికారులు ,సిబ్బంది ఒక్కరేమిటీ అందరూ పూర్తిగా పాదరక్షలు లేకుండా కనిపిస్తారు.ఆలయానికి తూర్పుముఖంగా ఉన్నదే తూర్పుమాఢవీధి. ఇదే సన్నిధివీధి. దక్షిణమాఢవీధిలోనే తిరుమలనంబి గుడిఉంది. దీనిపక్కనే వైకుంఠం క్యూకాంప్లెక్స్‌నుండి గుడికి చేరే వంతెన క్రిందే ఒకప్పుడు గుర్రాలపాక ఉండేదట. ఇక ఆలయానికి వెనుకవైపు ఉన్నదే పడమరమాఢవీధి. ఒకప్పుడు ఎన్నో మఠాలు,సత్రాలు ఉండేవి. ఉత్తరమాఢవీధిలో ఉత్తరాధిమఠం, తిరుమలనంబి తోళప్పు కైంకర్య నిలయం, అమోబిలమఠం శ్రీవైఖానస అర్చక నిలయం ఉన్నాయి. తాళ్ళపాక వారి ఇల్లుఉండేది.

## స్వచ్ఛతిరుమలలో అందరి భాగస్వామ్యం

### - మరిన్ని ప్రాంతాల్లో రెక్లైమ్ రీసైక్లింగ్ యంత్రాలు



**తిరుమల,డిసెంబర్11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను మరింత స్వచ్ఛతకు ప్రతీకగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. స్వచ్ఛతిరుమలలో భాగంగా ఒక ఉద్యమంలా రెక్లైమ్ రీసైకిల్ యంత్రాల వినియోగంపై భక్తులకు విస్తృతంగా అవగాహన కల్పించి తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాల్లో మరిన్ని యంత్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న యాత్రికులు శీతలపానీయాలు తాగిన టెట్రాప్యాక్‌లు, టిన్‌లను భక్తులు ఎక్కడబడితే అక్కడ పడేయకుండా ఈ డిపాజిట్ రీఫండ్ యంత్రాలలో వేస్తే తిరుమల పరిశుభ్రత మరింత మెరుగుపడేందుకు దోహదపడుతుందని అన్నారు. గురువారం సాయంత్రం తిరుమలలోని పద్మావతి అతిధిగృహంలో టిటిడి డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, డిప్యూటీ ఇఒలు సోమన్నారాయణ, వెంకటేశ్వర్లు, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్,డిప్యూటీ ఇఇ శ్రీనివాస్,రీక్లైమ్ రీసైకిల్ సంస్థ ప్రతినిధులు కిరణ్, రవి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి సమీక్షించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మరిన్ని రీసైకిల్ యంత్రాలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నాలుగునెలల క్రిందట యాత్రికుల వసతి సముదాయం(వేంకటాద్రినిలయం)పిఎసి 5లో ఏర్పాటుచేసిన రెక్లెయిమ్ డిపాజిట్ రీఫండ్ యంత్రాలకు విశేష స్పందన.

## అభద్రతకు కారణమైన వ్యక్తి నగర బహిష్కరణ

### - రౌడీషీట్ నమోదుచేసిన పోలీసులు

**తిరుమల,డిసెంబర్ 11ప్రభాతవార్తప్రతినిధి:** బ్రతుకుతెరువు కోసం తెలంగాణనుండి కొన్నేళ్ళ క్రిందట తిరుమలకు వచ్చిన ఓ వ్యక్తి తనకుతాను బ్లేడ్‌తో చేయికోసుకుని తీవ్రస్థాయిలో రభస చేశాడు. భక్తులు సంచరించే ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ఆభద్రతతోవ్యవహరించడంతో తిరుమల పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు. అతనిని తిరుపతినుండి నగరబహిష్కరణ చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు వెల్లడించారు. తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతకు, ప్రశాంతతకు నిదర్శనం, అలాంటిది గురువారం సాయంత్రం గోగుల శ్రీనివాస్(20)డిఎంబి రోడ్డులో తనకు తానుగా చేయికోసుకుని నానా రచ్చచేశాడు. తిరుమలలో భక్తుల పవిత్రతకు భంగం కలిగించేలా వ్యవహరించాడు. దీనిపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. అతనిని చికిత్సకు అశ్వినీకి తరలించారు. రౌడీషీట్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# స్త్రీల కేన్సర్ చికిత్స కోసం



దశాబ్దాలుగా వేలమంది మహిళలకు చికిత్సనందించారు ఒడిశాకు చెందిన డా. లక్ష్మీ మ్రబాయి. తన జీవిత కాలమంతా నిరుపేద రోగుల సంరక్షణకోసమే పనిచేశారామె. పదవీ విరమణ తర్వాత ఆమె ఆలోచనలన్నీ వారికోసమే. తాజాగా తన 100వ పుట్టినరోజు సందర్భంగా ఈ వృద్ధ డాక్టరమ్మ మహిళల క్యాన్సర్ చికిత్స కోసం రూ.3.40 కోట్లను ఎయిమ్స్ భువనేశ్వర్‌కు విరాళం ప్రకటించారు. తన జీవిత కాలంలో సంపాదించిన ఈ సమాజానికి తిరిగి ఇవ్వడం తనకు సంతృప్తి ఉంటుందంటారామె. ఒడిశా తొలి మహిళా గైనకాలజిస్టుల్లో ఈమె ఒకరు. లక్ష్మీ మ్రబాయిది బ్రహ్మపుర. మద్రాస్ మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేశారు. ఆపై సుందర్గఢ్ జిల్లా ఆసుపత్రిలో వైద్యవృత్తిని ఆరంభించారు. 1986లో ఎంకేసీజీ మెడికల్ కాలేజీ నుంచి పదవీ విరమణ చేసే వరకు వేల మంది మహిళలకు, ముఖ్యంగా పేదలకు ఉచిత చికిత్స అందించిన దేశంలోనే తొలి మహిళా వైద్యురాలిగా యూకేలో ల్యాప్రోస్కోపీ శిక్షణ తీసుకున్న ఆమె... కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో కృషికి అప్పటి ప్రధాని పండిట్ జవహర్ నెహ్రూ చేతుల మీదుగా సత్కారమూ అందుకున్నారు. ఆ తర్వాత ఆమె చేసిన వందలాది ల్యాప్రోస్కోపీ శస్త్రచికిత్సలు ఆ కాలంలోనే వైద్యరంగంలో విప్లవాత్మక మార్పుగా నిలిచాయి. ఇప్పటికే లక్ష్మీ మ్ర భారత్ జ్యోతి, బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా వంటి అనేక జాతీయ అవార్డులు అందుకున్నారు. వీటన్నింటిలోనూ ఈ విరాళమే... తనకు తాను ఇచ్చుకున్న అతి పెద్ద బహుమతి అంటారామె. సంపాదనకోసం పరుగులు పెట్టే ఈ తరానికి ఈ డాక్టరమ్మ ఇస్తోన్న స్ఫూర్తి ఆదర్శనీయం.

# ముఖం కడుక్కునేటప్పుడు..

చలి కాలంలో అందాన్ని సంరక్షించుకోవడమంటే సవాలే! ఎన్ని జాగ్రత్తలు ఆహార నియమాలు పాటించినా.. చర్మం పొడిబారి పోవడంతో పాటు ఇతర చర్మ సమస్యలు తలెత్తుతుంటాయి. అయితే వీటన్నిటికీ మనకు తెలియకుండా ఉండడం కారణం అంటు న్నారు సౌందర్య నిపుణులు. ముఖ్యంగా ముఖాన్ని శుభ్రంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు.



**'నురగ'కు బదులు అవి!** ముఖాన్ని, శరీరాన్ని శుభ్రం చేయడానికి ప్రస్తుతం వివిధ రకాల ఫేస్‌వాష్ అందుబాటులో ఉన్నాయి. ఫోమ్ (నురగ) ఆధారిత వాష్లు లభిస్తున్నాయి చలికాలంలో ఉపయోగించడం వల్ల చర్మం మరింత పొడిబారిపోతుందని అందుకే ఫోమికి బదులు జెంటిల్, క్రీమ్ తరహా క్లెన్సర్లు.. ఏర్పాటు ఉపయో మృదువుగా ఉంచుకో అని చెబుతున్నారు.



**'డబుల్ క్లెన్సింగ్' వద్దే వద్దు!** కాల మేదైనా చాలామందికి పదే పదే ముఖం కడుక్కోవడం అలవాటు. ఈ అవసరంనే 'డబుల్ క్లెన్సింగ్' పద్ధతిని పాటిస్తారు. అంటే. రెండు సార్లు ముఖం శుభ్రం చేసుకోవ డమన్న మాట! ఇందులో భాగంగా మొదట చర్మంపై ఉన్న జిడ్డును తొలగించుకోవడానికి ఆయిల్ ఆధారిత క్లెన్సర్తో ముఖం కడుక్కోవడం, ఆపై నీటి ఆధారిత క్లెన్సర్‌తో ముఖం కడుక్కోవడం, ఆపై నీటి ఆధారిత క్లెన్సర్‌తో చర్మంపై ఉండే చెమట, ఇతర మలినాల్ని తొలగించడం. నిజానికి దీనివల్ల చర్మం మరింతగా పొడిబారిపోతుం దంటున్నారు నిపుణులు. అయితే తమ చర్మతత్వాన్ని బట్టి సరైన ఫేస్‌వాష్‌ని ఎంచుకొని.. నిపుణుల సలహా మేరకు నిర్ణీత వ్యవధుల్లో ముఖాన్ని శుభ్రం చేసుకోవడం అన్ని విధాలా ఉత్తమం అని సూచిస్తున్నారు.

**'అతి' అనర్థమే!** ముఖంపై పేరుకున్న మృతకణాల్ని తొలగించుకునే 'ఎక్స్‌ఫోలియేషన్' ప్రక్రియను పాటించడం మనకు తెలిసిందే! అయితే ముఖం మరింత మృదువుగా మారాలన్న పద్ధతిని ఎక్కువసార్లు పాటించినా చర్మ ఆరోగ్యం దెబ్బ తింటుందంటున్నారు నిపుణులు ముఖ్యంగా చలికాలంలో ఈ ప్రక్రియ మితిమీరితే మృతకణాలు తొలగిపోవడం మాటేమో గాన చర్మం మరింతగా పొడిబారిపోతుందట.

# పిల్లలతో బాధ పంచుకోండి !



సమయానికి పని పూర్తికాకపోవడం, అనుకున్న ఫలితాలు దక్కక పోవడం, ఇంట్లో అందరూ మహిళల రోజువారీ జీవితంలో భాగమే. వీటన్నింటి ఫలితమే ఒత్తిడి, ఆమె వీటితో సతమతం అవుతూ... మరుసటి రోజున ఉత్తేజంగా ఎలా ప్రారంభించగలిగితే ఎప్పటికైనా ఒత్తిడిని దూరం చేసుకోవాలని నిపుణులు. ఒత్తిడీ, యాంగ్జయిటీని నియంత్రించే కోపింగ్ టెక్నిక్స్‌లో ఇదీ దీనిద్వారా 30-40 శాతం ఉపశమనం పొందొచ్చట. అమ్ములూ ఈరోజు ఏమైందో తెలుసా? అమ్మని వాళ్ల బాస్ తిట్టారు. అమ్మ సరిగా పనిచేయడం లేదని అంటూ మొదలు పెట్టి రోజంతా జరిగిన విషయాలన్నీ వాళ్లకు కథ, తేలికైన పదాలతో చెప్పి చూడండి. మీ సంభాషణ పూర్తయ్యే లోపు ఒత్తిడి నుంచి బయట పడతారు అంటున్నారు నిపుణులు.


**ఎందుకంటే...** ✦ చాలాసార్లు విషయాలు చిన్నవే అయినా, చెప్పుకోవడానికి ఎవరూ లేరనే ఆలోచనతోనే బాధ పెరిగిపోతూ ఉంటుంది. దీన్ని దూరం చేసుకోవాలంటే పిల్లలకు చెప్పడమే సరైన పద్ధతట. మెదడులో గుమిగూడే భావాలు బయటికి వస్తే ఒత్తిడి ఆటోమేటిక్‌గా తగ్గుతుంది. ✦. పైగా మనసులో మాట ఎవరికైనా చెబుదామంటే.. జడ్జ్ చేస్తారని ఆగిపోయే సందర్భాలు చాలానే. పిల్లలైతే అలా చేయరు సరికదా, మనం బాధపడుతున్న వాళ్లకి అనిపిస్తే.. ఆ చిన్ని చేతులు ఊరుకుంటాయా? ఎన్ని ఓదార్పు మాటలు చెబుతాయో. ఆ వచ్చీ రాని మాటలు, చేష్టలకు మనసు స్థిమిత పడుతుంది.

# తన 'పవర్'తో పతకాల పంట



అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ లో స్వర్ణపతకం సాధించిన తొలి తెలుగు నటి 'ప్రగతి'!పట్టుదలతో సాధించలేనిదేదీ ఉండదని ఉంటే అసాధ్యం కానిది టాలీవుడ్ నటి ప్రగతి మహావాది నిరూపించారు. క్యారెక్టర్ యాక్ట్రెస్‌గా గుర్తింపు పొందిన ప్రగతి సరదాగా జిమ్ ప్రారంభించి వెయిట్ లిఫ్టింగ్ వైపు అడుగులు వేసి కేవలం రెండేళ్ల సాధనలోనే రాష్ట్ర, జాతీయ స్థాయికి వెళ్లారు. ఇప్పుడు ఏకంగా ఆసియా గేమ్స్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఒక స్వర్ణం, రెండు కాంశ్య పతకాలను గెలుచుకుని భారతీయ జెండా రెపరెపలాడించారు. మొదటి నుంచి ప్రగతి భిన్నమైన మనస్తత్వంతో ప్రత్యేకత చాటుకుంటూనే ఉన్నారు. సినిమాలో తనకిచ్చిన పాత్రలో సహజంగా నటించి మంచి నటి అని పేరు తెచ్చుకున్నారు. తను ఉండే గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతంలో సైతం బుల్లెట్ పై తిరుగుతూ బుల్లెట్ యాక్ట్రెస్ అని గుర్తింపు పొందారు.

**ఫిట్‌నెస్ ఫ్రీక్ ..** నటనతో పాటు ఫిట్‌నెస్‌కూ అధిక ప్రాధాన్యమిస్తుంటారు ప్రగతి. ఈ క్రమంలోనే జిమ్‌లో కసరత్తులు చేస్తూ.. ఆ ఫొటోలు, వీడియోల్ని తరచూ ఇన్‌స్టాలో పంచుకుంటుంటారు. తద్వారా అందరిలో ఫిటినెస్ పట్ల అవగాహన పెంచుతూ వాళ్లలో స్ఫూర్తి నింపుతుంటారు. అయితే అక్కడితో ఆగిపోవలనుకోలేదామె. క్రమంగా పవర్ లిఫ్టింగ్‌పైనా దృష్టి సాధించి ఇందులో పూర్తి నైపుణ్యాలు నేర్చుకున్నారు. తొలుత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం కోసం ఈ తరహా ఫిట్‌నెస్ వైపు మళ్లిన ఆమె. 2023 నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. గత రెండేళ్ల నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాల పంట పండిస్తున్నారు. ఇప్పటికే 'హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్స్' తెలంగాణ స్టేట్ కాంపిటిషన్స్'తో పాటు కేరళ, బెంగళూర్లలో జరిగిన 'జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్' పోటీల్లో వరసగా బంగారు పతకాలు కొల్లగొట్టిన ప్రగతి. గతేడాది 'దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్'లో రజత పతకం కైవసం చేసుకున్నారు.



**'పవర్' ఫుల్ ఛాంపియన్ !...** ఇలా తన క్రీడా ప్రతిభను చాటుకుంటూ వరుస పతకాలు నెగ్గడంతో.. ప్రగతికి అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొనే అవకాశం వచ్చింది. ఇటీవలే టర్కీలో జరిగిన 'ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025'లో పోటీ పడ్డారామె. ఇందులో నాలుగు పతకాలు గెలుచుకున్నారు. డెడ్‌లిఫ్ట్ విభాగంలో బంగారు పతకం, బెంచ్ ప్రెస్, స్క్వాట్ విభాగాల్లో రెండు రజతాలు, మొత్తంగా ఈ పోటీల్లో రజతం సొంతం చేసుకున్నారామె. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ.. 'కలలు కనండి. వాటిని సాకారం చేసుకునే దిశగా ప్రయత్నించండి. తప్పకుండా లక్ష్యాన్ని చేరుకుంటారు' అనే క్యాప్షన్ పెట్టారీ పవర్ లిఫ్టర్. ప్రస్తుతం ఈ వీడియో వైరలవుతోంది. చాలామంది సెలబ్రిటీలు, నెటిజన్లు స్పందిస్తూ ప్రగతికి అభినందనలు చెబుతున్నారు. స్ట్రాంగ్ ఉమన్.. ఇన్‌స్పిరేషన్.. అంటూ ఆమెను ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. ఇన్‌స్టాలో చురుగ్గా ఉంటూ తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు తరచూ ఫ్యాన్స్‌తో పంచుకునే ఈ 'పవర్‌ఫుల్ నటిని.. ప్రస్తుతం 5.7 లక్షల మంది ఫాలో అవుతున్నారు.

# కప్ప శబ్దం పాము చేస్తే..

తన ప్రియపుత్రుడైన అభిమన్యుడి మరణంతో కదిలిపోయిన అర్జునుడు కదనరంగం చేస్తుంటాడు. అప్పుడు అర్జునుడిని నిలబెట్టడం ద్రోణుడి వల్ల కూడా కావడం లేదు దుర్యోధ నుడు అసహనంతో ద్రోణుణ్ణి నిందిస్తూ 'నిన్ను సులభంగా దాటుకుని, మిగు కిందా మీదా పడేలా చేస్తూ, ముందుకు సాగుతున్న అర్జునుణ్ణి కన్నెత్తి కూడా చూడా నువ్వు పాండవ పక్షపతివి. వారి సుఖాన్నే కాంక్షి స్తున్నావు. నీ వైఖరి చూస్తుంటే కప్ప గొంతుతో అరిచే పాము అంటారే.. అలా అంతరంగంలో ఒకటి. పైకి ప్రదర్శిం చేది ఒకటిగా ఉంది. యుద్ధం చేస్తాను గానీ అర్జును డికి ఎలాంటి హానీ తలపెట్టనని పాండవులలా ఇచ్చావా? అన్నాడు. ద్రోణాచార్యుణ్ణి అలా నిందించిన దుర్యోధనుడి మాటల్లో 'కప్ప పాము వైఖరి' అనే చక్కటి నానుడిని ఉపయోగించాడు తిక్కన. అంతరంగంలో కోరుకుంటూ వారి శ్రేయస్సును ఆశిస్తున్నట్టుగా ద్వంద్వ వైఖరిని ప్రదర్శి సూచిస్తుంది. ఈ లోకోక్తి ముద్దుపళని రచించిన 'రాధికాసాంత్వనం' లోనూ కనిపిస శబ్దాన్ని కప్పి అనుకుని భరోసాగా అడుగులు వేయగా, తీరా అది పాముని కలిగే విభ్రమం, ఆశాభంగం, భయం, వేదన.. ఈ పోలికలో వ్యక్తమవుతున్నాయి. నేను వినిపించ లేదు కానీ.. కొంత దగ్గర పోలిక ఉన్న 'గోముఖ వ్యాఘ్రం', 'మేక వన్నె పులి' వంటివి ఉన్నాను.

# బజ్జీ బోండా పౌడర్ ఇలా !



అరటికాయ బజ్జీ లాంటివి పిల్లలూ పెద్దలూ అందరికీ నచ్చేస్తాయి. అందుకోసం పి ద్ధంగా ఉందనుకోండి.. పని మరింత సులువవుతుంది. ఈ మిక్స్ కోసం శనగపిండి కప్పు, దెయ్యప్పిండి అర కప్పు, సోంపూ పొడి చెంచా, కశ్మీరీ రెడ్ చిల్లీ పౌడర్ 2 చెంచాలు, పసుపు, డ్రై జెంజర్ పౌడర్, బేకింగ్ సోడా అర చెంచా చొప్పున, ఇంగువ పావు చెంచా, రుచికి తగినంత తీసుకోవాలి. మిక్సింగ్ బౌల్లో శనగ పిండి, బియ్యప్పిండి, కారం, ఉప్పు, సోంపు పొడి, పసుపు, డ్రై జింజర్ టె బేకింగ్ సోడా, ఇంగువ వేసి విస్క్ సాయంతో బాగా కలపాలి. ఈ పొడర్ను తడిలేని సీసాలో వేసుకోవాలి. ఈ కొలతల ప్రకారం ఎక్కువ మోతాదులో కలపవచ్చు. రెండు మూడు వార లువుంటుంది. ఇంకా ఎక్కువ కాలం కావాలనుకుంటే ఫ్రిజ్లో ఉంచాలి. తగినన్ని నీళ్లతో మరీ గట్టిగా, మరీ జారుగా లేకుండా పిండి కలపాలి. ఇక బంగాళదుంప, వామాకు, తమలపాకు, అరటికాయ.. ఇలా వేటితోనైనా బజ్జీలు వేసుకోవచ్చు.

## ముగ్గులకు ఆహ్వానం

**సూచనలు :** ★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు. ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయగలరు. పాతఫొటోలను పంపవద్దు. ★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి. ★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగు లతో కనిపించాలి. ★ మీ ముగ్గులను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.


**మా చిరునామా** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80

**Gmail: cheli@vaartha.com**

**కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు**

# తెర

## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' మెలోడీ సాంగ్ రిలీజ్




మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో అలరించబోతున్నారు. SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ , డింపుల్ హాయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ బెల్లాబెల్లా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ప్రోమోతో టీజ్ చేసిన తర్వాత మేకర్స్ ఈరోజు అద్దం ముందు లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. భీమ్స్ సిసిరోలియ ఓ మధురమైన మెలోడియస్ ట్రాక్‌ను అందించారు. మనసును హత్తుకునే బీట్‌లు, శ్రేయా ఘోషాల్ ఆకట్టుకునే వాయిస్ కలగలిపి పాటను మరింత మ్యాజికల్ మార్చాయి. కపిల్ కపిలన్ వాయిస్ మాధుర్యాన్ని పెంచింది. ప్రేమలో ఉన్న జంటల మనసుల మాటలను చంద్రబోస్ అద్భుతంగా రాశారు. ఒకరి కోసం ఒకరు మాత్రమే ఉన్నట్టు గా వారి ప్రేమలో ప్రతి క్షణాన్ని ఆప్యాయంగా, ఆత్మీయంగా చిత్రించే పాట ఇది. అద్దం ముందు సాంగ్ హస్బెండ్-వైఫ్ తమ ప్రేమను వ్యక్తం చేసుకునే అద్భుతమైన మెలోడీ సాంగ్‌గా అలరిస్తోంది. ఈ సాంగ్‌లో విజువల్స్.. విజువల్ ఫీస్ట్ లా వున్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో, యూరప్ అందమైన లొకేషన్ల మధ్య తెరకెక్కిన ఈ పాటలో రవితేజ-డింపుల్ హాయాతి కెమిస్ట్రీ అదిరిపోయింది. వారి రొమాంటిక్ మోమెంట్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, ప్లేఫుల్ ఇంటరాక్షన్స్ ఇవన్నీ కలిసి పాట కన్నుకపండగలా వుంది.

## 'అన్నగారు వస్తారు' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది



స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ "అన్నగారు వస్తారు" ఈ నెల 12న వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తు న్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమార స్వామి రూపొందిస్తున్నారు. కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు హీరో కార్తి. నేను ఊపిరి లాంటి మూవీస్ ఈజీగా చేయగలను కానీ అన్నగారు వస్తారు ఒక ఛాలెంజింగ్ ఫిల్మ్. అయితే రైటర్స్ కు స్వేచ్ఛ ఇచ్చినప్పుడే కొత్త తరహా సినిమాలు వస్తాయి. హీరో, సాంగ్స్, విలన్, ఫైట్స్.. ఇలాంటి ఒక స్ట్రక్చర్ ఉన్న సినిమాలు మన దగ్గరే ఉన్నాయి. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి సినిమాలను చూడం. ఆ పర్ఫెక్ట్ మాస్ కమర్షియల్ మూవీస్ 80, 90 దశకాల్లోనే వచ్చాయి. సీరియస్‌గా కథ కథల పరంగా కొత్తగా సెలెక్ట్ చేసుకోవాలనే ప్రయత్నం నిత్యం చేస్తుంటాను. నటుడిగా నాకు ప్రత్యేకత తీసుకొచ్చేది నా స్క్రిప్ట్ సెలెక్షనే. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఇద్దరి కెరీర్స్ లో అక్కడి సినిమాలు ఇక్కడ ఇక్కడి సినిమాలు అక్కడ రీమేక్స్ జరిగాయి. మీరు ట్రైలర్‌లో చూసి ఉంటారు. పారలల్ వరల్డ్ లో జరిగే సూపర్ హీరో సినిమా ఇది. పోలీస్ ఆఫీసర్‌గా సఫారీ డ్రెస్ వేసుకుంటాను. ఆ విషయం జడ్జితో చెబుతాను. దర్శకుడు నలన్ చూపించిన కొత్తదనం ఇది. నేను గతంలో సీరియస్, పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్స్ క్యారెక్టర్స్ చేశాను. హీరోయిన్ కృతిశెట్టి ఆకట్టుకునేలా నటించింది. స్పిరిట్ రీడర్ లా ఆమె కనిపిస్తుంది. ఈ పాత్ర కోసం రీసెర్చ్ చేసి, ప్రిపరేషన్‌తో పర్ ఫార్మ్ చేసింది. ఫస్ట్ సీన్ చూసి నేను ఎంత బాగా నటిస్తుంది అనుకున్నా. హీరోయిన్ అంటే కొన్నిసార్లు గ్లామర్ డాల్ లా ఉండాల్సి వస్తుంది. ఎవరు కొత్త తరహా సినిమా చేసినా కనీసం మన వంతు ప్రోత్సాహం అందించాలి. లేకుంటే కొత్తగా ప్రయత్నించే వారు ముందడుగు వేయలేరు. సత్యం సుందరం లాంటి సినిమాను ఒకవేళ ప్రేక్షకులు ఆదరించ కుంటే మరో సారి అలాంటి సినిమా చేసే ప్రయత్నమే ఎవరు చేయరు కదా. అఖండ 2 రిలీజ్ కన్ఫమ్ కావడం హ్యాపీగా ఉంది. ఆ సినిమా కోసం నేను కూడా వెయిట్ చేస్తున్నా. కె.విశ్వనాథ్ గారి సినిమాలంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాల్లోని భావోద్వే గాలు, పాత్రల చిత్రణ అద్భుతంగా ఉం టాయి. విశ్వనాథ్ గారి సినిమాలు ఎప్పుడు చూసినా మనల్ని ఎంగేజ్ చేస్తుంటాయి.

## 'మోగ్లీ' 13న రిలీజ్



యంగ్ హీరో రోషన్ కనకాల రెండవ చిత్రం మోగ్లీ 2025 రిలీజ్ కు రెడీ అవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఇప్పటికే టీజర్, పాటలు, ట్రైలర్‌తో స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. ఈ చిత్రం డిసెంబర్ 12న విడుదల కావాల్సి ఉండగా, డిసెంబర్ 13కి వాయిదా వేశారు, అయితే ప్రీమియర్లు 12న ప్రారంభమవుతాయి. ప్రీమియర్ టాక్ సినిమాకు మరింత బెనిఫిట్ కానుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ ఛీర్ ఫుల్ గా కనిపించగా, బండి సరోజ్ కుమార్ ఇంటెన్స్ అవతార్ లో కనిపించారు. లీడ్ పెయిర్ మోడరన్ రాముడు-సీతల్లా చూపుతూ తమ ప్రేమకోసం పోరాటం చేసే జంటగా చిత్రీకరించారు. సరోజ్, రావణుడిని పోలిన ప్రతినాయకుడి పాత్ర. కథ ఈ మూడు పాత్రల మధ్య డైనమిక్ చుట్టూ తిరుగుతుంది. రోషన్ కనకాల ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మనసు హత్తుకునే ప్రేమకథతో నిండిన ఇంటెన్స్ డ్రామాగా ఉంటుందని హామీ ఇచ్చే అద్భుతమైన యాక్షన్ స్టంట్స్ ఉండబో తున్నాయి. హర్ష చెముడు కీలక సహాయక పాత్రను పోషిస్తున్నాడు.

## 'గుర్రం పాపిరెడ్డి'తో ఎంజాయ్ చేస్తారు:

### డైరెక్టర్ మురళీ మనోహార్



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా "గుర్రం పాపిరెడ్డి". ఈ చిత్రాన్ని డా.సంధ్యగోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తు న్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహార్ రూపొందిస్తున్నారు. మా నేటివ్ ప్లేస్ హైదరాబాద్. చిన్నప్పుడు శివ, నాయకుడు లాంటి సినిమాలు చూసిన ప్రభావంతో సినిమా ఇండస్ట్రీ వైపు ఆకర్షితుడిని అయ్యాను. ఇక్కడ ఎంబీఏ పూర్తిచేశాక లండన్ వెళ్లాను. అక్కడి ఫిలిం ఇనిస్టిట్యూట్ లో కోర్స్ చేసి వార్నర్ బ్రదర్స్ సంస్థలో ఎనిమిదేళ్లు వర్క్ చేశాను. ఆ తర్వాత ఇండియాకు తిరిగి వచ్చి డైరెక్టర్ సంపత్‌నందితో వర్క్ చేయడం ప్రారంభిం చాను. ఆయన డైరెక్ట్ చేసిన చాలా మూవీస్ కు నేను వర్క్ చేశాను. 2010 నుంచి టాలీవుడ్ లో ఉన్నాను. సంపత్ నంది సపోర్ట్ తో సింబా మూవీ చేశాను. ఆ సినిమా నా ఫస్ట్ మూవీ. అయితే అది రిలీజ్ కావడంలో ఆలస్యమైంది. అప్పటికే గుర్రం పాపిరెడ్డి ప్రాజెక్ట్ కూడా ఫైనలైంది. సింబా రిలీజ్ ఆలస్యం వల్ల ప్రొడ్యూసర్స్‌లో అనేక సందేహాలు ఉండేవి. ఫస్ట్ మూవీ ఎందుకు రిలీజ్ కాలేదు అని అనుకుంటారు కదా. కానీ చివరికి నా విజన్‌ను నమ్మి గుర్రం పాపిరెడ్డి సినిమా చేయడానికి ప్రొడ్యూసర్స్ డిసైడ్ అయ్యారు. ఈ సినిమాకు పూర్ణ కథ అందించారు. మిగతా రైటర్స్, నేను స్క్రిప్ట్ సైడ్ వర్క్ చేశాం. గుర్రం పాపిరెడ్డి సినిమాకు ఫస్ట్ మేము అనుకున్న టైటిల్ పరమపద సోపానం. ఆ తర్వాత ఆ టైటిల్ అంతగా రీచ్ కాదనే ఆలోచనతో గుర్రం పాపిరెడ్డి అని పెట్టాం. మూవీలో నరేష్ అగస్త్య క్యారెక్టర్ పేరు అది. తెలివైన వారు, తెలివితక్కువ వారి మధ్య జరిగిన వార్ ఈ మూవీ కాన్సెప్ట్. తెలివైనవారు తెలివితక్కువ పనిచేసినా, తెలివితక్కువ వారు తెలివైన పనిచేసినా వారి జీవితాలు ఎలా మారుతాయి అనేది హ్యూమరస్‌గా మా సినిమాలో తెరకెక్కించాం.


## 26న రిలీజ్ కు వస్తున్న 'వానర'



సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. ఈ రోజు 'వానర' సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్

అవినాష్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'వానర' ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. 'వానర' చిత్రాన్ని శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్ పై అవినాష్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. ఈ రోజు 'వానర' సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ నెల 26న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు ప్రకటిం చారు. ఇప్పటికే విడుదల చేసిన 'వానర' సినిమా ఫస్ట్ లుక్, రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదుగా రిలీజ్ చేసిన టీజర్ ను హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. మైథలాజికల్ రూరల్ డ్రామా కథతో తెరకెక్కిన 'వానర' మూవీ ఇయర్ ఎండ్ హాలీడే సీజన్‌లో ఒక డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు థియేటర్స్‌లోకి రాబోతోంది.

## 'జెట్లీ' రియా సింఘా ఫస్ట్ లుక్



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మేకర్స్ ముందుగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సత్య ఒక విమానం పైన కూర్చుని 'I am done with comedy' అని ప్రజెంట్ చేయడం హిలేరియస్ అనిపించింది. క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ) , హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. భారీ బ్యానర్లు చేతులు కలపడంతో ఇది స్కైలెవెల్ ఎంటర్టైనర్ రాబో తుందనే విషయం స్పష్టమవుతోంది. జెట్లీ తో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. రియా సింఘాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఈరోజు ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ఆమెను స్టైలిష్ యాక్షన్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది. విమానం లోపల మండుతున్న పేలుడు మధ్య, చేతిలో తుపాకీ పట్టుకొని కనిపించడం ఆకట్టుకుంది. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్.

ఆట

## ఐజిపిఎల్ ఇన్విటేషనల్..
# టైటిల్ సాధించిన కరణ్‌దీప్



**న్యూఢిల్లీ:** ఐజీపీఎల్ ఇన్విటేషనల్ యుఎఈ లో కరణ్‌దీప్ కొచ్చర్ చివరకు తన తొలి టైటిల్‌ను సాధించాడు. దుబాయ్‌లో తొలి సీజన్‌కు సంబంధించి గురువారం జరిగిన పదవ ఐజిపిఎల్ ఈవెంట్‌లో కొచ్చర్ తన ప్రత్యర్థులు యువ వీర్ గణపతి, పుఖ్‌రాజ్ సింగ్‌లనుఓడించాడు. ఇటీవల ఆసియా డెవలప్ మెంట్ టూర్ విజేత అయిన కొచ్చర్ వరుసగా మూడోసారి 3అండర్ 69తో మొత్తం 9అండర్ కొట్టాడు. అయితే అద్భుతమైన విజయాన్ని సాధిస్తున్న గణపతి వెనుక తొమ్మిది పాయింట్ల వద్ద పార్4 14వ హోల్‌పై ఖరీదైన ట్రిపుల్ బోగీతో ఉన్నాడు. అయితే అతను సమాన పార్ 72 స్కోర్ చేసి కొచ్చర్ కంటే ఒక షాట్ వెనుక ఉన్నాడు. అలాగే జంషెడ్‌పూర్ విజేత పుఖ్‌రాజ్ రెండవ స్థానంలో నిలిచాడు. అతను 2 అండర్ 70తో షాట్ చేశాడు. మరియు గణపతి లాగానే, 8అండర్ వద్ద మరియు విజేత కంటే ఒక అడుగు వెనుకబడి ఉన్నాడు. ఇక ఐజీపీఎల్ ముంబైలో చరిత్ర సృష్టించిన ప్రణవి ఉర్స్, నాల్గవ స్థానంలో నిలిచింది. ఆమె 54 హోల్స్‌కు 1 అండర్ 71 స్కోర్ చేసి మొత్తం 7అండర్ స్కోర్ చేసింది. ప్రణవి ఐజీపీఎల్‌లో మొదటి మహిళా విజేతగా మరియు పురుషులతో ఆడుతూ ప్రో ఈవెంట్‌ను గెలిచిన మొదటి మహిళగా నిలిచింది. గగన్‌జీత్ భుల్లార్ విజయాల పరంపర 71 రౌండ్ మరియు మొత్తం 6అండర్ తర్వాత ఐదవ స్థానంలో నిలిచింది. అతని మునుపటి రౌండ్లు 6772. భుల్లార్ గతంలో తన చివరి మూడు ఈవెంట్‌ల ప్రారంభంలో ఓడిపోయినా తదుపరి ప్రతిసారీ గెలిచాడు.

## ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్ స్లామ్..
# ఫైనల్స్‌కు కార్ల్‌సెన్




**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్ స్లామ్‌లో మాగ్నస్ కార్ల్‌సెన్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అలాగే లెవాన్ అరోనియన్ మరో సెమీఫైనల్లో జర్మన్ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్‌ను అధిగమించాడు. మాజీ ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జావోఖిర్ సిందారోవ్‌ను ఓడించి ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్ టైటిల్ పోరుకు చేరుకున్నాడు. ఆట ప్రారంభంలో సిందరోవ్ తన ప్రత్యర్థి కార్ల్‌సెన్‌పై తీవ్రంగా ఒత్తిడి తెచ్చాడు. రెండవ రాపిడ్ గేమ్‌ను గెలిచి బ్లిట్జ్ టైబ్రేక్‌ను సైతం బలవంతం చేశాడు. ఇది ఇరువురి వ్యూహాల నడుమ తీవ్రమైన పెనుగులాటలకు దారితీసింది. నార్వేజియన్ ఆటగాడు మొదటి 5+2 గేమ్‌ను గెలిచాడు. మరియు రెండవ గేమ్‌ను డ్రాగా ముగించి తన పురోగతిని నిర్ధారించాడు. అక్కడ అతను అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్‌తో తలపడనున్నాడు. మరో సెమీఫైనల్లో, రెండు ప్రారంభ రాపిడ్ రౌండ్లలో డ్రా అయిన తర్వాత, బ్లిట్జ్ టైబ్రేక్‌లలో అరోనియన్ జర్మన్ గ్రాండ్ మాస్టర్ విన్సెంట్ కీమర్‌ను 2-0తో ఓడించాడు. ఇక దిగువ బ్రాకెట్‌లో, భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఎరిగైసి సెమీఫైనల్‌లో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ హాన్స్ నీమాన్‌ను ఓడించాడు. ఐదవ స్థానం కోసం ఎరిగైసి ఇప్పుడు అమెరికాకు చెందిన ఫాబియానో కరువానాతో తలపడనున్నాడు.

## వన్డే ర్యాంకింగ్స్‌లో
# రో.. కో.. హవా

### వరల్డ్ నం. 1, 2 బ్యాటర్లుగా రోహిత్, కోహ్లీ రికార్డు



**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకోగా, రోహిత్ శర్మ నెంబర్ వన్ ర్యాంకులో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజా ర్యాంకింగ్‌లో కోహ్లీ స్థానం మెరుగైంది. దక్షిణాఫ్రికాతో ఇటీవల జరిగిన ఓడీఐ సిరీస్‌లో 302 పరుగులు చేసిన కోహ్లీ రెండవ స్థానానికి ఎగబాకాడు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేలలో ప్రపంచ నంబర్1 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. కేఎల్ రాహుల్‌కు కూడా బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో కొన్ని స్థానాలు మెరుగయ్యాడు. కోహ్లీ దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లోని 3 మ్యాచ్‌లలో 2 సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో సహా 302 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో రన్ మేషిన్ కోహ్లీ 4వ స్థానం నుండి 2వ స్థానానికి చేరుకున్నాడు. కోహ్లీ రేటింగ్ పాయింట్లు 773 కాగా, మొదటి స్థానంలో ఉన్న రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో టాప్ లో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ 146 పరుగులు చేశాడు. దాంతో మొదటి స్థానాన్ని నిలుపుకున్నాడు. ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్ ఆడకపోయినా రెగ్యూలర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 5వ స్థానం సురక్షితంగా ఉంది. అయితే అతనికి బాబర్ ఆజమ్‌కు మధ్య రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఒక్క పాయింట్ మాత్రమే కావడంతో నెక్స్ట్ సిరీస్ లో మెరుగ్గా ఆడితేనే టాప్ 5లో ఉంటాడు. టాప్10లో నాల్గవ భారత బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్, ఒక స్థానం పడిపోయి 10వ స్థానానికి చేరాడు. కేఎల్ రాహుల్‌కు 2 స్థానాలు మెరుగు పరుచుకుని 12వ స్థానానికి ఎగబాకాడు. ఇక బౌలర్లలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఓడీఐ సిరీస్‌లో భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 9 వికెట్లు తీసి సిరీస్‌లో సక్సెస్ ఫుల్ బౌలర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శన అతన్ని వన్డే బౌలింగ్ ర్యాంకింగ్‌లో 3వ స్థానానికి చేర్చింది. కుల్దీప్ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్ టాప్10 జాబితాలో ఉన్న ఏకైక భారత బౌలర్. మరోవైపు స్పిన్నర్ రవీంద్ర జడేజా 2 స్థానాలు కోల్పోయి 16వ స్థానానికి పడిపోయాడు. అయితే భారత పేసర్ అర్షదీప్ సింగ్ 29 స్థానాలు ఎగబాకి 66వ స్థానాన్ని సాధించాడు. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు బౌలింగ్ ర్యాంకింగ్‌లో మరింత కిందకు వెళ్లాడు.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫైనల్స్‌లో
# మనుష్-దియా ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటిటి) ఫైనల్స్ 2025లో భారత్ మిక్స్‌డ్ ద్వయం మనుష్ షా-దియా చిటాలే వరుసగా 10 పాయింట్లు కోల్పోయి మ్యాచ్‌ను వదులుకున్నారు. హాంకాంగ్‌లో ఫైనల్స్‌లో గురువారం జరిగిన గ్రూప్ 1 పోరులో భారత టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మనుష్-దియా వరుసగా రెండో ఓటమిని చవిచూశారు. వారు తమ సొంత ఫేవరెట్‌లు వాంగ్ చున్ టింగ్-డూ హోయ్ కెమ్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయారు. నిర్ణయాత్మక మ్యాచ్‌లో షా, చిటాలే 4-1 ఆధిక్యాన్ని పొందారు, తర్వాత వారి ప్రపంచ నంబర్ 5 ప్రత్యర్థులు వరుసగా పది పాయింట్లు గెలుచుకుని తమ విజయాన్ని సాధించారు. స్కోరు 4-1 నుండి 4-11కి చేరుకోవడంతో భారత జట్టు ఓటమిని చవిచూసింది. అంతకుముందు, ప్రపంచ 9వ ర్యాంక్ షా-చిటాలే తొలి రెండు గేమ్‌లను వరుసగా 7-11, 3-11 తేడాతో ఓడించారు. షా నుండి కొన్ని అసాధారణ బ్యాక్‌హ్యాండ్ ఆట, చిటాలే నుండి స్మార్ట్ సర్వీస్‌లతో తదుపరి రెండు గేమ్‌లను 11-4, 12-10 తేడాతో గెలిచారు. కాగా 2025 డబ్ల్యూటిటి ఫైనల్స్‌లో ఇప్పటివరకు తమ గ్రూప్1 మ్యాచ్‌లలో రెండు ఓడిపోయిన చిటాలే-షా ప్రస్తుతం నాలుగు జట్ల పట్టికలో అట్టడుగున ఉన్నారు. గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉన్న రెండు జట్లు మాత్రమే సెమీఫైనల్‌కు చేరుకోనున్నాయి. దీంతో ఈ టోర్నీలో కొనసాగాలంటే చిటాలే-షా తదుపరి చైనాకు చెందిన లిన్ షిడాంగ్-కుయ్ మ్యాన్‌లతో జరిగే మూడవ, చివరి మ్యాచ్‌లో విధిగా గెలవాల్సి ఉంటుంది.



## స్క్వాష్ ప్రపంచ కప్..
# క్వార్టర్ ఫైనల్లోకి భారత్

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ కప్-2025, క్వార్టర్ ఫైనల్లోకి భారత్ దూసుకెళ్లింది. చెన్నైలో గురువారం బ్రెజిల్‌పై 3-0 తేడాతో క్లినికల్ విజయంతో 2025 స్క్వాష్ ప్రపంచ కప్‌లో భారతదేశం తన స్థిరమైన పరుగును కొనసాగించింది. భారత్ జాతీయ ఛాంపియన్ వేలవన్ సెంథిల్‌కుమార్ పెడ్రో మొమెట్టోపై బలమైన



ప్రదర్శనతో ప్రారంభించాడు. బ్రెజిలియన్‌ను 3-0 (7-5, 7-2, 7-2)తో ఓడించాడు. ప్రపంచ 45వ ర్యాంకర్ డ్రాప్ షాట్‌ల కలయికతో భారత్‌కు బలమైన ఓపెనింగ్ ఇవ్వడానికి టెంపోను నిర్దేశించాడు. అలాగే టీనేజ్ సంచలనం అనాహత్ సింగ్ తన ప్రత్యర్థి లారా సిల్వాపై 3-0 (7-4, 7-0, 7-2) తేడాతో విజయం సాధించి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. భారత్ అగ్రశ్రేణి మహిళ అనాహత్ ఈ టోర్నమెంట్‌లో అతి పిన్న వయస్కురాలైన స్క్వాష్ క్రీడాకారిణి. ఇక అభయ్ సింగ్ కూడా త్వరగా మ్యాచ్‌ను భారత్‌కు అనుకూలంగా మార్చాడు. ప్రపంచ 86వ ర్యాంకర్ డియెగో గొబ్బిపై 3-0 (7-3, 7-1, 7-1) తేడాతో విజయం సాధించాడు. శుక్రవారం దక్షిణాఫ్రికాతో క్వార్టర్‌ఫైనల్ పోరుకు భారత్ ప్లేయర్లు సిద్ధమయ్యారు.

# గ్లోబల్ పారిశ్రామిక పవర్‌హౌస్‌గా భారత్




### బోస్టన్, జడ్ 47 సంస్థల సంయుక్త సర్వే

**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** ఉత్పత్తిరంగంలో భారత్ 2047 నాటికి ప్రపంచ పారిశ్రామిక పవర్‌హౌస్‌గా మారుతుందని, దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఉత్పత్తిరంగం వాటా 17శాతంనుంచి 25శాతానికి పెరుగుతుందని నివేదిక స్పష్టంచేసింది. బోస్టన్ కన్సల్టింగ్‌గ్రూప్, జడ్47 సంస్థల సంయుక్త సర్వేలో ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఆటోమోటివ్, ఎలిక్ట్రిక్ వాహనాలు, ఇంధనం, ఫార్మారంగం వంటి ఐదు రంగాలు 2047 నాటికి జిడిపికి 25 లక్షలకోట్ల డాలర్ల వాటాను అందిస్తాయని అంచనావేసాయి. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్స్ రంగాల్లో భారీ విస్తరణ చోటుచేసుకుంటుందని, భారత్‌లో సెమికండక్టర్ డిమాండ్ 33 బిలియన్ డాలర్లనుంచి 2030 నాటికి 117 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనావేసారు. ఆత్మనిర్భరత వ్యూహంతో ముందుకు వెళుతున్నదని తేల్చారు.

కేవలం అసెంబ్లింగ్ మాత్రమే కాకుండా డిజైనింగ్; ఇన్నొవేటింగ్; ఇంటిగ్రేటింగ్ వంటి వాటితో గ్లోబల్ విలువల బాటకు మరింత పటిష్టత తెస్తుందని బిసిజి ఎండి ఇషాంగ్ జావా వెల్లడించారు.

విద్యుత్ వాహనాల విక్రయాలు 50 వేలనుంచి 2024 నాటికి 20 లక్షలకు పెరిగాయని ప్రపంచ ఇవి స్టాక్‌లో 9శాతం వాటాతోఉన్నట్లు తేలింది. అంతే కాకుండా ఆటో విడిబాగాలపరంగా 100 బిలియన్ డాలర్ల ఎగుమతి అవకాశాలు కూడా పెరుగుతాయని బిసిజి వివరించింది. ఉత్పత్తిరంగంలో అనూహ్యంగా తన అంతర్జాతీయ స్థాయి హోదాను సుస్థిరం చేసుకుంటుందని బిసిజి భాగస్వామి నటరాజన్ శంకర్ వ్యాఖ్యానించారు. ఈవీలు, అడ్వాన్సు ఎలక్ట్రానిక్స్ రంగాల్లో భారత్ అన్నిరంగాలకంటే ముందుకు సాగుతోందన్నారు. శిలాజ ఇంధన సామర్థ్యంలో 50శాతం లక్ష్యాలు సాధించిందని, మరింతగా సాధిస్తుందన్నారు. ఆర్‌అండ్‌డి పటిష్టంచేయడం, డిజైన్ మెరుగుపరుచుకోవడం, ప్రతిభను మరింత శక్తివంతంచేయడం, బ్రెయిన్‌డ్రెయిన్‌ను సానపెట్టడం వంటివి అవసరం అవుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనకు ఈరంగాలే భారత్ ఉత్పత్తి రంగాన్ని టాప్‌లో నిలుపుతాయని జడ్47 ఎండి సుదీప్తో సన్నిగ్రాహి తెలిపారు. అమెరికాలోని భారతీయ నిపుణులు, పిహెచ్‌డి ప్రతిభావంతులను రాబట్టుకోవాలని, నిర్దేశిత పాలసీల్లో రెవెన్యూ వృద్ధికి డీప్‌టెక్ స్టార్టప్‌లను పెంచాలని సూచించారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, డిసెంబరు 11:** భారతీయ స్టాక్‌మార్కెట్లు మూడురోజుల నష్టాల నుంచి రికవరీ కాగలిగాయి. అమెరికా ఫెడ్ రిజర్వు 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో ఆప్రభావం సెన్సెక్స్ నిఫ్టీలపై చూపించింది. ట్రేడింగ్ ముగిసే నాటికి సెన్సెక్స్ 426.86 పాయింట్లు పెరిగి 84,818.13 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 140.55 పాయింట్లు పెరిగి 25,898.55 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. మేజర్ స్టాక్స్ రికవరీ బాటలో నడిచాయి. టాటాస్టీల్, ఎటర్నల్, కోటక్ మహీంద్రబ్యాంకు, అల్ట్రాటెక్ సిమెంట్; మారుతిసుజుకి, ఇండియా, సన్‌ఫార్మా, టెక్ మహీంద్ర, టిఎంపివిలు సెన్సెక్స్‌లో టాప్ పనితీరుచూపించాయి. ఇవన్నీ కూడా 2.5శాతం వరకూ పెరిగాయి. అలాగే ఏసియన్ పెయింట్స్, బజాజ్‌ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంకు, పవర్‌గ్రిడ్, ఐసిఐసిఐ బ్యాంకు, టైటాన్ సంస్థలు కొంతమేర నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్‌సూచీ 0.97శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.81శాతం పెరిగాయి. సెక్టార్ల వారీగాచూస్తే నిఫ్టీ మీడియా సూచి ఎక్కువ నష్టపోయింది. నిఫ్టీ అయిల్ అండ్ గ్యాస్ సూచీ కూడా స్వల్పంగా తగ్గి 0.03వద్దనిలిచింది. ఇక సానుకూలంగా చూస్తే మెటల్, ఆటోరంగాలషేర్లు పటిష్టంగా ట్రేడ్ అయ్యాయి. బయ్యర్లలో ఆసక్తిని పెంచాయి. నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఆటోసూచీలు 1.06శాతం, 1.11శాతం చొప్పున పెరిగాయి. ఫార్మా కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు కూడా ఒకటి శాతం చొప్పున పెరిగాయి. దేశీయ మార్కెట్లు ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్ల రేట్‌కట్‌తో పాటు అమెరికా అధికద్రవ్యోల్బణం వల్లననేనని తేలింది. అమెరికా పదేళ్లబాండ్ల రాబడులు స్వల్పంగా మెరుగుపడినా భవిష్యత్తులో విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాలకు సంకేతాలిచ్చాయి.

ఇక డాలరుతో రూపాయిమారకం విలువలు 39 పైసలు క్షీణించి 90.33వద్ద స్థిరపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదవ తేదీనాటివి 0.94శాతంపెరిగి 1.31 లక్షల పదిరూపాయలకు చేరింది. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు జనవరినెల సెటిల్‌మెంట్లు 88 సెంట్లు తగ్గి 61.33 డాలర్లకు ట్రేడ్ అయింది. గ్లోబల్ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు కొంతమేర పెరిగాయి. స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంకు తన ఎంపిసి నిర్ణయాలను ప్రకటించింది. వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించింది. ఆసియా మార్కెట్లుమాత్రం దిగువ స్థాయిలోనే ముగిసాయి. రాత్రికి రాత్రే అమెరికా మార్కెట్లలో డౌజోన్స్ పారిశ్రా మిక సగటు 1.1శాతంగా ఉంది. ఎస్‌అండ్‌పి 500 0.7శాతంపెరిగితే నాస్‌డాక్ కాంపోజిట్ 0.3శాతం పెరిగింది. ఫెడ్‌రిజర్వు తన వడ్డీరేట్ల సమీక్షలో 25 బేసిస్‌పాయింట్లు తగ్గించి 3.75శాతంనుంచి 3.50శాతానికి తీసుకువచ్చింది. సంస్థ ఛైర్మన్ జెరోమ్‌పావెల్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంకు చర్యలు మార్కెట్లలో నగదు లభ్యతను పెంచుతుందన్నారు. అలాగే ఫెడ్ రిజర్వు 40 బిలియన్ డాలర్ల ట్రెజరీ బిల్స్ కొనుగోలుచేయాలనినిర్ణయించింది.



## అమెరికా బాటలోనే
# మెక్సికో..

### దిగుమతులపై 50% సుంకాలు

**మెక్సికోసిటీ, డిసెంబరు 11:** భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ట్రంప్‌నిర్ణయంతో భారత్ అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇక ఇప్పుడు తాజాగా అమెరికా బాటలోనే మరో దేశంకూడా ఇండియాకి షాకిచ్చింది. భారత్ సహా పలు దక్షిణాసియా దేశాలపై సుంకాలు విధించేందుకు మెక్సికో సిద్ధమైంది. భారత్, చైనా, దక్షిణ కొరియా వంటి పలు దక్షిణాసియా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై భారీగా సుంకాల్ని పెంచే బిల్లుకు మెక్సికన్ సెనెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కనీసం 5శాతం నుంచి 50శాతం వరకు దిగుమతి సుంకాల్ని పెంచేబిల్లుకు మెక్సికో సెనెట్ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుకు 76 మంది అనుకూలంగా, 5 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కొత్త సుంకాలు వచ్చే ఏడాది నుంచే అమల్లోకి రానున్నాయి. దుస్తులు, లోహాలు, ఆటోమొబైల్ విడి భాగాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉక్కు సహా అనేక ఉత్పత్తులపై వీటి ప్రభావం పడనుంది. ఈ నిర్ణయంతో దక్షిణాసియా దేశాలపై మెక్సికో వాణిజ్య యుద్ధం ప్రకటించినట్లైంది.

# భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు రెడీ




### ఎలాన్‌మస్క్ ట్వీట్

**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించనున్నది. ఈ మేరకు ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్ ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. కొద్దిరోజుల్లోనే సేవలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన సంకేతాలను పంపారు. సోషల్ మీడియా వేదికగా కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ స్టార్‌లింక్‌తో భారత్‌కు సేవ చేసేందుకు ఎదురుచూస్తున్నాను అని స్పందించారు. కేంద్ర ప్రభుత్వంతో స్టార్‌లింక్ బృందం చర్చలు జరుపుతున్న నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నది.

స్టార్‌లింక్‌కు చివరి దశ అనుమతి రావాల్సి ఉన్నది. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో స్టార్‌లింక్ వైస్ ప్రెసిడెంట్ లారెన్ డ్రేయర్ ఇటీవల ఢిల్లీలో భేటీ అయ్యారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు శాటిలైట్ ఆధారిత కనెక్టివిటీని విస్తరించడం ప్రయత్నంలో భాగంగా చర్చలు జరిపినట్లుగా సింధియా చెప్పారు. సంప్రదాయ నెట్‌వర్క్ అందుబాటులో లేని చోట్ల శాటిలైట్ ఇంటర్నెట్ కీలకం కానుందన్నారు. దేశవ్యాప్తంగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని లారెన్ డ్రేయర్ తెలిపారు. అయితే, గ్రామీణ ప్రాంతాలకే స్టార్‌లింక్ సేవలు పరిమితమవుతాయని మస్క్ స్పష్టం చేశారు. కనెక్టివి లేని, ఖరీదైన, నమ్మకం లేని బ్రాడ్‌బ్యాండ్ ఉన్న ప్రాంతాల్లోని వారిని దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు పేర్కొన్నారు. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరలు వెబ్‌సైట్‌లో వైరల్ అయ్యాయి. రెసిడెన్షియల్ యూజర్స్‌కు నెలకు రూ.8600, హార్డ్‌వేర్ కిట్‌కు అదనంగా రూ.34 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఈ ప్యాకేజీలో శాటిలైట్ డిష్, వైఫై రౌటర్, మౌంటింగ్ స్టాండ్, పవర్ అడాప్టర్, కేబుల్స్‌తో కూడిన ప్లగ్ అండ్ ప్లే కిట్‌ను కస్టమర్లకు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే, ఈ ధరలపై స్టార్‌లింక్ స్పందిస్తూ సాంకేతిక లోపం వల్లే అలా జరిగిందని ఆ ధరలు వాస్తవమైనవి కావని కంపెనీ స్పష్టం చేసింది. స్టార్‌లింక్ ఇండియా వెబ్‌సైట్ ఇంకా అధికారికంగా లాంచ్ చేయలేదని.. కస్టమర్ల నుంచి ఆర్డర్లు తీసుకోవడం లేదని తెలిపింది.

## అన్నిరంగాలకంటే పసిడి పెట్టుబడుల్లోనే 15% రిటర్నులు
### ఫండ్స్ ఇండియా విశ్లేషణ



**న్యూఢిల్లీ, డిసెంబరు 11:** పెట్టుబడుల పరంగా ఇపుడు అన్నింటికంటే బంగారం సురక్షితంగా కనిపిస్తున్నది. దీర్ఘకాలిక రిటర్నుల్లో కూడా బంగారం రిటర్నులు భారీగా ఉంటున్నాయి. వార్షిక సమిష్టిరిటర్నులు 15శాతంగా ఉంటున్నట్లు నిపుణుల అంచనా. రానున్న 20యేళ్లపాటు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. భారతీయ ఈక్విటీ మార్కెట్లలో అయితే 13.5శాతం, నిఫ్టీ 50 సూచీలోనూ ఇదే తీరు ఉంటే రూపాయి విలువల్లో పసిడి రిటర్నులు సాలీనా 15శాతంవరకూ ఉంటాయని ఫండ్స్ ఇండియా నివేదిక స్పష్టంచేసింది. ఇక రియల్‌ఎస్టేట్ 7.8శాతం రిటర్నులు ఇస్తే డెట్‌రంగం 7.6శాతం రిటర్నులు ఇస్తుందని, భారత ఈక్విటీలు 20 ఏళ్లకాలానికి రిటర్నులు 14.8శాతంగాను ఉంటాయని అంచనావేసింది. స్వల్పకాలానికిగాను ఐదేళ్ల కాలపరిమితితో పసిడి పనితీరుపటిష్టంగా ఉంది. ఐదేళ్లకాలానికిగాను సమిష్టి వార్షిక వృద్ధిపరంగా 23.2శాతంగాఉంటుంది. అదే భారతీయ ఈక్విటీలు 16.5 శాతం, అమెరికా ఈక్విటీలు 19.6శాతం మాత్రమే రిటర్నులు ఇస్తాయని తేలింది. ఇక మిడ్ స్మాల్‌క్యాప్ స్టాక్స్ 20 ఏళ్లకాలానికిగాను నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 సూచీ 16.5 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ250 సూచీ 14.3శాతం మాత్రమే రిటర్నులు రాబట్ట గలవని అంచనావేసింది. మిడ్, స్మాల్‌క్యాప్‌స్టాక్స్ ఎక్కువ అనిశ్చితిని పెంచుతుందని తేలింది. 22 ఏళ్లకాలానికి దీర్ఘ ప్రణాళికప్రకారంచూస్తే 19.6శాతం మాత్రమే రిటర్న్ లుంటాయని అంచనావేసింది. ఇక డెట్‌మార్కెట్లు మాత్రం దీర్ఘకాలిక రిటర్నుల పరంగా 7నుంచి 8శాతం వరకూ ఉంటాయని ఫండ్స్‌ఇండియా విశ్లేషించింది. విధాన నిర్ణయాలకు తోడు వినియోగం పునరుద్ధరణ జరిగితే భారత ఈక్విటీ మార్కెట్లలో రెండంకెల వృద్ధిని సాధించగలమని హెచ్‌ఎస్‌బిసి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చి అంచనావేసింది.




# నెలవారీగా తగ్గుతున్న 'సిప్' ఫండ్స్

**ముంబయి, డిసెంబరు 11:** పెట్టుబడులపరంగా సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులు నవంబరునెలలో రూ.29,445కోట్లుగా ఉన్నట్లు తేలింది. అంతకుముందు అక్టోబరునెలలో 29,529 కోట్లుతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. మ్యూచువల్‌ఫండ్ అసోసియేషన్ ఇండియా ఆంఫీ గురువారం గణాంకాలను విడుదలచేసింది. స్వల్ప తగ్గుదలతోపాటు మొత్తంగా ఇన్వెస్టర్లు మాత్రం నవంబరులో భారీ సంఖ్యలోనే పెట్టుబడులకు ముందుకువచ్చారు. నికర ఈక్విటీ పెట్టుబడులు 29,894 కోట్లుగా ఉన్నాయి. మొత్తం నిర్వహణ ఆస్తులు ఆంఫీ పరంగాచూస్తే రూ.80.80 లక్షలకోట్లుగా ఉన్నాయి. అంతకుముందు నెలలో రూ.79.87 లక్షలకోట్ల నుంచి గణనీయంగా వృద్ధినినమోదుచేసింది. లార్జ్‌క్యాప్ ఫండ్స్ రూ.1640 కోట్లు పెట్టుబడులు ఆకర్షిస్తే మిడ్‌క్యాప్‌ఫండ్స్‌లో 4487 కోట్లవరకూ పెట్టుబడులు వచ్చాయి. ఇక స్మాల్‌క్యాప్‌ఫండ్స్‌పరంగా 4407 కోట్లు పెట్టుబడులు నవంబరులో ఉన్నట్లు తేలింది. ఇక గోల్డ్ ఇటిఎఫ్‌లపరంగా కొంతమేర క్షీణత కనిపించింది. రూ.7743 కోట్లనుంచి 3742కోట్లకు తగ్గాయి. ఇక ఇతర ఇటిఎఫ్‌లు స్వల్పంగాపెరిగాయి. 6182 కోట్లనుంచి రూ.9721 కోట్లవరకూ ఉన్నట్లు ఆంఫీ వెల్లడించింది. ఎంపికచేసిన ప్రనత్యేక విభాగాల్లో ఫండ్స్ 1865 కోట్లకు పెట్టుబడులుపెరిగాయి. ఇక ఫండ్స్ విత్‌డ్రాలపరంగా నవంబరులో రూ.14,050 కోట్లుగా ఉన్నాయి. అదే అక్టోబరులో రూ.89.375 కోట్లతోపోలిస్తే మెరుగుపడినట్లు తెలుస్తోంది. డివిడెండ్లు ఇచ్చే ఫండ్స్ కూడా ఎక్కువ విత్‌డ్రా అయ్యాయి. రూ.179 కోట్లనుంచి రూ.278 కోట్లకు పెరిగినట్లు ఆంఫీ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.